ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 05.08.2026 | సంపుటి : 13 సంచిక : 16 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్






# ఎల్ఐసీ షేర్లకు భారీ దెబ్బ

- 6.5% వాటాల విక్రయంతో విలువ పతనం
- కేంద్ర నిర్ణయంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన




**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (జనంసాక్షి):** ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ షేర్లు మంగళవారం భారీ ఒత్తిడికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం 6.5 శాతం వాటాను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్న నేపథ్యంలో షేరు ఒక దశలో దాదాపు 9 శాతం వరకు పతనమైంది. చివరకు 8.66 శాతం నష్టంతో రూ.391.40 వద్ద ముగిసింది. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా మొత్తం 82.22 కోట్లకు పైగా షేర్లను విక్రయించాలని కేంద్రం నిర్ణయించింది. సోమవారం ఎన్ఎస్ఈలో రూ.428.50 వద్ద ముగిసిన షేరుకు, ఈ ఇష్యూలో ఒక్కో షేరును రూ.382కే ఆఫర్ చేయడంతో పెట్టుబడిదారులు అమ్మకాల వైపు మొగ్గుచూపారు. ఈ విక్రయానికి పూర్తిస్థాయిలో స్పందన లభిస్తే కేంద్ర ఖజానాకు సుమారు రూ.31 వేల కోట్లు సమకూరనున్నాయి. మంగళ వారం రిటైల్తర పెట్టుబడిదారులకు, బుధవారం రిటైల్ పెట్టుబడిదా రులకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా నష్టాలతో ముగిశాయి. వరుసగా నాలుగు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో పాటు ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్, రియాల్టీ, ఐటీ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. బుధవారం ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో కూడా మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. సెన్సెక్స్ 210.08 పాయింట్లు కోల్పోయి 78,428.95 వద్ద, నిఫ్టీ 159.40 పాయింట్లు తగ్గి 24,614.90 వద్ద ముగిశాయి. డాలర్తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.37 వద్ద నమోదైంది. సెన్సెక్స్లో హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండి గో, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోగా.. ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్సర్వ్ షేర్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్కు 85.58 డాలర్ల వద్ద, బంగారం ఔన్స్ ధర 4,047.14 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.





# చర్చకు ఎందుకు భయం?

ప్రధాని మోడీ సభకు రావాలి!

- విద్యార్థులపై లాఠీచార్జీ, అయోధ్య అవినీతిపై చర్చ జరగాల్సిందే..
- కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే డిమాండ్
- ప్రతిపక్ష ఆందోళనతో ఉభయ సభలు పలుమార్లు వాయిదా





**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (జనంసాక్షి)**

విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీ, అయోధ్య రామాలయ విరాళాల వ్యవహారంపై పార్లమెంట్లో తక్షణమే చర్చ జరపాలని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. ఈ రెండు అంశాలు దేశ ప్రజలకు సంబంధించినవని, ప్రభుత్వం వాటిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు.

పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాజ్యసభలో మాట్లాడిన ఖర్గే, నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వం వారి స్వరాన్ని అణచివేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అలాగే అయోధ్య రామాలయ విరాళాల నిర్వహణపై వచ్చిన ఆరోపణలపై కూడా పార్లమెంట్లో సమగ్ర చర్చ జరగాలని ఖర్గే కోరారు. ప్రజల విశ్వాసానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సభకు వచ్చి ఈ రెండు అంశాలపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లకు మద్దతుగా కాంగ్రెస్తో పాటు పలు ప్రతిపక్ష పార్టీలు నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగాయి. ప్రభుత్వం చర్చకు అంగీకరించకపోవడంతో ఉభయ సభల్లో పలుమార్లు గందరగోళం నెలకొంది. సభా కార్యక్రమాలు పదేపదే వాయిదా పడడంతో పార్లమెంట్ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి. ఖర్గే మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై చర్చ జరగకుండా అడ్డుకోవడం సరికాదు. ప్రజలకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం పార్లమెంట్కు జవాబుదారీగా ఉండాలి" అని పేర్కొన్నారు.



అమెరికా నుంచి ఇథనాల్ దిగుమతులు..

# దేశానికి భారీ నష్టం?

ఈ20 పెట్రోల్పై దేశవ్యాప్తంగా మహా ఉద్యమం చేపట్టాలి

ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలపాలి: అరవింద్ కేజ్రీవాల్ పిలుపు



**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (జనంసాక్షి):** ఈ20 పెట్రోల్ విధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పిలుపు నిచ్చారు. అమెరికా నుంచి ఇథనాల్ను దిగుమతి చేసుకోవడం వల్ల దేశ ఆర్థిక ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆయన ఆరోపించారు. భారత రైతులు ఉత్పత్తి చేసే చెరకు, మొక్కజొన్న వంటి పంటలతో దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన సమయంలో విదేశాల నుంచి కొనుగోలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనదారులపై అదనపు భారం పడుతోందని, అనేక వాహనాలకు ఇది పూర్తిస్థాయిలో అనుకూలం కాదనే సందేహాలు ఉన్నాయని కేజ్రీవాల్ అన్నారు. అయినప్పటికీ ప్రజల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. దేశ ప్రయోజనాలు, రైతుల సంక్షేమం, వినియోగదారుల హక్కులను దృష్టిలో ఉంచుకుని ఈ20 పెట్రోల్ విధానాన్ని పునఃసమీక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రజలు రోడ్లపైకి వచ్చి శాంతియుతంగా నిరసనలు తెలియజేస్తూ దేశవ్యాప్తంగా మహా ఉద్యమం చేపట్టాలని కేజ్రీవాల్ పిలుపునిచ్చారు.

# వీడియో తొలగింపుపై కేంద్రం సీరియస్

- ప్రధాని వీడియో ఎందుకు తొలగించారు?
- మార్క్ జుకర్బర్గ్ క్షమాపణ చెప్పాలి
- మెటాకు కేంద్రం నోటీసులు




**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ప్రధాని నరేంద్ర మోడీ అఫీషియల్ సోషల్ మీడియా ఖాతాలైన ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్లో పోస్ట్ చేసిన ఓ వీడియోను తాత్కాలికంగా తొలగించడంపై కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు మెటా గ్లోబల్ పబ్లిక్ పాలసీ హెడ్ జోయెల్ కాప్లాన్, ఇన్స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మోస్సేరిలతో సహా ఉన్నతాధికారులకు తాజాగా కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. సాంకేతిక లోపం అని 'మెటా' ఇచ్చిన వివరణ సరిపోదని, ప్రధాని స్థాయి వ్యక్తి పోస్ట్ చేసిన కంటెంట్ విషయంలో ఆటోమేషన్ సాకు సరికాదని ఆ నోటీసులలో పేర్కొన్నట్లుగా మిగతా 2లో..

# ఉదయనిధి వ్యాఖ్యల దుమారం

- తమిళనాట హైడ్రామా
- ఉదయనిధి అరెస్ట్.. విడుదల

**చెన్నై, (జనంసాక్షి) :** తమిళనాడు రాజకీయాలు గరంగరంగా ఉన్నాయి. మాజీ మంత్రి, డీఎంకే యువనేత, ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్ అయ్యారు. ఈ అరెస్టుతో తమిళనాట పొలిటికల్ హీట్ అమాంతం పెరిగింది. సీఎం విజయ్, నటి త్రిషపై అభ్యంతరకర వ్యాఖ్యల కేసులో అరెస్టయిన డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్కు ఊరట లభించింది. మద్రాస్ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. పోలీసుల విచారణకు సహకరించాలని స్పష్టం చేసింది. ఉదయ్ నిధి విడుదలకు ఆదేశించింది. ఉదయనిధిని మంగళవారం ఉదయం చెన్నైలోని ఆయన నివాసంలో పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఉదయ నిధి దాఖలు చేసిన బెయిల్ పిటిషన ను విచారించిన చెన్నై హైకోర్టు వెంటనే ఆయనను విడుదల చేయాలని ఆదేశించింది. అయితే ఎఫ్ఐఆర్ నమోదైనందునా విచారణ చేస్తున్నామని, విచారణ తర్వాత విడుదల చేస్తామని పోలీసులు హైకోర్టుకు నివేదించారు. ఇరువర్గాల వాదనల విన్న హైకోర్టు ఉదయ్ నిధికి బెయిల్ మంజూరు చేసింది.





# మెడికల్ హబ్గా వరంగల్

నిమ్స్ తరహాలో ఎంజీఎం అభివృద్ధి

- మరో 9 సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- రాష్ట్రంలో ఎంఎన్జే తర్వాత, రెండో అతిపెద్ద ప్రభుత్వ కేన్సర్ హాస్పిటల్
- మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి

**వరంగల్ బ్యూరో, (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఎంఎన్జే తర్వాత, రెండో అతిపెద్ద ప్రభుత్వ కేన్సర్ హాస్పిటల్ను వరంగల్లో ఏర్పాటు చేస్తామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక కేన్సర్ వైద్య సేవలను అందించే విధంగా వరంగల్ రీజనల్ కేన్సర్ హాస్పిటల్ను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ను ఈ ఏడాది చివరికల్లా అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఈ మేరకు వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సెక్రటేరియట్లోని తన చాంబర్లో మంత్రి కొండా సురేఖతో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష మిగతా 2లో..

# హైదరాబాద్కు అరుదైన గౌరవం

- తెలంగాణ ప్రతిష్ఠ మరో మెట్టు
- కేటీఆర్ ప్రశంసలు



**హైదరాబాద్, (జనంసాక్షి) :** 'ఆజాద్ ఇంజనీరింగ్, 'డీఆర్డీవో' సంయుక్తంగా సాధించిన చరిత్రాత్మక విజయంపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. 350 కేజీల మొట్టమొదటి స్వదేశీ థ్రస్ట్-క్లాస్ ఎక్స్ పెండబుల్ టర్బోజెట్ ఇంజిన్ను విజయవంతంగా తయారు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్ పాటు భారత్కి ఇది ఒక గర్వించదగిన మైలురాయి అని కేటీఆర్ పేర్కొన్నారు. భారతదేశపు స్వదేశీ ప్రొపల్షన్ సామర్థ్యాల్ని, రక్షణ రంగంలో స్వావలంబనను ఇది గణనీయంగా బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ ఎయిరోస్పేస్, ప్రిసిషన్ ఇంజనీరింగ్ రంగాలు సాధించిన పురోగతికి ఈ జెట్ ఇంజిన్ ఉత్పత్తి నిదర్శనమని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ ఇది ఊతం అవుతుందని తెలిపారు. ప్రపంచ స్థాయి ఎరోస్పేస్ హబ్ గా మారిన హైదరాబాద్ ఖ్యాతి మరింత పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.

# పకడ్బందీగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

పరీక్షల నిర్వహణపై ప్రత్యేక నిఘా

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు పోలీస్ ఉన్నతాధికారులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్ కు సంబంధించి నియామక మిగతా 2లో..

# హరీశ్ క్షుద్రపూజలు చేశారు

తెలంగాణలో వర్షాలు పడొద్దని కోరుకుంటున్నారు

మాజీమంత్రిపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు




**హైదరాబాద్,ఆగస్ట్ 4 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ ఆయన క్షుద్ర పూజలు చేశారని మహేశ్ గౌడ్ ఆరోపించారు. అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని.. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. తిరుపతికి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని టీపీసీసీ చీఫ్ మిగతా 2లో..

# ట్రంప్ టారిఫ్లపై కోర్టులో సవాల్

భారత్ సహా 60 దేశాలపై సుంకాల నిర్ణయానికి వ్యతిరేకంగా పిటిషన్

- 25 అమెరికా రాష్ట్రాల సంయుక్త దావా
- అధికార పరిధి దాటారని ట్రంప్ ప్రభుత్వంపై ఆరోపణ
- కొత్త టారిఫ్లపై న్యాయపోరుకు తెర

9 లో..



## హెచ్-1బీ వీసా దారులకు మరో షాక్?

హెచ్-1బీ, ఎల్-1 వీసా రెన్యూవల్స్పై అదనపు ఫీజు ప్రతిపాదన

- తుది నిబంధనల రూపకల్పన దశలో ట్రంప్ ప్రభుత్వం
- భారతీయ ఐటీ కంపెనీలపై పెరగనున్న భారం
- వీసా రెన్యూవల్స్కు భారీగా అదనపు ఖర్చు అవకాశం

2 లో..

# ఆహార కల్తీకి కళ్లెం

- భారీగా నకిలీ మసాలా దినుసులు స్వాధీనం
- 89.15 టన్నుల ముడి పదార్థాల స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్టు.. సిట్తో సమగ్ర దర్యాప్తు
- కల్తీ మాఫియాపై ఉక్కుపాదం: సీపీ సజ్జనర్



2 లో..

# ప్రభుత్వాసుపత్రుల పరిస్థితి అగమ్యగోచరం

- కమిషనర్ లేక వైద్య విధాన పరిషత్ నిర్వీర్యమైంది : హరీశ్రావు
- 184 ఆస్పత్రుల్లో పర్యవేక్షణ లోపిస్తోందని ఆరోపణ
- ప్రత్యేక వైద్య సేవలు దెబ్బతింటున్నాయని ఆందోళన
- వెంటనే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని డిమాండ్

## వీడియో తొలగింపుపై కేంద్రం సీరియస్

తెలుస్తోంది. అయితే, కేవలం ప్రధాని వీడియో వ్యవహారమే కాకుండా, ఇన్‌స్టాగ్రామ్‌లో ఐటి నిబంధనల ఉల్లంఘనలు, నకిలీ ఏఐ డిజిటల్ కంటెంట్, చైల్డ్ సెక్సువల్ సెర్చ్ కంటెంట్ కంట్రోల్, యూజర్ల డేటా భద్రత వంటి పలు అంశాలపై 'మెటా గ్లోబల్ టీమ్‌తో విస్తృత చర్చలు జరపాలని కేంద్రం నిర్ణయించింది.

## పకడ్బందీగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పాదర్శకంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నియమ నిబంధనలను అనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు అన్ని ప్రక్రియలలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా కోచింగ్ సెంటర్స్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్ సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటలీజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ అత్యవసర సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత ముఖ్యం

### బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు : మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,ఆగస్ట్4 :** తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవస్థపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత, సాంకేతిక సంస్కరణలపై చర్చించారు. గత 10-12 ఏళ్లుగా సీఎంఆర్‌లో జరిగిన వ్యవహారాలపై లోతుగా పరిశీలన చేపట్టారు. ప్రభుత్వానికి సీఎంఆర్ బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. బకాయిల వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఇప్పటివరకు నిర్వహించిన విజిలెన్స్ దాడులు, నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. జిల్లాల వారీగా రైస్ మిల్లర్ల పనితీరు, సీఎంఆర్ బకాయిల పరిస్థితి, డిఫాల్ట్‌ల వివరాలపై అధికారులు నివేదికలు సమర్పించారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణకు కొత్త వ్యూహాలను రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, లీగల్ విభాగాల ఉన్నతాధికారులకు సమావేశానికి హాజరుకావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, ప్రభుత్వ నిధుల రక్షణెళి ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# మెడికల్ హబ్‌గా వరంగల్

చేశారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, ఆయా జిల్లాల ఆరోగ్యశాఖ అధికారులు, హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ జనరల్ హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్‌లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. తమ నియోజకవర్గాల్లోని హాస్పిటళ్లలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, హాస్పిటళ్ల బలోపేతం కోసం తీసుకుంటున్న చర్యలు, తదితర అంశాలను ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. ఎమ్మెల్యేల సూచనలను పరిగణలోకి తీసుకోవాలని, వారు పేర్కొన్న సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఎంజీఎం హాస్పిటల్‌లో ప్రస్తుతం 29 స్పెషాలిటీల్లో వైద్య సేవలు అందిస్తుండగా, మరో 9 సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను త్వరలో ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన చర్యలు వెంటనే ప్రారంభించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. ఉత్తర తెలంగాణ ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలు అందించే హబ్‌గా వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. నిమ్స్ తరహాలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు ఎల్‌వోసీలు (గాజలు) మంజూరు చేస్తామని, అత్యాధునిక పరికరాలు, అవసరమైన వైద్య నిపుణులు, సిబ్బందితో పూర్తి స్థాయిలో సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జనగామ, నర్సంపేట జనరల్ హాస్పిటళ్లు, మెడికల్ కాలేజీలను మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. హన్మకొండలో ఐవీఎఫ్ సెంటర్‌తో పాటు డ్రగ్ అండ్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. రీజనల్ ఐ హాస్పిటల్‌లో అత్యాధునిక కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఎంజీఎం హాస్పిటల్‌కు అడిషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా నియమిస్తామని ప్రకటించారు. పరకాల, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, బచ్చన్నపేట, పాలకుర్తి, కమలాపూర్ ప్రాంతాలకు ఇప్పటికే డయాలసిస్ సెంటర్లు మంజూరు చేశామని, అవసరమైన మౌలిక వసతులు పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరును మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించాలని ఎమ్మెల్యేలు చేసిన ప్రతిపాదనను పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. జిల్లా హాస్పిటళ్లు బలోపేతం కావడం వల్ల హైదరాబాద్‌లోని నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి ప్రధాన హాస్పిటళ్లపై రోగుల ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు.

## కాళోజీ వర్సిటీలో కన్వీనర్ కోటా మెడికల్ సీట్లు

### వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుకు నేడు అవకాశం

వరంగల్ : తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా (కన్వీనర్ కోటా) సీట్లలో ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. క్వాలిఫై అయిన విద్యార్థులు ఆగస్టు 5 ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 12 సాయంత్రం 6 గంటల వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. సీట్ల మ్యాట్రిక్స్‌ను వెబ్ ఆప్షన్లకు ముందు ప్రత్యేకంగా ప్రకటిస్తామని పేర్కొంది. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే ముందు ప్రాస్పెక్టస్‌ను పూర్తిగా చదివి, అర్హతలు, రిజర్వేషన్లు, అవసరమైన ధ్రువపత్రాలు, నిబంధనలను పరిశీలించి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని విశ్వవిద్యాలయం సూచించింది. పూర్తి వివరాలు, సమాచారం కోసం వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరింది. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు అన్ని సర్టిఫికెట్లను తప్పకుండా అప్‌లోడ్ చేయాలి. నమోదు ప్రక్రియ ఒక్కసారి మాత్రమే ఉంటుంది. ప్రతి రౌండ్ కౌన్సెలింగ్‌కు మళ్లీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల చేస్తారు. అనంతరం వెబ్ ఆప్షన్లు, కౌన్సెలింగ్ షెడ్యూల్, సీట్ల మ్యాట్రిక్స్‌ను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చేటప్పుడు కళాశాలల ప్రాధాన్యత క్రమాన్ని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని విశ్వవిద్యాలయం సూచించింది.



## ఆహార కల్తీకి కళ్లెం

**హైదరాబాద్, ఆగస్టు 4 (జనంసాక్షి):** హైదరాబాద్ నగరంలో భారీ స్థాయిలో సాగుతున్న కల్తీ మసాలాల తయారీ గుట్టును పోలీసులు, హెచ్-ఫాస్ట్ (ఎ-ఫీూూ) అధికారులు ఛేదించారు. నగరంలోని 13 మసాలా వ్యాపార సంస్థల్లో నిర్వహించిన మెరుపు తనిఖీల్లో 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సజ్జనార్ తెలిపారు. తనిఖీల్లో సింథటిక్ రంగులు, ఫ్యాబ్రిక్ డైలు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి హానికర పదార్థాలతో మసాలాలు తయారు చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు తదితర మసాలా దినుసులను కల్తీ చేసి నాణ్యమైన ఉత్పత్తులుగా విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.
మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కల్తీ మసాలాల నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపినట్లు వెల్లడించారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయనున్నట్లు సజ్జనార్ ప్రకటించారు. కల్తీ మసాలాల వినియోగం వల్ల కాలేయం, మూత్రపిండాల సమస్యలు, అలర్జీలు, జీర్ణ సంబంధ వ్యాధులతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఆహార భద్రత చట్టం కింద నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హెచ్-ఫాస్ట్ ఏర్పాటు చేసిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, మొత్తం 246 టన్నుల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వెల్లడించారు. అనుమానాస్పద ఆహార ఉత్పత్తులపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## హెచ్-1బీ వీసాదారులకు మరో షాక్?

**వాషింగ్టన్, ఆగస్టు 4 (జనంసాక్షి):** అమెరికాలో వలస విధానాలను మరింత కఠినతరం చేస్తున్న ట్రంప్ ప్రభుత్వం హెచ్-1బీ, ఎల్-1 వీసా రెన్యూవల్స్‌పైనా అదనపు ఫీజు విధించే దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం కొత్త వీసా పిటిషన్లకు వర్తిస్తున్న అదనపు ఫీజును ఇకపై రెన్యూవల్ దరఖాస్తులకూ వర్తింపజేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ నిబంధనలు ప్రస్తుతం తుది రూల్‌మేకింగ్ దశలో ఉన్నట్లు సమాచారం.
ప్రస్తుతం విదేశీ ఉద్యోగులను స్పాన్సర్ చేసే కొన్ని పెద్ద అమెరికన్ కంపెనీలు హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్లపై అదనంగా 4 వేల డాలర్ల వరకు ఫీజు చెల్లిస్తున్నాయి. కొత్త ప్రతిపాదన అమల్లోకి వస్తే ఉద్యోగులను కొనసాగించేందుకు చేసే రెన్యూవల్ దరఖాస్తులకూ ఇదే తరహా అదనపు రుసుము చెల్లించాల్సి రావచ్చు. ముఖ్యంగా సగానికి పైగా ఉద్యోగులు హెచ్-1బీ, ఎల్-1 వీసాలపై పనిచేస్తున్న సంస్థలపై ఈ భారం పడే అవకాశం ఉంది. అమెరికా పౌరసత్వ, వలస సేవల శాఖ గణాంకాల ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆమోదించిన 4.06 లక్షల హెచ్-1బీ దరఖాస్తుల్లో సుమారు 71 శాతం రెన్యూవల్స్‌కే సంబంధించినవి. దీంతో ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే భారతీయ ఐటీ కంపెనీలు, హెచ్-1బీ వీసాదారులపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## హరీశ్ క్షుద్రపూజలు చేశారు

ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ మాజీ మంత్రి మాత్రం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేశారని విమర్శించారు. తన రాజకీయ స్వార్థం కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం గతంలో జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో కేసీఆర్ పూజలు కూడా నిజమేనని అనిపిస్తోందన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి మరీ ఏం చేశారో ప్రజలకు హరీశ్ రావు చెప్పాలని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఆచారాలను బలంగా నమ్ముతారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

## సిఎం విజయ్ ఓ అసమర్థ నాయకుడు

- కావేరీ జలాలపై దృష్టి మరల్చేందుకే ఉదయనిధి అరెస్ట్
- ఎక్స్ వేదికగా మండిపడ్డ మాజీ సిఎం స్టాలిన్

చెన్నై: నటి త్రిషను ఉద్దేశిస్తూ డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు తమిళనాట రాజకీయ దుమారం రేపాయి. ఇందుకు సంబంధించిన కేసులో ఆయన అరెస్టయి.. బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ పరిణామాలపై ఉదయనిధి తండ్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందిస్తూ.. సీఎం విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అహంకారం వినాశనానికి దారితీస్తుందని, అది నిరంతరం కొనసాగితే.. మరింత వేగంగా పతనమవుతారని దుయ్యబట్టారు. విజయ్.. ఓ అసమర్థ నాయకుడని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం తన ఎక్స్ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'కావేరీ నదీ జలాలు, మేకెదాటు ప్రాజెక్ట్ వ్యవహారంలో తమిళనాడు హక్కులను అణచివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. దాన్ని ఖండించేందుకు తంజావూరులో డీఎంకే ఆందోళన కార్యక్రమం చేపట్టింది. అందులో ఉదయనిధి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ విమర్శలకు బదులుచెప్పే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని లేదు. అందుకే వాటిపై దృష్టి మరల్చేందుకు ఉదయనిధిని అరెస్ట్ చేసింది. మన సీఎం విజయ్ కావేరీ నీటిని తీసుకురాలేరు. ఆయనో డమ్మీ సీఎం. ఇక, ఆయన మంత్రులు ఒక సినిమా (జననాయగన్‌ను ఉద్దేశిస్తూ)ను పట్టుకుని వేలాడుతున్నారు. రాష్ట్రంలో ఓ జోకర్ క్యాబినెట్ అధికారంలో ఉందని స్టాలిన్ విమర్శించారు. శాసనసభలో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న ఉదయనిధి పట్ల పోలీసులు దారుణంగా వ్యవహరించారు. ఇంటికొచ్చి అరెస్టు చేసి.. తంజావూరుకు తీసుకెళ్లారు. కోర్టు విచారణ సందర్భంగా ఉదయనిధిని కస్టడీలోకి తీసుకొనే ఉద్దేశం లేదని ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు. మరి అలాంటప్పుడు ఆయనను తంజావూరుకు ఎందుకు తరలించారు? ఎందుకు అన్ని కేసులు పెట్టారు. కోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టని మాజీ సీఎం ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. తనను విమర్శిస్తున్న వారందరినీ విజయ్ అరెస్టు చేయిస్తున్నారని స్టాలిన్ దుయ్యబట్టారు. చెన్నైలోని మెరీనా బీచ్ వద్దకు ఆందోళనకారులను రానివ్వడం లేదని, నీట్ వ్యతిరేక ర్యాలీని కూడా అనుమతించట్లేదని ఆరోపించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముందు ఉదయనిధి అరెస్టు కుట్రపూరిత చర్యేనని స్టాలిన్ మండిపడ్డారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

### ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశం



హైదరాబాద్,ఆగస్ట్4 : తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-బైర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-బైర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీబైర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

## ప్రభుత్వాసుపత్రుల పరిస్థితి అగమ్యగోచరం

- కమిషనర్ లేక వైద్య విధాన పరిషత్ నిర్వీర్యమైందని హరీశ్‌రావు విమర్శ
- 184 ఆస్పత్రుల్లో పర్యవేక్షణ లోపిస్తోందని ఆరోపణ
- వెంటనే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని డిమాండ్



**హైదరాబాద్, ఆగస్టు 4 (జనంసాక్షి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వాసుపత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలు అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ లేక గాలిలో దీపంలా మారిందని ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో పేర్కొన్నారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో పరిషత్ పరిధిలోని మాతా శిశు ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు కలిపి మొత్తం 184 ఆస్పత్రుల పరిపాలన దెబ్బతిన్నదని ఆరోపించారు. వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత వంటి అంశాలను పర్యవేక్షించే యంత్రాంగమే లేకుండా పోయిందని అన్నారు.
దీంతో వైద్యులు, సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలకు కూడా నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో వైద్య సిబ్బంది సేవా సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ వ్యవస్థలో విలీనం చేయాలని నిర్ణయించామని గుర్తు చేశారు. మూడేళ్లు గడిచినా సేవా నిబంధనలు రూపొందించకపోవడం వల్ల వైద్యులు, సిబ్బంది తీవ్ర నిరాశలో ఉన్నారని అన్నారు. పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా స్పందన లేకపోవడంతో ఉద్యోగులు నిరసనలకు దిగుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే సర్వీస్ నిబంధనలు రూపొందించి, పూర్తిస్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

### మత్స్యకారుల సంక్షేమానికి

## ఇన్సూరెన్స్, మోపెడ్‌లు, రిటైల్ షాపుల ఏర్పాటు



**హైదరాబాద్, ఆగస్టు 4 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి, సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపట్టనుంది. మత్స్యకారులకు ఇన్సూరెన్స్ సౌకర్యం విస్తరణ, మోపెడ్‌ల పంపిణీ, చేపల విక్రయానికి రిటైల్ షాపుల ఏర్పాటు వంటి అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. మంగళవారం మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు పలు నిర్ణయాలు వెల్లడించారు. మత్స్యకారుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి మత్స్య సహకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న బకాయిల విడుదలకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల ఉత్పత్తి పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. మత్స్యకారుల ఆదాయం పెంచే చర్యలతో పాటు చేపల వినియోగాన్ని ప్రోత్సహించే చర్యలపై కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకంలో చేపలను చేర్చే ప్రతిపాదన పరిశీలనలో ఉందని వెల్లడించారు. మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వానికి సంబంధించిన వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, కోహెడలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి చెప్పారు. ఈ మార్కెట్ ద్వారా చేపల ఆన్‌లైన్ విక్రయాలకు అవకాశం కలిగి మత్స్యకారులకు మెరుగైన మార్కెట్ లభిస్తుందని వివరించారు. ఇప్పటికే రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను ప్రభుత్వం విడుదల చేసిందని, మత్స్య సహకార సంఘాల అధ్యక్షుల ప్రోటోకాల్ అంశాన్ని కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని మంత్రి తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, ఆదాయవృద్ధి, మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, వారి జీవనోపాధి మెరుగుదలకు అవసరమైన అన్ని చర్యలు కొనసాగిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

# విద్యారంగానికి న్యాయం చేయాలి

- ఆగస్టు 7 నుంచి దశలవారీ ఉద్యమానికి ఉపాధ్యాయ సంఘాల జేఏసీ పిలుపు
- నల్ల బ్యాడ్జీలతో నిరసనలు.. మండల, జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు
- స్పందించకుంటే సెప్టెంబరులో 'చలో అసెంబ్లీ' హెచ్చరిక
- పీఆర్సీ, బదిలీలు, పదోన్నతులు సహా సమస్యల పరిష్కారానికి డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 4 (జనంసాక్షి):**

రాష్ట్రంలో ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (జేఏసీ) దశలవారీ ఆందోళనలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రభుత్వ విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతోందని ఆరోపించిన జేఏసీ, ఆగస్టు 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశం లో జేఏసీ నాయకులు ఈ కార్యాచరణను వెల్లడించారు. ఉపాధ్యాయుల సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కా రంలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని నాయకులు విమర్శించారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉనికి క్రమంగా ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 7న రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు చేపడతామని, కొత్త పీఆర్సీ ప్రకటించే వరకు ప్రతిరోజూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతామని తెలిపారు. ఆందోళనలను దశలవారీగా ఉద్ధృతం చేస్తామని ప్రకటించిన జేఏసీ, ఆగస్టు 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించి తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపింది. ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహిస్తామని వెల్లడించింది. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబరులో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఉపాధ్యాయులతో 'చలో అసెం బ్లీ' కార్యక్రమాన్ని చేపడతా మని హెచ్చరించింది. అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాలని, సంఘాలకు అతీతంగా ప్రతి ఉపాధ్యాయుడు పోరాటంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చింది. విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కాలేదని జేఏసీ ఆరోపించింది. నాణ్యమైన విద్య పేరుతో ప్రభుత్వ పాఠశాలలను కుదించే విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించింది. పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభిస్తున్నామని ప్రకటించినా, అది కేవలం యూకేజీ వరకే పరిమితమైందని పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12 గంటల వరకే నిర్వహించడం వల్ల తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం వరకు తరగతులు కొనసాగుతుండటంతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రభావం పడుతోందని వివరించింది. ప్రాథమిక విద్యకు ఆటంకంగా మారిన జీవో 25ను వెంటనే సవరించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, 50 మంది విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని డిమాండ్ చేసింది. కొత్త జిల్లాలకు డీఈవో పోస్టులు, రెవెన్యూ డివిజన్లకు డిప్యూటీ ఈవోలు, అన్ని మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని, పీవో-2018కు అనుగుణంగా సర్వీస్ నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల నియామకాలు చేపట్టాలని కోరింది. ఆగస్టు 15లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని, టెట్‌లో సర్వీస్ వెయిటేజీ కల్పించాలని, స్పెషల్ టెట్‌ను సబ్జెక్టుల వారీగా నిర్వహించాలని జేఏసీ డిమాండ్ చేసింది. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, మెమో-57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరింది. అలాగే మోడల్, ఎయిడెడ్ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేయాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయడంతో పాటు జీవో 190ను అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. అదనంగా ఐదు విడతల కరువు భత్యం, కొత్త పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ బిల్లులను ప్రతి నెల రూ.2 వేల కోట్ల చొప్పున విడుదల చేయాలని, హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. సమావేశంలో చావ రవి, ఏ. వెంకట్, సీహెచ్ అనిల్ కుమార్, ఎన్. తిరుపతి, ఎం. సోమ య్య, టీ. లింగారెడ్డి, కొమ్ము రమేష్, మేడి చరణ్ దాస్, ఎస్. హరి కిషన్, బీ. కొండయ్య, వై. విజయకుమార్, రవీందర్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

- జిల్లా కాంగ్రెస్ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్



కరీంనగర్ (జనంసాక్షి) : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు ఆయన హోదాకు తగిన విధంగా లేవని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్ అన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాల సందర్భంగా బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు మతాల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై ముస్లింలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చేసిన వ్యాఖ్యలు సమాజంలో అపోహలు కలిగించేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. హిందువులు, ముస్లింల జనాభా శాతాలను ప్రస్తావిస్తూ రాజకీయ వ్యాఖ్యలు చేయడం కేంద్ర మంత్రి స్థాయికి తగదన్నారు. రంజాన్ సందర్భంగా ప్రభుత్వం అందించే సహాయం గురించి మాత్రమే మాట్లాడటం సరైంది కాదని, రాష్ట్రంలో హిందువుల పండుగల సందర్భంగా కూడా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలకు నిధులు కేటాయిస్తుందని అన్నారు. మతపరమైన అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం వల్ల సమాజంలో సామరస్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ-ముస్లింల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలకు స్వస్తి పలికి, అభివృద్ధి, ప్రజా సంక్షేమ అంశాలపై దృష్టి సారించాలని బండి సంజయ్‌కు సూచించారు. ప్రజలు కుల, మత రాజకీయాలను కాకుండా అభివృద్ధి, మంచి పాలనను ఆదరిస్తారని మహమ్మద్ తాజోద్దీన్ పేర్కొన్నారు.

# జనన-మరణ నమోదులో కఠిన నిబంధనలకు ఓకే

- పేదలు, గిరిజనులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి
- రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర




హైదరాబాద్ (జనంసాక్షి) : జనన ధృవీకరణ పత్రం ప్రతి పౌరుడికి లభించే తొలి చట్టబద్ధమైన గుర్తింపు కాగా, మరణ ధృవీకరణ పత్రం ఆస్తి బదలాయింపు, వారసత్వం, పింఛను, బీమా క్లెయిమ్‌లు వంటి అనేక చట్టపరమైన అంశాలకు అత్యంత కీలకమైనదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. జననాలు, మరణాల నమోదు (సవరణ)-2026 బిల్లుపై మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 2023 సవరణ ద్వారా డిజిటల్ నమోదు వ్యవస్థ, జాతీయ సమాచార భాండాగారం, జనన ధృవీకరణ పత్రాన్ని వివిధ ప్రభుత్వ సేవలకు ప్రాథమిక ఆధార పత్రంగా వినియోగించే విధానాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం తీసుకొచ్చిన 2026 బిల్లు కొత్త వ్యవస్థను తీసుకురాకుండా, ఆలస్యంగా జరిగే నమోదులపై నిబంధనలను మరింత కఠినతరం చేస్తోందన్నారు. ఏడాది తర్వాత, రెండేళ్లలోపు జనన లేదా మరణ నమోదుకు జిల్లా కలెక్టర్, డివిజనల్ లేదా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అనుమతి అవసరమవుతుందని, రెండేళ్లు దాటితే ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో ధృవీకరణ ప్రక్రియ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఈ బిల్లు ఉద్దేశ్యాన్ని బీఆర్ఎస్ పూర్తిగా సమర్థిస్తోందని వెల్లడించిన ఆయన, ఆలస్యమైన నమోదులను ఆసరాగా చేసుకుని నకిలీ గుర్తింపులు, తప్పుడు పత్రాలు, అక్రమ ఆస్తి హక్కుల వాదనలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అవకాశం ఏర్పడకుండా చర్యలు అవసరమన్నారు. అయితే కఠిన నిబంధనలు నిజమైన పేదలు, గిరిజనులు, మారుమూల గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా మారకూడదని సూచించారు. పేదరికం, అవగాహన లేమి, వలసలు, రవాణా సౌకర్యాల కొరత, ఇంటర్నెట్ లేమి, నమోదు కేంద్రాలు దూరంగా ఉండటం వంటి కారణాలతో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో జనన, మరణ నమోదులు సకాలంలో జరగడం లేదని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యల పరిష్కారానికి సంచార నమోదు శిబిరాలు, గ్రామస్థాయి నమోదు కేంద్రాలు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గుర్తింపు పొందిన ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే ప్రతి జననం, మరణం స్వయంచాలకంగా పౌర నమోదు వ్యవస్థలో నమోదయ్యే విధానం తీసుకురావాలని కోరారు. ఆలస్యమైన నమోదుల దరఖాస్తులకు నిర్దిష్ట కాలపరిమితి నిర్ణయించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్థితిని తెలుసుకునే సౌకర్యం కల్పించాలని సూచించారు. ఈ బిల్లు మంచి ప్రారంభమని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో సార్వత్రిక నమోదు, డిజిటల్ అనుసంధానం, సమాచార గోప్యత, గ్రామీణ-గిరిజన ప్రాంతాల్లో వంద శాతం నమోదు సాధించేలా మరిన్ని సంస్కరణలు అవసరమన్నారు. చివరగా, దేశంలో ఎక్కడ జన్మించినా ప్రతి శిశువుకు జనన ధృవీకరణ పత్రం, ప్రతి మరణానికి సకాలంలో మరణ ధృవీకరణ పత్రం జారీ చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేస్తూ, ఈ బిల్లుకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# అవినీతికి కేరాఫ్‌గా.. ఖమ్మం నగర పాలక సంస్థ!

- శానిటేషన్ విభాగంలో డీజిల్ దొంగలు
- కార్మికుల వేతనాలను దోచుకు తింటున్న కాంట్రాక్టర్స్
- ఇందిరమ్మ ఇండ్ల కేటాంపుల్లో సిబ్బంది చేతివాటం..
- ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో పర్సంటేజీలు
- ఐఏఎస్ అధికారి ఉన్నప్పటికీ అధికార పార్టీ నేతల హవా




**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 04 (జనం సాక్షి) : 'రెండేళ్ల క్రితం వరకు ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందిన ఖమ్మం నగర పాలక సంస్థ ప్రస్తుతం అవినీతి కి కేరాఫ్ గా నిలుస్తోందా..? హైదరాబాద్ తర్వాత యావత్ తెలంగాణ లోని మున్సిపల్ కార్పొరేషన్లకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన బల్దియా నేడు కొందరి కారణంగా అపకీర్తిని మూట కట్టుకుంటుందా..? ఇటీవల వరుసగా వెలుగులోకి వస్తున్న వరుస సంఘటనల నేపథ్యాన్ని పరిశీలిస్తే ముమ్మాటికి నిజమని నగర ప్రజల నుంచి సమాధానం వినిపిస్తున్నది. ఇంతకు ఏమిటా అవినీతి.. కారకులు ఎవరు..? వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్న అధికార పార్టీ నేతల తీరుపై జనం సాక్షి అందిస్తోంది ప్రత్యేక కథనం..!**

పుట్టినా, చనిపోయినా .. ఇల్లు కట్టుకుంటే అనుమతులు.. తాగి ఎందుకు మంచినీరు.. ఇంట్లోని వ్యర్థాలని దూరంగా తరలించడం.. నడిచేందుకు రహదారులు, చీకట్లను పారదోలేందుకు వీధిలైట్లు ఏర్పాటు.. ఇలా చెప్పుకుంటూ పోతే పట్టణాలు, నగరాల్లో మనుషుల జీవన ప్రయాణానికి మున్సిపల్ విభాగానికి విడదీయరాని అవినావబావ సంబంధం ఉంటుంది. ఇంతటి కీలకమైన శాఖలో పనిచేస్తున్న పై స్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు నిఖార్సైన జవాబు దారితనం ఉంటేనే వ్యవస్థ సజావుగా ముందుకు సాగుతుంది. కానీ..! కంచే చేను మేసిందన్న సామెత చందంగా ఖమ్మం నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కొందరు అధికారులు, సిబ్బంది ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజాధనాన్ని లూటి చేయడం సర్వత్రా చర్చనీయాశీశంగా మారింది.

### డీజిల్ దొంగలని తెలినా విధుల్లోనే..

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుద్ధ్య విభాగానికి చెందిన, ఇతర వాహనాలకు కలిపి బీఆర్ఎస్ పాలకవర్గశీ హయాంలో జిల్లా జైలు పర్యవేక్షణలోని పెట్రోల్ బంకు ద్వారా డీజిల్, పెట్రోల్ కొట్టించేవారు. ఈ ప్రక్రియ సజావుగా నడిచేందుకు కేఎంసి యంత్రాంగం ప్రత్యేకంగా డీజిల్ విభాగాన్ని ఏర్పాటు చేసి కూపన్లు జారీ చేసే విధానాన్ని ప్రవేశపెట్టింది. కూపన్ లో నమోదు చేసిన వాహనానికి మాత్రమే ఇంధనాన్ని పోసేవారు. కానీ..! రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, ఖమ్మం నగరపాలకం పాలకవర్గంలో ని మేయర్ తో సహా పలువురు కార్పొరేటర్లు బీఆర్ఎస్ ను వీడి అధికార కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో పాలనాపరమైన మార్పులు కూడా చోటు చేసుకున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ నేత ఒత్తిడి కారణంగా డీజిల్ సరఫరాను జిల్లా జైలు పెట్రోల్ బంక్ నుంచి రాపర్తి నగర్ బంకు మార్చారు. ఈ మార్పుకు ఎటువంటి అధికారిక ఉత్తర్వులు లేకపోవడంతో కేఎంసి యంత్రాంగం డీజిల్ సరఫరాలో అక్రమాలకు తెర లేపారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో విచారణ జరిపిన కమిషనర్ అభిషేక్ అగస్త్య ఓ అధికారి, కొందరి సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేశారు. కానీ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పై ఆదిపత్యం చెలాయిస్తున్న ఓ కాంగ్రెస్ నేత కమిషనర్ ఉత్తర్వులను బుట్ట దాఖలు చేయిస్తూ, సస్పెన్షన్ కు గురైన వారిని అవే పోస్టుల్లో కొనసాగేలా చేశారు. దీంతో ఎవరెన్ని తప్పులు చేసినా రాజకీయ అండదండలు ఉంటే చాలు అనే ధోరణిని అక్రమార్కులు ప్రదర్శించడం ప్రతి ఒక్కరిని విస్మయానికి గురిచేస్తుంది.

### కార్మికుల వేతనం కాంట్రాక్టర్ల జేబుల్లోకి..

ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల శ్రమ మాటల్లో చెప్పలేనిది. తెల్లవారుజామున నాలుగు గంటలకు లేచి పరుగు పరుగున వచ్చి విధుల్లో చేరి తిరిగి ఇంటికి వెళ్లే వరకు రెక్కలు ముక్కలు చేసుకుంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో కార్మికుడికి నెలకు దాదాపు రూ. 16,500 చెల్లించాలి. వీరిని ప్యాకేజీల వారిగా సరఫరా చేస్తున్నందుకుగాను ఐదు శాతం సర్వీస్ టాక్స్ ను అదనంగా ఇస్తుంటారు. కానీ కొందరు కాంట్రాక్టర్లు కాసుల కక్కుర్తి తో పారిశుద్ధ్య కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల్లో భారీగా కోతలు పెడుతూ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో కార్మికుడికి రూ. 13000 లేదా రూ. 14 వేలకు మించి ఇవ్వడం లేదని సమాచారం. మిగిలిన డబ్బులను యదేచ్ఛగా స్వాహా చేస్తూ, ప్రశ్నించిన వారిని అర్ధాంతరంగా విధుల్లో నుంచి తీసిపారేస్తూ ఇష్టా రాజ్యంగా వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తుంది. ఈ విషయమై సమగ్ర దర్యాప్తు చేస్తే కాంట్రాక్టర్లు నెలవారీగా ఆర్జిస్తున్న అక్రమ సంపాదన గుట్టురట్టయ్యే అవకాశం లేకపోలేదు.

### ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో చేతివాటం ..

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మొదటి విడత ఇండ్ల పంపిణీ ప్రక్రియ పూర్తయి రెండవ విడత లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయించింది. అయితే ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో అర్హుల గుర్తింపు ప్రక్రియను వార్డు ఆఫీసర్లకు అప్పగించారు. ఇదే అదునుగా భావించిన వారు ఇందిరమ్మ ఇల్లు కావాలంటే చేతులు తడపాల్సిందే అంటూ తమదైన పద్ధతిలో వసూళ్ల పర్వానికి తెర లేపారు. ఈ విషయమై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కమిషనర్ అభిషేక్ విచారణ జరిపించి ఒకరిద్దరు వార్డు ఆఫీసర్లపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లోనూ పైసలు ముట్టనిదే ఫైలు ముందుకు కదలడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనుల కేటాయింపులు, ఇండ్ల నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియ, పన్నుల వసూలు, ఇంటి నంబర్ల కేటాయింపులు వంటి అనేక అంశాల్లో పర్సంటేజీల రూపంలో పెద్ద మొత్తంలో చేతులు మారుతున్నట్లు విశ్వస వర్గాల సమాచారం.

### ఐఏఎస్ అధికారి ఉన్నప్పటికీ..

ఖమ్మం నగరపాలక సంస్థగా ఆవిర్భవించిన తర్వాత గత 2016లో జరిగిన మొట్టమొదటి పాలకవర్గం ఎన్నికల అనంతరం కమిషనర్లుగా ఐఏఎస్ అధికారుల శకం ప్రారంభమైంది. ప్రస్తుతం అభిషేక్ అగస్త్య సారథ్యం వహిస్తున్నప్పటికీ, పలు కీలక నిర్ణయాలు, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తూ వ్యవస్థను గాడిలో పెడుతున్న ప్రతీ సందర్భంలోనూ అధికార పార్టీకి చెందిన నాయకుల మితిమీరిన జోక్యం చర్చానీయాంగా మారుతోంది. అనుక్షణం అక్రమార్కులకు వెన్నదన్నుగా నిలవడం, పర్సంటేజీల రూపంలో వాటాలు పంచుకోవడం వెనుక ఆయన స్నేహ హస్తం ఉందనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. బినామీ కాంట్రాక్టర్ల పేర్ల మీద రకరకాల పనులు చేస్తూ దండిగా పోగేసుకుంటున్నారని ఖమ్మం ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ఈ వ్యవహారం స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రతిష్టకు భంగం వాటిల్లుతోందని పలువురు ఆవేదన చెందుతున్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో వేగం పెంచాలి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



రామకృష్ణాపూర్, ఆగస్టు 04(జనంసాక్షి): జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలలో వేగం పెంచి అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార , గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలో గల బి 1 క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహసిల్దార్ సతీష్ కుమార్, మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల కమిషనర్లు రాజలింగు, మురళీకృష్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ లతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ జిల్లాలో సి.ఎస్.ఆర్., డి.ఎం.ఎఫ్.టి. నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో నీటి ట్యాంకులు, పైప్‌లైన్‌ల నిర్మాణ పనులు చేపడుతున్నామని, ప్రతి ఇంటికీ సురక్షితమైన త్రాగునీటిని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మందమర్రి ప్రాంతంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి దాదాపు 95 శాతం చెల్లింపులు చేయడం జరిగిందని, మిగిలిన పనులను కూడా వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం సెంట్రల్ లైటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగా సోలార్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్లను కేటాయించడం జరుగుతుందని, ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం చేపట్టిన వైకుంఠధామాల నిర్మాణ పనులు సుమారు 50 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కబరస్థాన్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని ఎంఎన్ఆర్ గార్డెన్ నుండి శ్రీనివాస గార్డెన్ వరకు సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు రాత్రి వేళలలో మెరుగైన రవాణా, భద్రతా సౌకర్యాలు కల్పించే విధంగా లైటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నగర అభివృద్ధి నిధులతో మున్సిపల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సి.సి. రోడ్లు, మురుగు కాలువల వ్యవస్థ, నీటి ట్యాంకులు, విద్యుత్ స్తంభాలు తదితర మౌలిక వసతుల పనులను చేపడుతున్నామని తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్యుత్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణ శాఖల అధికారులతో ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని, అభివృద్ధి పనులలో జాప్యం లేకుండా నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుత్తేదారులకు కేటాయించిన పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అనంతరం వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను స్వీకరించి, ఆయా దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేస్తూ, సమస్యలను నిబంధనల మేరకు పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అందుబాటులో ఉండాలని, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి సకాలంలో పరిష్కారం చూపేలా కృషి చేయాలని తెలిపారు.

# ప్రకృతికి 'ఇక్కత్' ప్రాణం

- ఇక్కత్ చీరలో ప్రకృతి అందాల ఆవిష్కరణ
- చౌటుప్పల్ చేనేత కళాకారుడు గంజి వెంకటేశ్‌కు జాతీయ పురస్కారం





చౌటుప్పల్, ఆగస్టు 4(జనంసాక్షి) : ప్రకృతి అందాలు, జీవవైవిధ్యాన్ని ఆరు గజాల పట్టు చీరపై అపూర్వంగా ఆవిష్కరించిన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన చేనేత కళాకారుడు గంజి వెంకటేశ్ (55)కు ప్రతిష్ఠాత్మక జాతీయ చేనేత పురస్కారం-2025 వరించింది. ఆగస్టు 7న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించనున్న 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ మేరకు డెవలప్‌మెంట్ కమిషనర్ ఆఫ్ హ్యాండ్‌లూమ్స్ కార్యాలయం నుంచి అధికారిక ఆహ్వానం అందింది. పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన వెంకటేశ్, తన తండ్రి గంజి భిక్షపతి వద్ద చేనేత కళను అభ్యసించి, గత 34 సంవత్సరాలుగా ఈ సంప్రదాయ వృత్తిలో నిమగ్నమై ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఇక్కత్నేత పద్ధతిలో ప్రకృతి సౌందర్యాన్ని ప్రతిబింబించే ప్రత్యేక పట్టు చీరను రూపొందించాలని సంకల్పించారు. ఈ కళాఖండాన్ని పూర్తిచేయడానికి ఆయన మొత్తం 15 నెలల పాటు నిరంతర శ్రమించారు. తొలి ఆరు నెలలు గ్రాఫ్ పేపర్‌పై సూక్ష్మంగా డిజైన్ రూపొందించి, అనంతరం ఎలాంటి రసాయనాలు వినియోగించకుండా టీ పొడి, కొత్తిమీర, పుదీనా, కాచు, మంజిష్ఠ వంటి సహజ పదార్థాలతో రంగులను తయారు చేశారు.

తర్వాత టై అండ్ డై విధానంలో మల్బరీ పట్టుదారానికి 300 కొయ్యల చిటికీకి రంగులు అద్దేందుకు ఎనిమిది నెలల సమయం వెచ్చించారు. చివరి దశలో నెల రోజుల పాటు మగ్గంపై ఒక్కో పోగును ఎంతో ఓర్పుతో అల్లుతూ ప్రకృతి జీవవైవిధ్యాన్ని ప్రతిబింబించే అద్భుత కళాఖండాన్ని సృష్టించారు. ఈ చీరపై ఇళ్లు, గుర్రాలు, బాతులు, కుందేళ్లు, నీటి గుర్రం, చేపలు, పడవ, సీతాకోక చిలుకలు, వివిధ రకాల పక్షులులిలి వంటి ప్రకృతి అంశాలను జీవం ఉట్టిపడేలా నేసి తన అసాధారణ ప్రతిభను చాటుకున్నారు.

# మేడారం చివరిదశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క



ములుగు ప్రతినిధి, ఆగష్టు 04(జనంసాక్షి) : మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ చివరిదశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళలు స్వయం ఉపాధితోనే ఆర్థిక అభివృద్ధి సాధించాలని మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం ఆలయ పరిసర ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం పరిశీలించారు. అనంతరం వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమ్మక్క భవన్‌లో మదర్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఉచిత కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆలయ పరిసరాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయని, నిర్మాణ పనులను వేగంగా సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కుట్టు శిక్షణతో పాటు కుట్టుమిషన్ల పంపిణీ మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. మహిళల స్వావలంబన, సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్‌రెడ్డి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ప్రత్యేక అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రెడిటేషన్ కార్డుల గడువు 25కు పొడిగింపు

- టీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌస్ మొహియొద్దీన్

హైదరాబాద్, ఆగస్టు 4: తెలంగాణ హైకోర్టు 03 ఆగస్టు 2026న జరిగిన విచారణలో ప్రస్తుతం అమల్లో ఉన్న జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఆగస్టు 25 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌస్ మొహియొద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఖఔజీఫీ) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కొనసాగించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా ప్రతివాదులు ఇప్పటికే పిటిషనర్లలో ఎక్కువమందికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినట్లు కోర్టుకు తెలిపారు. అయితే ఈ వాదనపై పిటిషనర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో, ఇప్పటివరకు జారీ చేసిన అన్ని అక్రిడిటేషన్ కార్డుల పూర్తి వివరాలు మరియు జాబితాను కోర్టుకు సమర్పించాలని న్యాయస్థానం ప్రతివాదులను ఆదేశించింది. తదుపరి విచారణ తేదీ నుంచి కేసులో తుది విచారణ మరియు తుది వాదనలు ప్రారంభమవుతాయని కోర్టు స్పష్టం చేసింది. అందుకు ముందు ఇరు పక్షాలు తమ వద్ద ఉన్న అన్ని సంబంధిత పత్రాలు, ఆధారాలను కోర్టు రికార్డులో సమర్పించాలని ఆదేశించింది. ప్రతివాదులు కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో జరిగిన లోపాలను ప్రస్తావిస్తూ, సంఘటనల వారీగా తేదీలతో కూడిన నివేదికను పిటిషనర్ కోర్టులో సమర్పించగా, దానిని న్యాయస్థానం రికార్డులో భాగంగా చేర్చింది. హైకోర్టు ఇచ్చిన ఈ ఉత్తర్వులతో కేసు తుది నిర్ణయం వచ్చే వరకు రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు తమ వృత్తిపరమైన హక్కులు, ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రవేశం, ప్రభుత్వ గుర్తింపుతో లభించే ఇతర సౌకర్యాలను నిరంతరంగా వినియోగించుకునే అవకాశం కల్పించబడింది. ఈ కేసు తదుపరి విచారణతో పాటు తుది వాదనల ప్రారంభం కోసం ఆగస్టు 25కు వాయిదా వేయబడింది.

# ఎల్ఐసి గాలిలో దీపం కావొద్దు

దేశ ప్రజల నమ్మకానికి ప్రతీకగా, కోట్లాది మంది సామాన్యుల జీవిత భద్రతకు అండగా నిలిచిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) నేడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ప్రభుత్వ రంగ సంస్థలంటే ప్రజల్లో ఉన్న విశ్వాసానికి ఎల్ఐసి ఒక చిహ్నం. అలాంటి సంస్థ షేర్లు ఒక్క రోజులోనే దాదాపు 9 శాతం మేర కుప్పకూలడం సాధారణ మార్కెట్ హెచ్చుతగ్గుగా తీసుకుని విస్మరించలేని విషయం. ఇది కేవలం షేర్ ధర పతనం కాదు. దేశ ప్రజల విశ్వాసం, మదుపరుల నమ్మకం, ప్రభుత్వ ఆర్థిక విధానాలపై పెరుగుతున్న సందేహాలకు ప్రతిబింబం.

సోమవారం రూ.428.50 వద్ద ముగిసిన ఎల్ఐసి షేరు, మంగళవారం ఉదయం రూ.390.50 వరకు పడిపోవడం మార్కెట్‌ను కుదిపేసింది. లక్షలాది మంది మదుపరుల సంపద ఒక్క రోజులోనే ఆవిరైంది. దీనికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఆఫర్ ఫర్ సేల్ నిర్ణయం. ఎల్ఐసిలో తనకున్న 6.5 శాతం వాటాను విక్రయించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం, దాదాపు 82.22 కోట్ల షేర్లను మార్కెట్లోకి తీసుకురావడం, పైగా మార్కెట్ ధర కంటే సుమారు 11 శాతం తక్కువ ధరకు విక్రయించనున్నట్లు ప్రకటించడం పెట్టుబడిదారుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది.

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుకోవడం తప్పు కాదు. కానీ దశాబ్దాలుగా ప్రజల విశ్వాసంతో ఎదిగిన ఒక మహాసంస్థను ఆదాయ వనరుగా మాత్రమే చూడడం ఎంతవరకు సమంజసం? ప్రజల సొమ్ముతో ఎదిగిన సంస్థలో వాటాలను వరుసగా విక్రయిస్తూ, ప్రభుత్వ రంగాన్ని క్రమంగా బలహీనపరిచి, ప్రైవేట్ పెట్టుబడిదారులకు మార్గం సుగమం చేయడం దేశ ప్రయోజనాలకు అనుకూలమా అనే ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందే.

సంపాదకీయం

ఎల్ఐసి అంటే కేవలం బీమా సంస్థ కాదు. దేశం ఆర్థిక సంక్షోభాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వానికి అండగా నిలిచింది. బ్యాంకింగ్ రంగంలో సంక్షోభాలు వచ్చినప్పుడు ముందుకొచ్చింది. మార్కెట్ కుదేలైనప్పుడు స్థిరత్వం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. కోట్లాది కుటుంబాల జీవిత భద్రతకు అది ఒక నమ్మకమైన హామీ. అలాంటి సంస్థను క్రమంగా బలహీనపరచడం అంటే దేశ ఆర్థిక భద్రతకు పునాది రాళ్లను కదిలించడమే.

ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా మార్కెట్‌కు అప్పగించే ధోరణి ఇప్పటికే అనేక రంగాల్లో కనిపిస్తోంది. కానీ ప్రపంచ అనుభవాలు చెబుతున్న ఒక వాస్తవం ఏమిటంటే.. ప్రైవేట్ రంగం ప్రధాన లక్ష్యం ప్రజా సంక్షేమం కాదు, లాభం. లాభాలు ఉన్నంత వరకు సేవలు ఉంటాయి; లాభాలు తగ్గితే సేవలు కూడా తగ్గిపోతాయి. గ్రామీణ ప్రాంతాలు, పేదలు, చిన్న పాలసీదారులు, సామాన్య కుటుంబాలు ప్రైవేట్ కంపెనీలకు మొదటి ప్రాధాన్యం కాకపోవచ్చు. అయితే ఎల్ఐసి మాత్రం లాభనష్టాలకు అతీతంగా కోట్లాది మంది ప్రజలకు భరోసాగా నిలిచింది.

జనంసాక్షి


దేశంలోని వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థలు బలహీనపడితే దాని ప్రభావం కేవలం షేర్ మార్కెట్‌కే పరిమితం కాదు. ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. సామాజిక భద్రత బలహీనపడుతుంది. కీలక రంగాలపై ప్రభుత్వ నియంత్రణ తగ్గుతుంది. చివరికి దేశ ఆర్థిక వ్యవస్థ కొద్ది కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం పెరుగుతుంది. అందుకే ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్న సమయంలో వాటాలను తక్కువ ధరలకు విక్రయించడం దూరదృష్టి లేని నిర్ణయంగా కనిపిస్తోంది.

మంగళవారం మార్కెట్ ముగిసే సమయానికి ఎల్ఐసి షేరు 8.66 శాతం నష్టంతో ముగిసింది. ఇది కేవలం ఒక రోజు పతనం మాత్రమే కాదు. ఇలాంటి నిర్ణయాలు పునరావృతమైతే ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది. షేర్ ధర తిరిగి పెరగవచ్చు. కానీ ఒకసారి కోల్పోయిన నమ్మకాన్ని తిరిగి సంపాదించడం అంత సులభం కాదు.

ప్రభుత్వం తక్షణ ఆదాయ అవసరాల కోసం దేశ ఆర్థిక భద్రతకు ప్రతీకగా నిలిచిన ఎల్ఐసిని బలహీనపరచకూడదు. వాటా విక్రయాలు అవసరమైతే అవి మార్కెట్ స్థిరత్వాన్ని దెబ్బతీయకుండా, మదుపరుల ప్రయోజనాలను కాపాడేలా, పారదర్శకంగా, దశలవారీగా జరగాలి. ప్రజల విశ్వాసంతో వెలిగిన ఈ దీపాన్ని ప్రభుత్వమే గాలికి వదిలేయకూడదు.

**ఎల్ఐసి కేవలం ఒక కంపెనీ కాదు... అది కోట్లాది భారతీయుల నమ్మకం. ఆ నమ్మకం గాలిలో దీపంలా తడబడే పరిస్థితి రాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.**

# కలాన్ని కత్తిగా మార్చిన విప్లవ మేధావి సరోజ్ దత్త



కామ్రేడ్ సరోజ్ దత్త జీవితాన్ని పరిశీలిస్తే.. అది ఒక వ్యక్తి జీవితం మాత్రమే కాదు. అది భారతీయ సమాజంలోని వర్గ వైరుధ్యాలను, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను, కమ్యూనిస్టు ఉద్యమంలోని సిద్ధాంత సంఘర్షణలను, విప్లవ రాజకీయాల పరిణామాన్ని ప్రతిబింబించే సజీవ చరిత్ర. ఆయన పేరువినగానే చాలామందికి గుర్తుకొచ్చేది నిర్భయ రచయిత. మరికొందరికి ఒక అద్భుతమైన పాత్రికేయుడు. కలాన్ని ప్రజల విముక్తి కోసం ఉపయోగించిన మేధావి. అవసరమైతే ఆ కలాన్ని పక్కన పెట్టి తుపాకీ దారిని ఎంచుకున్న విప్లవకారుడు.

సరోజ్ దత్త జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే.. ఆయన పుట్టిన కాలాన్ని అర్థం చేసుకోవాలి. బ్రిటిష్ వలస పాలన భారతదేశాన్ని ఆర్థికంగా దోచుకుంటున్న కాలమది. ఒకవైపు జాతీయోద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతుండగా.. మరోవైపు కార్మికులు, రైతులు తమ హక్కుల కోసం కొత్త రకమైన రాజకీయ చైతన్యాన్ని నిర్మించుకుంటున్నారు. ఆ సమయంలో రష్యా అక్టోబర్ విప్లవం ప్రభావం భారత యువతపై పడింది. అదే ప్రభావం సరోజ్ దత్త జీవితం మలుపు తిప్పింది. విద్యార్థి దశలోనే సాహిత్యం, చరిత్ర, రాజకీయాలపై ఆయనకు గాఢమైన ఆసక్తి ఏర్పడింది. కవిత్వం, వ్యాసరచన, విమర్శ, ఏ ప్రక్రియలో చూసినా ఆయనలో అసాధారణమైన ప్రతిభ కనిపించింది.

జనంసాక్షి

కార్ల్ మార్క్స్, వ్లాదిమిర్ లెనిన్, మావో జెడాంగ్ రచనలు ఆయన రాజకీయ దృష్టిని పదును పెట్టాయి. భారతదేశంలోని సామాజిక-ఆర్థిక పరిస్థితులను విశ్లేషించేటప్పుడు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ అనుభవాలను అధ్యయనం చేశారు. అయితే వాటిని యాంత్రికంగా అనుసరించకుండా, భారత వాస్తవికతతో అనుసంధానించాలనే ప్రయత్నం చేశారు. 1960ల నాటికి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో తీవ్రమైన సిద్ధాంత విభేదాలు ప్రారంభమయ్యాయి. పార్లమెంటరీ మార్గమా? లేక విప్లవ మార్గమా? అనే ప్రశ్న తీవ్ర చర్చకు దారితీసింది. ఈ సమయంలో సరోజ్ దత్త స్పష్టంగా విప్లవ రాజకీయాలవైపు నిలిచారు.

1967 మే నెల. ఉత్తర బెంగాల్‌లోని ఒక చిన్న గ్రామం పేరు ఒక్కసారిగా ప్రపంచ రాజకీయ చరిత్రలో స్థానం సంపాదించింది. ఆ గ్రామం నక్సల్బరీ. అక్కడ జరిగిన రైతాంగ తిరుగుబాటు కేవలం ఒక భూ వివాదం కాదు. భారత విప్లవ రాజకీయాల దిశను మార్చిన చారిత్రక మలుపు. ఆ సంఘటన అనేక మంది కమ్యూనిస్టుల రాజకీయ ఆలోచనలను కుదిపేసింది. ఆ జాబితాలో ముందు వరుసలో నిలిచిన ప్రథముల్లో ఒకరు సరోజ్ దత్త. నక్సల్బరీ తిరుగుబాటుకు ముందు కూడా మార్క్సిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారు. 1967 తర్వాత ఆయన ఆలోచనల్లో మరింత స్పష్టత, మరింత తీవ్రత కనిపించింది. భూస్వామ్య దోపిడీ, సామ్రాజ్యవాద ఆధిపత్యం, పాలక వర్గాల హింస అన్నీ ఎన్నికల ద్వారా కాదు, ప్రజా విప్లవ పోరాటాల ద్వారానే అంతమవుతాయని ఆయన విశ్వసించారు. అదే సమయంలో కమ్యూనిస్టు ఉద్యమంలో పార్లమెంటరీ రాజకీయాలను కొనసాగించాలా? లేక రైతాంగ సాయుధ పోరాటాన్ని ప్రధాన మార్గంగా స్వీకరించాలా? అనే ప్రశ్నపై చర్చలు వేడెక్కాయి. సరోజ్ దత్త ఈ ప్రశ్నను రాజకీయ వ్యూహంగా మాత్రమే కాకుండా వర్గపోరాట దృక్పథంతో విశ్లేషించారు. ఈ దశలో ఆయనకు అత్యంత సన్నిహిత రాజకీయ సహచరుడిగా నిలిచిన వ్యక్తి చారు మజుందార్. చారు మజుందార్ ప్రతిపాదించిన రాజకీయ రేఖను సరోజ్ దత్త కేవలం సమర్థించలేదు. దానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించే రచనలను రూపొందించారు.

1969లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు -లెనినిస్టు) ఏర్పాటు భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక కీలక ఘట్టం. ఈ నిర్మాణ ప్రక్రియలో సరోజ్ దత్త పాత్ర ఎంతో ప్రాముఖ్యమైనది. సాయుధ పోరాటం అంటే కేవలం తుపాకీ కాదని ఆయన పదేపదే రాశారు. రాసిన వ్యాసాలు బెంగాల్ యువతపై విశేష ప్రభావం చూపాయి. విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, కార్మిక ప్రాంతాలు, గ్రామీణ యువకుల్లో ఆయన రచనలు విస్తృతంగా చర్చకు వచ్చాయి. ఇదే సమయంలో మరో ప్రశ్న కూడా ఎదిరించింది. విప్లవ రాజకీయాలు ప్రజల మధ్య దీర్ఘకాలిక సంస్థాగత పనిని ఎలా నిర్మించాలి? పోరాట వ్యూహంలో ఎలాంటి సవరణలు అవసరం? ఈ చర్చలు ఉద్యమంలో కొనసాగుతున్నప్పటికీ, సరోజ్ దత్త తన నిబద్ధతను విడిచిపెట్టలేదు.

1970 - 71 కాలం భారతదేశ రాజకీయ చరిత్రలో అత్యంత ఉద్రిక్తమైన దశ. నక్సల్బరీ ప్రభావం పశ్చిమ బెంగాల్‌తో పాటు దేశంలోని పలు ప్రాంతాలకు వ్యాపించింది. అరెస్టులు, నిర్బంధాలు, పోలీసు కాల్పులు, విచారణ లేకుండా నిర్బంధాలు సాధారణ సంఘటనలుగా మారాయి. ఈ నేపథ్యంలో సరోజ్ అజ్ఞాత జీవితాన్ని గడపాల్సి వచ్చింది.

1971 ఆగస్టు తొలి వారంలో సరోజ్ దత్తను కోల్‌కతాలో పోలీసులు రహస్యంగా అదుపులోకి తీసుకున్నట్లు విస్తృతంగా నమోదు చేయబడింది. అధికారికంగా ఆయన అరెస్టును ప్రభుత్వం అంగీకరించలేదు. కోర్టులో హాజరుపరచలేదు. ఇది కేవలం వ్యక్తి అదృశ్యం కాదు. చట్టపరమైన ప్రక్రియ మొత్తాన్ని పక్కనబెట్టిన అధికార దుర్వినియోగానికి ఉదాహరణగా నిలిచింది. ఆయనను పోలీసు కస్టడీలోనే హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించలేదు. ఒక ప్రజాస్వామ్య దేశంలో ఒక రచయిత, ఒక రాజకీయ నాయకుడు ఇలా అదృశ్యమవడం కేవలం వ్యక్తిగత విషాదం కాదు. అది ప్రజాస్వామ్య వ్యవస్థకే ఒక తీవ్రమైన ప్రశ్న.

సరోజ్ దత్తను కేవలం ఒక విప్లవ నాయకుడిగా మాత్రమే చూడటం అసంపూర్ణం. ఆయన ఒక ప్రముఖ పాత్రికేయుడు కూడా. అందువల్ల ఆయనపై జరిగిన దమనాన్ని పత్రికా స్వేచ్ఛ కోణంలో కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాన్ని విమర్శించే కలం అధికారానికి ఎప్పుడూ అసౌకర్యమే. చరిత్రలో ఎన్నో సందర్భాల్లో రచయితలు, సంపాదకులు, కవులు, పాత్రికేయులు నిర్బంధానికి గురయ్యారు. సరోజ్ దత్త కూడా అదే వరుసలో నిలిచారు. ఆయన మరణం ఒక వ్యక్తి మరణం మాత్రమే కాదు. ప్రశ్నించే స్వరాన్ని మూయించాలనే ప్రయత్నానికి ప్రతీక. ఆయన మరణం ఇప్పటికీ ఒక ప్రశ్నగా నిలిచి ఉంది. ఒక ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ భిన్నాభిప్రాయాన్ని బుల్లెట్లతో అణచివేయవచ్చా? ఈ ప్రశ్నకు చరిత్ర ఇంకా సమాధానం వెతుకుతూనే ఉంది. ఆయన మరణించి దశాబ్దాలు గడిచినా, ఆయన లేవనెత్తిన ప్రశ్నలు ఇంకా భారత సమాజం ముందు నిలిచి ఉన్నాయి. ఆయన చూపించిన రాజకీయ దిశను, ప్రజాస్వామ్యంపై ఆయన లేవనెత్తిన ప్రశ్నలను, సమాజ మార్పుపై ఆయన కలల్ని తిరిగి పరిశీలించడం అవసరం.

నేడు మీడియా రంగం గురించి తరచూ చర్చ జరుగుతోంది. వార్తలు వ్యాపారమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారాన్ని ప్రశ్నించే స్వరాలు తగ్గుతున్నాయనే ఆందోళన వ్యక్తమవు తోంది. ఇలాంటి సమయంలో సరోజ్ దత్త పాత్రికేయ జీవితం మరింత ప్రాసంగికంగా కనిపిస్తుంది. "ప్రజల వేదనను రాయకపోతే పాత్రికేయం అసంపూర్ణం." అధికార ప్రకటనలను ముద్రించడం వార్త కాదని, అధికారాన్ని ప్రశ్నించడం పాత్రికేయ ధర్మమని తన జీవితంతోనే నిరూపించారు.

**విప్లవ రాజకీయాలపై ఆయన ప్రభావం**


భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సిద్ధాంత చర్చలకు సరోజ్‌దత్త చేసిన కృషి విశేషం. మార్క్సిజాన్ని భారతీయ సామాజిక వాస్తవికతతో అనుసంధానించాలనే ప్రయత్నం ఇప్పటికీ అధ్యయనానికి అర్హమైనది. అయితే చరిత్రను శాస్త్రీయ దృక్పథంతో చూడాలంటే మరో అంశాన్ని కూడా గుర్తించాలి. ఆయన ప్రాతినిధ్యం వహించిన రాజకీయ రేఖ, ఆ కాలంలోని విప్లవ వ్యూహాలపై కమ్యూనిస్టు ఉద్యమంలోనే విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రజా ఉద్యమాల నిర్మాణం, సాయుధ పోరాట వ్యూహం, పార్టీ నిర్మాణ పద్ధతులపై భిన్న ధోరణులు ఉద్భవించాయి. ఈ చర్చలు భారత వామపక్ష రాజకీయాల పరిణామంలో కీలక భాగంగా నిలిచాయి.

నేటి భారతదేశం కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, రైతాంగ సంక్షోభం, కార్మిక హక్కుల ప్రశ్న, భావప్రకటన స్వేచ్ఛపై చర్చలు, ప్రజాస్వామ్య సంస్థల పాత్ర. ఈ అన్ని అంశాల మధ్య సరోజ్ దత్త రచనలు మళ్లీ చదవాల్సిన అవసరం ఉంది. అవి అన్ని ప్రశ్నలకు సిద్ధమైన సమాధానాలు ఇవ్వకపోవచ్చు. కానీ ప్రశ్నించే ధైర్యాన్ని మాత్రం తప్పకుండా నేర్పుతాయి. 'కలం చేతిలో ఉన్నంతకాలం ప్రజల కోసం రాశాడు. కలం లేని సమయంలో తన జీవితాన్నే ఒక రాజకీయ ప్రకటనగా మార్చాడు' ఆయన మరణాన్ని చీకటి కప్పివేసినా,ఆయన ఆలోచనలను చరిత్ర వెలుగులో నిలబెట్టింది. సరోజ్ దత్తను చంపింది బుల్లెట్ కావచ్చు. కానీ ఆయన ఆలోచనలను చంపలేకపోయింది ఏ రాజ్యమూ. కలాన్ని ఆయుధంగా, సత్యాన్ని సిద్ధాంతంగా, ప్రజల విముక్తిని జీవిత లక్ష్యంగా ఎంచుకున్న ఆ విప్లవ మేధావి నేడు కూడా ప్రతి ప్రశ్నించే కలంలో, ప్రతి ప్రతిఘటనలో, ప్రతి ప్రజాస్వామ్య స్వరంలో జీవిస్తూనే ఉన్నాడు.



మామిండ్ల రమేష్ రాజా
7893230218

# వాస్తవ జీవితాలను చిత్రించిన లేపాక్షి




సడ్లపల్లి చిదంబర రెడ్డి గారి కలం నుండి వెలువడిన 'లేపాక్షి' ఒక చారిత్రక నవల. చరిత్రలోనే ఫిక్షన్ ని జోడించి అద్భుతంగా మేళవించి రాసిన నవల. రాజుల కాలాలను, ఆయా కాలాల్లోని శిల్ప సంపదను ఘనంగా కీర్తించే తప్పుడు చరిత్రను ఇన్నాళ్లుగా ఒకవైపు చదువుతూ వచ్చాం. కానీ, రచయిత నాటి బతుకుల సాక్షి అంటూ చేదు వాస్తవాలను సేకరించి అధ్యయనం చేసి పూసలా గుచ్చి, నవలగా మలచి ప్రయత్నం చేయడం హర్షించదగ్గ విషయం.. ప్రఖ్యాత సమీక్షకులు బి.ఎస్. రాములుగారు తన ముందు మాటలో రాసినట్టు ఇది ఒక చారిత్రక, కాల్పనిక నవల. ఎందుకంటే, ఇందులో గత చరిత్రలో జరిగిన, కొనసాగిన ఎన్నో అంశాలు ఉన్నాయి. కాల్పనిక నవల ఎందుకంటే, అసంఖ్యాకమైన కాల్పనిక పాత్రలు ఇందులో కనిపిస్తాయి. కథగా, నవలగా మారి రంజింపజేస్తాయి.

'లేపాక్షి' నవల కథాకాలం విజయనగర సామ్రాజ్యంలో తుళు వంశ పాలన చివరి రోజులు. పెనుగొండకు మండలాధిపతిగా ఉండిన విరూపణ్ణ గవిగుడి దగ్గర లేపాక్షి ఆలయాన్ని నిర్మించిన సమయంలో సంభవించిన పరిణామాలను ఈ నవల చిత్రించింది. ముఖ్యంగా, శిల్పుల కష్టాలనూ, వాస్తవ జీవితాలనూ చిత్రించింది ఈ నవల. ఏది ఏమైనా, శిల్ప సౌందర్యం చూస్తే సంతోష పడిపోతాం. ఆహా! ఎంత గొప్పగా చెక్కారో అని సరదా పడిపోతాం. రాజులకు శిల్ప కళల మీద ఉన్న ఉత్సాహాన్ని ఆకాశానికి ఎత్తేస్తూ రాస్తాం. కొనియాడతాం. తరగతి గదిలో కూడా తెలుగు,చరిత్ర క్లాసులో అలానే ఉపాధ్యాయులు బోధిస్తారు. కానీ, నిజం మరోలా చేదుగా ఉంటుందనేది ఇలాంటి రచనలు చదివితేనే తప్ప పాఠకులకు అర్థం కాదు. ఆయా శిల్పాలు చెక్కడానికి సంవత్సరాల తరబడి ఆయా శిల్పులు పడిన కష్టాలు ఈ రచనలో చూస్తాం. ఈ నిజాలు ఏ అచ్చు పుస్తకాల్లో కూడా కనిపించవు. అవి ఇలాంటి పుస్తకాలు చదివితేనే తప్ప అర్థం కాదు.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో వేశ్యా వృత్తిపై వేసిన పన్నులతో వచ్చే ఆదాయం 40 శాతంగా ఉండేదనే వాస్తవం తెలుస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. వేశ్యా వృత్తిని పోషించిన రాజరిక సమాజం అది. అంతేగాక, సైన్యం యుద్ధంలోకి వెళ్లే ముందు వారి దగ్గరకు వేశ్యలను పంపించే ఆచారం ఉండేది. స్త్రీలను అవమానం చేసే ఇలాంటి పదజాలం రాయడానికే మనస్కరించడం లేదు. అలాంటిది ఒక వ్యవస్థ కొనసాగింది అంటే మనకు ఆశ్చర్యం వేస్తుంది. ఇలాంటి ఆశ్చర్యం కలిగించే ఎన్నో చారిత్రక అంశాలు అచ్చు పుస్తకాల్లో ఎక్కడా రాయనివీ, చెప్పనివీ మనకు ఈ నవల్లో కనిపిస్తాయి. అమ్మాయి రజస్వలయితే మొదటి రాత్రి స్థానిక అధికారి అనుభవించడం అనే అత్యంత కిరాతకమైన, నికృష్టమైన ఆచారం ఆ రోజుల్లో కొనసాగేదని తెలుస్తుంటే మనసు హృద్యంగా మారుతుంది. ఈ నవల్లో ఇలాంటి ఎన్నెన్నో మనకు తెలియని విషయాలు చదువుతాం. తెలుసుకుంటాం. ఆనాటి చారిత్రక పరిస్థితుల గురించి, సామాజిక పరిస్థితుల గురించి తెలుసుకుంటాం.

విజయనగర సామ్రాజ్యం కాలంలోని కుల వ్యవస్థనీ, అందులోని వైరుధ్యాలనీ లేపాక్షి చిత్రీకరించింది. లేపాక్షి నిర్మాణంలో స్థపతులు బహుళ వృత్తులలో ప్రజలు చేసిన శ్రమను రచయిత ఎంతో నిబద్ధతతో చిత్రించాడని మరో ప్రసిద్ధ రచయిత డాక్టర్ రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారు రాస్తున్నారు. ఈ నవల ఆ కాలంలోనే రైతుల గిట్టుబాటు ధరల చట్టం కోసం డిమాండ్ చేయడాన్ని ప్రస్తావించిందని ఆయన అంటారు. రాజులు తమ ప్రయాణాలకు రహస్య మార్గాలను ఏర్పాటు చేసుకునే సమయంలో సొరంగం మార్గం పూర్తి కాగానే అందులో పని చేసే శ్రామికులను చంపి అడవుల్లో పారేస్తారనే విషయం కూడా తెలుస్తుంది. . ఇక ఆయా రాజుల్ని కీర్తించాలా లేదా, చరిత్ర నుంచి నేర్చుకోవాలా అన్నది పాఠకులే గ్రహించాల్సిన అవసరం ఉంది.

చివరిలో రచన ఇలా బాధ కలిగిస్తుంది.

> **ఇప్పుడు లేపాక్షి గుడి గుడిలాలేదు**
> **పక్షినీ, పిల్లలను గుడ్లగూబ దిగమింగి**
> **చిందరవందర చేసిన గూడులా ఉంది**
> **ఎక్కడ చూసినా రక్తపు మడుగులు**
> **తెగిపడి ఉన్న అభాగ్యుల అంగాలు**
> **గుట్టలు గుట్టలుగా పడి ఉన్న శవాలు**
>
> **అరకొర ప్రాణాలతో కదలాడే దేహాలు**
> **ఆర్త జనులను ఆదుకునే అభయ హస్తాలతో**
> **నిశ్చింతగా శిల్పాల రూపంలో దేవతామూర్తులు**
> **గబ్బిలాల రెక్కల చప్పుడు మధ్యన**
> **నిశ్శబ్ద స్మశాన వాటిక వాతావరణం**


మానవ శ్రమకు పెద్దపీట వేసిన విషాదాంత రచన ఈ లేపాక్షి నవల అని రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డిగారు అందుకే అంటున్నారు. శిల్పుల కోణంలో, శ్రమజీవుల కోణంలో, సాధారణ ప్రజల కోణంలో ఒక చారిత్రక నవల రాయడం అన్నది ఎంతో శ్రమతో కూడుకున్న పని. తాను ఎంచుకున్న అంశం పట్ల ఎంతో ప్రేమ ఉంటేనే తప్ప ఈ రకమైన రచన రచయిత కలం నుండి వెలువడదు.

లేపాక్షి ఒక నవలగా ముందుకు నడుస్తూనే ఎంతోమంది జీవితాలను తాకుతూ అప్పటి రాచరిక వ్యవస్థ యొక్క చీకటి కోణాలను కళ్ళముందు ఉంచుతుంది. ముఖ్యంగా, శిల్పులు పడిన కష్టాలూ, ఆవేదనలూ కనిపిస్తాయి. అలానే, మంచి రోజుల కోసం, మంచి జీవితాలకోసం ఆయా పాత్రల చర్చలూ, ఆలోచనలూ, తాత్విక సిద్ధాంతాలూ మనకు నవల మొత్తం వినిపిస్తాయి. రాజుల కాలంలో ఉన్న అపోహలను తొలగించి వాస్తవాలను మన ముందు ఈ నవల ఉంచుతుంది. తిక్కస్వామి, పద్మిని, వీరభద్రప్ప ఈ నవలలో మర్చిపోలేని పాత్రలు. నవల మొత్తం సజీవంగా ఉన్న పాత్రలు. నవలను సజీవంగా ముందుకు నడిపించిన పాత్రలు. ఇంకా ఎన్నో పాత్రలు లేకపోలేదు.

నవలంతా రాజుల చరిత్ర. కానీ, ప్రజల కోణంలో రచన నడుస్తుంది. ప్రజలకు జరిగే అత్యాచారాలు రచనలో కనిపిస్తాయి. రాచరిక వ్యవస్థలమీద ఇతర పుస్తకాల్లో కనిపించే పొగడ్తలు, ప్రశంసలు కనిపించవు. వినిపించవు. అత్యంత సహజంగా రాజుల కుట్రలు, కుతంత్రాలు కనిపిస్తాయి. చివరికి శిల్పకళల అభివృద్ధి కోసం జంతువుల మీద అత్యాచారం కూడా మనం ఈ నవల్లో చూస్తాం. రాళ్ళను గుళ్ళ మీదకి ఎక్కించడానికి ఎద్దుల్ని ఉపయోగించుకునే విధానం అత్యంత బాధాకరంగా ఉంటుంది. ఎద్దులు పడిపోతూ ఉంటాయి. హృదయవిదారంగా విలపిస్తూ ఉంటాయి. చనిపోతూ ఉంటాయి. అయినా, రాజరిక వ్యవస్థలు కొనసాగుతూనే ఉంటాయి. పద్మిని పాత్ర ద్వారా స్త్రీల మీద సమాజం యొక్క చిన్న చూపు కనిపిస్తుంది. అయితే, నవల్లో మంచి మనుషులు కూడా ఉంటారు. మంచి గురించి ఆలోచిస్తుంటారు . మంచి సమాజం కోసం, ఆదర్శవంతమైన జీవితం కోసం కలలు కంటూ ఉంటారు .

నవల్లో అసంఖ్యాకమైన పాత్రలు ఉంటాయి. అయినా సరే, ఎక్కడా ఏ రకమైన ఇబ్బంది లేకుండా నవల పాఠకునికి ముందుకు తీసుకుపోతూ ఉంటుంది. లేపాక్షి అనేది శిల్పకళా సంపదల మీద మాత్రమే రాసిన నవల కాదు. ఒక పెద్ద జీవిత కాలాన్ని సృష్టించింది. రాజుల కాలంలో జన జీవితం ఏ రకంగా ఉందో తెలియజేసింది. కొన్ని వృత్తులలో అంతర్గత సమస్యలను ముందుకు తెచ్చింది. కులాల మీద వైరుధ్యాలను ముందుకు తెచ్చింది. చర్చించింది . ఏది అవసరం? ఏది అనవసరం? చర్చలో కొనసాగింది. చేనేత వృత్తుల అసాధారణమైన సేవను కొనియాడారు .. అసాధారణమైన శిల్ప సంపదను దేవాలయాల్లో సృష్టించిన చేనేత ఒక ప్రత్యేక కులం పాత్ర హర్షించదగ్గది. బ్రాహ్మణ వర్గం ఆ దేవాలయాల మీద ఆధిపత్యం సంపాదించడానికి రాజుల సహకారంతో ఎలా కొనసాగిందో కూడా నవల్లో చూస్తాం. తెలుసుకోవడానికీ, నేర్చుకోవడానికీ, సంస్కరించుకోవడానికీ ఎన్నెన్నో అంశాలను ఈ నవల మనకు అందించేందుకు కృషి చేసింది. చారిత్రక వాస్తవాలను కాల్పనికతను జోడించి రచయిత ప్రతిభావంతంగా రాసిన నవల ప్రతిఒక్కరూ చదవాల్సిన రచన. తెలీని ఎన్నో చారిత్రక అంశాలు, శిల్ప సంపద అందాల వెనక ప్రజల చెమట, దోపిడీ కూడా తెలుసుకునే అవకాశం ఉంది.

**తపన సాహిత్య వేదిక ప్రచురణలు**
**టీచర్స్ కాలనీ, హిందూపురం**
**515 211**
**అన్వీక్షికి పబ్లిషర్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ 2024**
**పేజీలు 180**
**సెల్: 94400 73636**



కేశవ్
9831314213

# పిఆర్సి (పే రివిజన్ కమిషన్) ఎప్పుడు అమలు పరుస్తారు?

ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు భాగం. ప్రభుత్వ పాలన సక్రమంగా నిర్వహించబడాలంటే ఉద్యోగుల కృషి ఎంతగానో దోహదపడుతుంది. ప్రభుత్వ పథకాలు కానీ, సంక్షేమ పథకాలు కానీ, అభివృద్ధి కార్యక్రమాలు కానీ, విద్యా, వైద్యం కానీ, రాష్ట్రంలోని వివిధ డిపార్ట్మెంట్లలో పథకాలు ప్రజలకు సక్రమంగా అందాలంటే ఉద్యోగులు నిజాయితీగా, మంచిగా పనిచేయాల్సి ఉంటుంది. ఉద్యోగులు సక్రమంగా పనిచేసినప్పుడు మాత్రమే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. తదనుగుణంగా ఉద్యోగులకు సకాలంలో చెల్లించాల్సినటువంటి జీతభత్యాలు కానీ, ఉద్యోగుల జీవన ప్రమాణాలకు అనుగుణంగా, సామాజిక జీవన విధానాలకు అనుగుణంగా, ద్రవ్యోల్బణం కారణంగా నిత్యం నిత్యవసర ధరల పెరుగుదల సూచీకనుగుణంగా ఉద్యోగులకు ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒక డిఎ కరువు భత్యం చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి ఐదు సంవత్సరములకు ఒకసారి పే రివిజన్ కమిషన్ (పి.ఆర్.సి.) ఏర్పాటుచేసి సిఫార్సులను అమలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో రెండవ పే రివిజన్ కమిషన్‌ను 2 అక్టోబర్ 2023న పి. శివశంకర్ చైర్మన్ గా పి.ఆర్.సి. కమిషన్ నియమించడం జరిగినది. తెలంగాణ 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇచ్చిన రెండు ముఖ్యమైన హామీలను గౌరవ ముఖ్యమంత్రి గారు ఒకసారి పరిశీలించండి". 1.ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2023లో పెండింగ్‌లో ఉన్న మూడు డిఏలను తక్షణం చెల్లిస్తామని, 2.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయిన వెంటనే కొత్త పీఆర్సి ని ప్రకటించి, ఆరు నెలల లోపు సిఫారసులను అమలు చేస్తామన్నారు.

**ఎన్నికల సందర్భంగా ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలు**

"కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓట్లే కీలకమైనవి" అనేది బహిరంగ రహస్యం. మీరు అధికారంలోకి వచ్చి 32 నెలలు అవుతుంది. మిమ్ములను కొత్తగా మేము కోరికలు కోరడం లేదు. మీరు ఇచ్చిన హామీలను, మాకు న్యాయంగా రావలసిన వాటిని ఇవ్వాలని కోరుతున్నాం.

1. మీరు అధికారంలోకి వస్తే, ఒకేసారి అప్పుడు బకాయి పడి ఉన్న మూడు విడతల డీ.ఏ.లను వెంటనే చెల్లిస్తామన్నారు. చెల్లించలేదు. ఇప్పటికీ జూన్ 2026 వరకు 5 డి.ఏ.లు పెండింగ్‌లో ఉన్నాయి. జూలై నుండి 6వ డి.ఎ.కూడా చెల్లించాల్సి ఉంటుంది. 2. పీఆర్సి రిపోర్టు తెప్పించుకొని, ఆరు నెలలలోపు పిఆర్సి సిఫార్సులను అమలు చేస్తామన్నారు. 2023 జూలై వరకే పిఆర్సి గడువు అయిపోయినది. పిఆర్సి గడువు 1-7-2023 కూడా అయిపోయి మూడు సంవత్సరములు కావస్తున్నది. ఇప్పటికే రెండు పిఆర్సీల కాలాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 1958 నుండి 2023 వరకు వరకు నష్టపోయాం. టీజీఇజెఎసి గత సంవత్సరం మే నెలలో, ఈ సంవత్సరము ఏప్రిల్ లో ఉద్యమ కార్యాచరణకు పిలుపునిస్తే మే 5న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరాహార దీక్షలు చేపట్టే ఉద్యమాన్ని,ఆ ఉద్యమం తీవ్రతరం కాకుండా ఉద్యమాన్ని నీరు కార్చాలని మీరు ఈ సంవత్సరం మే 2న టిజిఇజేఏసికి ఇచ్చిన హామీలు కూడా అమలు పరచలేకపోయారు. ఇప్పటికీ శివశంకర్ చైర్మన్ ఉన్న పి.ఆర్.సి రిపోర్టు సబ్మిట్ చేయలేదు, దాన్ని అమలు పరిచే దిశగా ఏమాత్రం మీరు చొరవ చూపడం లేదు.

టిజిఇజెఏసీ ఉద్యమ కార్యాచరణ మే 5న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరాహార దీక్షలు ప్రారంభిస్తామంటే ఉద్యమాన్ని నీరుగార్చడం కోసం మీరు నాలుగు హామీలు ఇచ్చారు. 8 నెలలుగా పెన్షనర్ల జెఏసి, బాధిత పెన్షనర్ల సంఘాలు ఉద్యమాలు చేస్తున్న కారణంగా పెన్షనర్లకు బకాయిలు దాదాపుగా 10000 కోట్లు ఉన్నప్పటికీ వంద రోజులలో ఆరు వేల కోట్లు విడుదల చేస్తామని, పి.ఆర్.సి. రిపోర్టు త్వరగా తెప్పించి అమలుపరుస్తామని నాయకులను శాంతపరిచారు. జూన్ 2 నుండి ఈహెచ్ఎస్. నగదు రహిత వైద్యం ఉద్యోగుల 1.5% కాంట్రిబ్యూషన్ తో అమలు చేస్తామని చెప్పి, మూడు నెలలు కాలయాపన చేసి జూలై 17న లాంచనంగా నగదు రహిత వైద్యం అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యే విధంగా ప్రారంభించారు. కానీ 15 రోజులు గడచినా కార్డులు విడుదల కావడం లేదు. నగదురహిత వైద్యం అందించడం లేదు. చాలామంది ఉద్యోగ, పెన్షనర్లు ఆరోగ్య సమస్యలతో లక్షలాది రూపాయలు ఆసుపత్రులల్లో చెల్లించలేక బాధపడుతున్నారు. కానీ సామాన్య ప్రజలకు ఉచితంగా వైద్యం అందించే ఆరోగ్య శ్రీ పథకంలో పది లక్షల వరకు పరిమితి పెట్టారు. కానీ 1.5 శాతం కాంట్రిబ్యూషన్ చేసే ఉద్యోగులకు, పెన్షనర్ల వైద్యంకు మాత్రము 2 లక్షలకు పరిమితి విధించారు. తర్వాత 5 లక్షలకు పరిమితి పెంచుతామని, ఐదు లక్షల దాటినట్లయితే ఈ.హెచ్.సి.టి. ఆమోదంతో పెంచుతామనడం అనడం ఎంతవరకు సమంజసం? ఇది న్యాయమేనా? ట్రస్టు బోర్డు సభ్యులు, ప్రభుత్వం ఆలోచించాల్సిందిగా కోరుతున్నాము. సిపిఎస్ రద్దు పరచి ఓ.పి.ఎస్. అమలు చేస్తామన్నారు అది అమలు పర్చలేదు.

మార్చి 2024 నుండి ఇప్పటివరకు రిటైర్డ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నింటిని వంద రోజులలో 6000 కోట్లు చెల్లించామని ప్రకటించుకున్నారు. కానీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఏ ఒక్కరికి చెల్లించబడలేదు. కమ్యుటేషన్, జిపిఎఫ్ 100 శాతం చెల్లించామని పేపర్లలో ప్రకటించుకున్నారు. కానీ అది అవాస్తవం. ఏప్రిల్ 2026 వరకు జిపిఎఫ్ సబ్మిట్ చేసిన వారికి కొంతమందికి, కమ్యుటేషన్ కూడా కొంత మందికి రాలేదు. వారి టోకెన్ నెంబర్లు పరిశీలించి రాని వారికి చెల్లించగలరు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మీరు ఇచ్చిన హామీలను హామీల వరకే పరిమితం కాకుండా వాటిని అమలుపరిచే దిశగా అడుగులు వేసి లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల విశ్వాసాన్ని చూరగొనాలి. టీజీఇ జెఏసి రాష్ట్ర నాయకులు, పెన్షనర్ సంఘాల రాష్ట్ర నాయకులు ఉద్యోగులకు, పెన్షనర్లకు న్యాయంగా రావలసిన పి.ఆర్.సి, ఆరు డి.ఏ.ల విషయంలో ఉద్యమ కార్యాచరణ తక్షణమే రూపొందించి, తక్షణమే పిఆర్సి రిపోర్టు సబ్మిట్ చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, పి.ఆర్.సి. 50% ఫిట్మెంట్ వెంటనే అమలుపరిచి, ఆరు డీ.ఏ.లను విడుదల చేయాలని అందుకు టీజీఇజెఏసి రాష్ట్ర నాయకులు స్వార్ధాన్ని వీడి ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల పక్షాన ఉండాలని లక్షలాదిమంది ఎదురు చూస్తున్నారు.



**కందుకూరి దేవదాసు**
**రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్**
**రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు**
**9949937745**

# భూ భారతి నుంచి ఆర్‌టీఐ వరకు పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించండి

- కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, అగస్ట్ 4 (జనం సాక్షి) :** భూభారతి, సాదాబైనమా, రీసర్వే, నక్షా సర్వే, మీసేవ, ఎస్ఐఆర్, ఆర్‌టీఐ తదితర రెవెన్యూ సేవలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి, ప్రతి పనిలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులో సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మండల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వివిధ అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. భూభారతి దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని అన్నారు. భూభారతి పోర్టల్‌లో 60 రోజులకుపైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తహశీల్దార్లకు ఆదేశించారు. సర్వేయర్ల కొరత, కోర్టు కేసులు, సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిన దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి సాధ్యమైన వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ల్యాండ్ యాప్‌లోని జీపీఎస్ కోఆర్డినేట్ల ఆధారంగా స్కెచ్‌లు సిద్ధం చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పెండింగ్ ఫైళ్లపై నిరంతరం ఫాలోఅప్ చేయడంతో పాటు, కోర్టు కేసులకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పూర్తి వివరాలతో పంపాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ పనులు కొనసాగుతున్నప్పటికీ భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని



నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు. సాదాబైనమా దరఖాస్తుల పరిష్కారాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన కేసులను లిఖితపూర్వకంగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, ప్రతి మండలంలో పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో చేపడుతున్న గ్రామాల రీసర్వే పనులను వేగవంతం చేస్తూ గ్రామ సరిహద్దుల నిర్ధారణ, ప్రభుత్వ భూముల డిమార్కేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే దశల కోసం ముందస్తుగా గ్రామసభలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, శిక్షణ పొందిన సిబ్బందిని రీసర్వే బృందాలతో సమన్వయం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు లైసెన్స్ సర్వేయర్లను వినియోగించి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. మున్సిపాలిటీల్లో నక్షా సర్వే కోసం అవసరమైన డాక్యుమెంట్ల సేకరణ ఆలస్యంగా జరుగుతుందని గుర్తించిన కలెక్టర్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించి ఆస్తి పన్ను రికార్డులు, ఇతర పత్రాలను వేగంగా సేకరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షిస్తూ డాక్యుమెంట్ సేకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. మీసేవలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, ముఖ్యంగా ఫ్యామిలీ మెంబర్‌షిప్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆలస్యంగా జనన నమోదు వంటి దరఖాస్తులను భౌతికంగా పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అనవసరంగా పెండింగ్‌లో ఉంచడం లేదా తిరస్కరించడం చేయవద్దని స్పష్టం చేశారు. జిల్లాలో ఎస్ఐఆర్ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. ఏఎస్‌డీ జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధులతో పంచుకుని వారి అభిప్రాయాలను స్వీకరించాలని, క్షేత్రస్థాయిలో మరోసారి ధృవీకరణ నిర్వహించి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ సమయంలో డేటా నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఆర్‌టీఐ దరఖాస్తులను కూడా నిర్ణీత గడువులో పరిష్కరించాలని, ప్రతి మండలంలోని ప్రభుత్వ భూముల వివరాలను ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో జిల్లా కార్యాలయానికి పంపాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, డి.ఆర్.ఓ ఎ. నిర్మల, ఆర్.డి.ఓ నవీన్, జిల్లా భూ సర్వే రికార్డుల శాఖ ఏడీ అశోక్, సంబంధిత అధికారులు, మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

- చైర్మన్ శీరిష కృష్ణారెడ్డి



**శామీర్‌పేట్, ఆగస్టు 4 (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యా వరణమును పరి రక్షించాలని అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంటం శీరిష కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రోజు అలియాబాద్ మున్సిపాలిటీలో ఘనంగా వనమహోత్సవంలో భాగంగా మొక్కల పంపిణీ మున్సిపాలిటీ పరిధి లోని 8వ వార్డులో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ కంటం శీరిష కృష్ణారెడ్డి , మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటి, ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ కంటం శీరిష కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని కోరారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకర మైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన మొక్కల పంపిణీ స్థానిక ప్రజలకు ఉచితంగా మొక్కలను అందజేశారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వార్డు ప్రజలు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో చెరువులో దూకి రైతు బలవన్మరణం



**చేర్యాల, ఆగస్టు 4 (జనంసాక్షి) :** అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన చేర్యాల మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలం కొత్త దొమ్మాట గ్రామానికి చెందిన యువ రైతు శెట్టె రామస్వామి (38) వ్యవసాయం కోసం ఆవుల షెడ్డు నిర్మాణం, బోర్లు వేయడం వంటి పనులకు అప్పులు చేశారు. అప్పులు తీర్చలేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన రామస్వామి సోమవారం సాయంత్రం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడ్డారు. అనంతరం తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరి చేర్యాలకు వెళ్లి పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, పలువురు యువకులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుని భార్య శెట్టె లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని తండ్రి కనకయ్య చాలా సంవత్సరాల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. సోదరుడు కూడా కొన్నాళ్ల క్రితం మృతి చెందాడు. ఆ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న రామస్వామి ఆత్మహత్య చేసుకోవడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**చేవెళ్ల, ఆగస్టు 4 (జనంసాక్షి) :** ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చేవెళ్ల ఆర్డీవో పార్థసింహా రెడ్డి రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. మంగళవారం చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో చేవెళ్ల డివిజన్ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలాల వారీగా రాజకీయ పార్టీల నాయకులు సూచించిన సూచనలు, సలహాలు తీసుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లు వెంటనే సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. చేవెళ్ల నియోజకవర్గంలో మొత్తం 298 పోలింగ్ బూత్‌లు, 2,73,883 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటివరకు 2,16,808 మంది ఓటర్ల వివరాలు డిజిటలైజేషన్ పూర్తి కావడంతో 79.16 శాతం పురోగతి నమోదైందని తెలిపారు. మండలాల వారీగా నవాబ్ పేటలో 82.23 శాతం, శంకర్‌పల్లిలో 82.50 శాతం, శంకర్‌పల్లి మున్సిపాలిటీలో 72.24 శాతం, షాబాద్‌లో 79.27 శాతం, మొయినాబాద్‌లో 81.01 శాతం, మొయినాబాద్ మున్సిపాలిటీలో 74.36 శాతం, చేవెళ్ల మండలంలో 82.25 శాతం, చేవెళ్ల మున్సిపాలిటీలో 74.21 శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 125 పోలింగ్ బూత్‌లలో వంద శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మొత్తం ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ 96.35 శాతం పూర్తైందని, ఎన్నికల కమిషన్ ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఇచ్చినందున ఓటర్లు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే తమ ఫారాలు సమర్పించాలని కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత తహసీల్దార్లు లేదా బీఎల్‌వోలను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు బి.కృష్ణయ్య, సురేందర్, మున్సిపల్ కమిషనర్లు యాదగిరి, యోగేష్, జాకీర్ హుస్సేన్, చేవెళ్ల, శంకర్‌పల్లి మున్సిపల్



చైర్‌పర్సన్లు దేవర సమతావెంకట్ రెడ్డి, సాత ప్రవీణ్‌కుమార్, సొసైటీ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, బద్దం శశిధర్‌రెడ్డి, వాసుదేవ్ కన్నా, అయా మండల పార్టీ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, ప్రభాకర్, గోవర్ధన్ రెడ్డి, పెంటారెడ్డి, జనార్ధన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అనంత్ రెడ్డి, నర్సింగ్ రావు, సుభాన్ గౌడ్, సుధాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, టేకులపల్లి శ్రీనివాస్, నరేందర్ గౌడ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హరీశ్‌రావుపై పూర్తిస్థాయి విచారణ జరపాలి

- టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్



**సికింద్రాబాద్, ఆగస్టు 4 (జనంసాక్షి) :** సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు క్షుద్ర పూజలు నిర్వహించారని వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే హరీశ్ రావు రాజకీయ కుట్రలో భాగంగా తెలంగాణలో వర్షాలు పడకుండా, కరువు పరిస్థితులు ఏర్పడాలని ఉద్దేశంతో క్షుద్ర పూజలు చేయించారనే సమాచారం తమకు అందిందన్నారు. ప్రజలు కరువు, కాటకాలతో ఇబ్బందులు పడేలా నీచమైన రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. 2026 మార్చి 2, 3 తేదీల్లో తమిళనాడు లోని తిరుచిరాపల్లి, మే 31 నుంచి జూన్ 1 వరకు కర్ణాటకలోని శివమొగ్గ, జూన్ 2న మళ్లీ తిరుచిరాపల్లి, జూలై 23న శివమొగ్గ ప్రాంతాలకు హరీశ్ రావు స్వయంగా వెళ్లి అక్కడి పూజారులతో క్షుద్ర పూజలు నిర్వహించారని సమాచారం ఉందన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ ప్రయోజనాల కోసం ఇటువంటి చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడటం ప్రజలను గందరగోళానికి గురిచేసే కుట్రగా భావిస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రానికి నష్టం కలిగించే ఉద్దేశంతో తాంత్రిక, క్షుద్ర పూజలు నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర పన్నారనే ఆరోపణలపై భారతీయ న్యాయ సంహిత తో పాటు సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని పోలీసులను కోరినట్లు ఆయన తెలిపారు.

# విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యం

- కల్హేర్‌లో నూతన శాఖ గ్రంథాలయం ప్రారంభం
- గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకావాలి
- ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**కల్హేర్, ఆగస్టు 4 (జనంసాక్షి) :** విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కల్హేర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శాఖ గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తకాలు, ఫర్నిచర్, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ... విద్య ఒక్కటే వ్యక్తిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందన్నారు. సమాజంలో గౌరవప్రదమైన స్థానం, మంచి పేరు, ఉన్నత ఉద్యోగాలు సాధించాలంటే ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. డిజిటల్ యుగంలో కూడా గ్రంథాలయాల ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదని, పుస్తకాల ద్వారా పొందే విజ్ఞానం జీవితానికి బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యా రంగం, ముఖ్యంగా గ్రంథాలయాల అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నాయకత్వంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి



మండల కేంద్రంతో పాటు పెద్ద గ్రామాల్లో కూడా ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు మెరుగైన అధ్యయన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం గ్రంథాలయాలను నిర్మించి అవసరమైన వసతులు కల్పించడం మా బాధ్యతని వాటిని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడం విద్యార్థుల బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, యువత ఎక్కువ సమయం గ్రంథాలయాల్లో గడుపుతూ పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ప్రతి విద్యార్థి తన లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, ఆగస్టు 4 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. గండిపేట మండల టీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జి. రాము యాదవ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎ. రాజేందర్, మండల ఉపాధ్యక్షులు టి. సత్యానంద్, గోపాల్, బి. ప్రవీణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎస్. నరేందర్, కోశాధికారి పి. నరసింహులు, సంయుక్త కార్యదర్శులు ఎస్. ప్రభాకర్, ఎ. శివకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులు జి. విజయకుమార్, ఎస్. రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు శ్యామకుమార్, విజయప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై దశలవారీ పోరాటం

- పిఆర్సీ ప్రకటించేవరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు..
- ఆగస్టు 29న ఇందిరా పార్క్‌లో మహా ధర్నా
- స్పందించకపోతే సెప్టెంబరులో చలో అసెంబ్లీ
- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుయస్పిసి)

**ముషీరాబాద్, ఆగస్టు 4 (జనం సాక్షి) :** ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుయస్పిసి) నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యుయస్పిసి ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో యుయస్పిసి నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యా శాఖ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా రంగానికి 15% నిధుల కేటాయింపు హామీని విస్మరించారని, నాణ్యమైన విద్య పేరుతో పాఠశాలల కుదింపుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తున్నామని ఘనంగా ప్రకటించినప్పటికీ కేవలం యుకెజి




కే పరిమితం చేశారని, ప్రీప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12.00 గంటల వరకే నడపాలన్నారు కానీ, ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం 4.00 వరకు ప్రీప్రైమరీ తరగతులు నడుస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలకు పంపితే మధ్యాహ్నం 12.00 తర్వాత పసి పిల్లలను ఎవరు చూసుకుంటారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని అన్నారు. ప్రాథమిక విద్యకు నష్టదాయకమైన జిఒ 25 ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు టీచర్లు, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక టీచర్ ను నియమించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు డిఈఒ, రెవెన్యూ డివిజన్ కు ఒక డిప్యూటీ ఇఒ, అన్ని మండలాలకు ఎంఈఒ పోస్టులు మంజూరు చేయాలని, పిఒ 2018 కి అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదని యుయస్పిసి నాయకులు మండిపడ్డారు. ఆగస్టు 15 లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ, టెట్ లో సర్వీసు వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. ఆగస్టు 7న పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, పిఆర్సీ ప్రకటించే వరకు ప్రతిరోజూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలనీ పిలుపునిచ్చింది. ఆగస్టు 12,13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, తహసీల్దార్లకు మెమోరాండంలు, ఆగస్టు 19 న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని, ఆగస్టు 29న హైదరాబాద్ లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించిన పక్షంలో సెప్టెంబర్ లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఉపాధ్యాయులతో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని ప్రకటించారు. అన్ని సంఘాలు ఐక్య పోరాటాలకు కలిసి రావాలని, ఉపాధ్యాయులు అందరూ సంఘాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం ఈ పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చావ రవి, ఎ వెంకట్ (టిఎస్యుటిఎఫ్), సిహెచ్ అనిల్ కుమార్, ఎన్ తిరుపతి(టిపిటిఎఫ్), ఎం సోమయ్య, టి. లింగారెడ్డి (డిటిఎఫ్), కొమ్ము రమేష్ (బిటిఎఫ్), మేడి చరణ్ దాస్ (ఎస్సీ,ఎస్టీ టిఎఫ్), ఎస్ హరికిషన్ (టిటిఎ), బి కొండయ్య (ఎంఎస్ టిఎఫ్), వై విజయ కుమార్, రవీందర్ (ఎస్సీఎస్టీ యుయస్) పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయడంలో రాజకీయ పార్టీలు సహకరించాలి




**రాజేంద్రనగర్, ఆగస్టు 4 (జనంసాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నూటికి నూరు శాతం పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం కిస్మత్‌పూర్‌లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు 60 శాతం మంది ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్‌ఓలకు అందజేశారని, మిగిలిన వారు కూడా గడువులోగా ఫారాలను పూర్తి చేసేలా పార్టీ నాయకులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఓటర్ల మ్యాపింగ్ పూర్తికాని వారు బీఎల్‌ఓలను సంప్రదించి మ్యాపింగ్ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్, అత్తాపూర్ డీసీ లు సురేందర్ రెడ్డి, మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎన్. ధనుంజయ, మహమ్మద్ ఖలీద్, శ్రీధర్ రెడ్డి, సోమ శ్రీనివాస్, గోకరి సురేష్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, ఓం ప్రకాష్, బీజేపీ మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్, బొక్క బాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు నవీన్, ఎంఐఎం నాయకుడు తాహెబ్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
05 ఆగస్టు 2026

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- ఇష్టంతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించండి
- ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధిలో పరిశ్రమల భాగ్యస్వామ్యం మరింత పెరగాలి
- బాల వికాస ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభం..
- అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన



**జిన్నారం, ఆగస్టు 5 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం విద్యా రంగం అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మినీ ఇండియా గా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని.. వాటి బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. విద్యారంగం అభివృద్ధికి బాల వికాస ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని వారికి సూచించారు. గడ్డపోతారా మున్సిపల్ పరిధిలోని వావిలాల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోల్డ్ టెక్ కంపెనీ సహకారంతో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను మంగళవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..ఇష్టపడి చదివి, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. విద్యార్థులు విద్యను కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగడానికి ఒక సాధనంగా భావించాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూపే మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించిన ఆయన, ప్రతిభకు కృషి తోడైతే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు అత్యధికంగా విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పరిశ్రమలు విద్యారంగం అభివృద్ధికి మరిన్ని సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. పాఠశాల నుండి ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డు లేకపోవడం మూలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం ప్రత్యక్షంగా చూస్తున్నానని.. వెంటనే సిసి రోడ్డు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ తాన్యను ఆదేశించారు. వావిలాల గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ తాన్య, బాల వికాస్ ఫౌండేషన్ అధ్యక్షులు ఇంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరి రెడ్డి, కౌన్సిలర్లు అశోక్, సతీష్, కో ఆప్షన్ సభ్యులు రవీందర్, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ఆయా వార్డుల ప్రజా ప్రతినిధులు, ప్రోగ్రాం మేనేజర్ తిరుపతి, మోల్డ్ టెక్ పరిశ్రమ ప్రతినిధి ఉగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి హామీ
- మర్యాదపూర్వకంగా కలిసిన నారాయణపేట జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం ప్రతినిధులు



**మక్తల్, ఆగస్టు 4 (జనంసాక్షి) :** గ్రామీణాభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమని, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించి, తగిన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. నారాయణపేట జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మ్యాతరి గోపాలం ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు మంగళవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మ్యాతరి గోపాల్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి, ఉప సర్పంచ్‌లకు తగిన అధికారాల కల్పన, పెండింగ్‌లో ఉన్న సమస్యల తక్షణ పరిష్కారం మరియు స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వినతిపత్రం ద్వారా వివరించారు. ప్రతినిధులు తెలిపిన అన్ని అంశాలను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి శ్రద్ధగా విని సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి సానుకూల స్పందన పట్ల మ్యాతరి గోపాల్, ఫోరం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీకేఆర్ బాలకృష్ణారెడ్డి, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కావాలి హరి పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ తీగల సునేంద్ర కుమార్



నాగర్‌కర్నూల్, ఆగస్టు 4 (జనంసాక్షి) : మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలో పెండింగ్లో ఉన్న పలు సమస్యలను గుర్తించి పూర్తి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ తీగల సునేంద్ర కుమార్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మంగళవారం 17వ వార్డులో విస్తృతంగా పర్యటించి మిషన్ భగీరథ, తాగునీటి పైప్‌లైన్ సమస్యలు, సీసీ రోడ్ల నిర్మాణం మరియు ఇతర మౌలిక వసతులపై స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాలనీవాసులు తమ సమస్యలను మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి వార్డు అభివృద్ధే లక్ష్యం, ప్రతి ఇంటికి మౌలిక సదుపాయాలే ధ్యేయమని, ప్రజా సేవలో నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ రాజేశ్వరి, ఏఈ శివశంకర్, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, కాలనీవాసులు ఉన్నారు.

# కరివెన పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భండారి శాంతికుమార్



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 4 (జనం సాక్షి) :** బీజేపీ రాష్ట్ర నాయకులు ఎగ్గని నర్సింహులు ఆధ్వర్యంలో, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు భండారి శాంతికుమార్ పాలమూరు బీజేపీ నాయకులతో కలిసి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలకమైన కరివెన (కురుమూర్తిరాయ) రిజర్వాయర్‌ను ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్ ప్రస్తుత పరిస్థితి, పెండింగ్ పనులు, కాల్వల నిర్మాణం, భూసేకరణ,(పునరావాసం--పునఃస్థిరీకరణ) తదితర అంశాలను పరిశీలించి, క్షేత్రస్థాయిలో వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి పాలమూరు రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భండారి శాంతికుమార్ మాట్లాడుతూ-పాలమూరు ప్రజలు తేదీల మీద తేదీలు విని విసిగిపోయారు. ఇప్పుడు కావాల్సింది కొత్త ప్రకటనలు కాదు... రైతు పొలానికి కృష్ణమ్మ నీళ్లు. కరివెన రిజర్వాయర్ నిండితేనే ప్రాజెక్టు లక్ష్యం నెరవేరినట్టు కాదు. ఆ నీళ్లు కాల్వల ద్వారా చివరి ఆయకట్టు రైతు పొలానికి చేరినప్పుడే అసలైన లక్ష్యం నెరవేరుతుంది" అని అన్నారు. కరివెన రిజర్వాయర్ వరకు మెయిన్ ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని గుర్తుచేస్తూ, ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయో ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్‌కు ఇంకా కొద్ది నెలలే ఉన్నాయి. కానీ క్షేత్రస్థాయిలో చూస్తే ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. పెండింగ్ పనులు ఇంకా ఎందుకు వేగం పుంజుకోలేదు? ఇలాంటి పరిస్థితుల్లో డిసెంబర్ నాటికి పనులు ఎలా పూర్తి చేస్తారో ప్రభుత్వం ప్రజలకు చెప్పాలి. కేవలం గడువులు ప్రకటించడం కాదు... ఆ గడువులోగా పనులు పూర్తి చేసే కార్యాచరణ కూడా కనిపించాలి" అని అన్నారు. ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు సంబంధించిన పరిహారం, పునరావాసం, =డ= పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. "ఎవరు మొదలుపెట్టారు... ఎవరు క్రెడిట్ తీసుకుంటారు అన్నది తర్వాత మాట్లాడుకోవచ్చు. ముందు పాలమూరు రైతుకు నీళ్లు ఇవ్వాలి. ప్రభుత్వం మాటలు చెప్పడం బంద్ చేసి, పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి" అని శాంతికుమార్ స్పష్టం చేశారు.

**"కరివెన నిండాలి..కాల్వల్లో కృష్ణమ్మ పరుగెత్తాలి**

పాలమూరు పొలం పండాలి!"అని భండారి శాంతికుమార్ పేర్కొన్నారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో బీజేపీ రాష్ట్ర నాయకులు పడకుల బాలరాజు, అచ్చుగట్ల అంజయ్య, నంబి రాజు, రవీందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, నిరంజన్, నాగరాజు, శేఖర్ రెడ్డి, రవీందర్, నిరంజన్, ఆంజనేయులు, సుధీర్, పిల్లి సూర్యనారాయణ, అవినాష్, సదానంద్, బుచ్చిబాబు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి




**తూప్రాన్, ఆగస్టు 4 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ సిబ్బందికి ఒకటవ తేదీన జీతాలు చెల్లిస్తామని ప్రతి నెల వేతనాలకు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి హామీలను వెంటనే అమలు జరపాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్‌ఁడ వర్కర్స్ యూనియన్ (సిఐటీయు) రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం రోజున మనోహరాబాద్ మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్ హాల్ లో సెప్టెంబర్ 8, 9 తేదీలలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ ఁడ వర్కర్స్ (సీఐటీయూ) యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు మనోహరబాద్ నిర్వహణ సందర్భంగా ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశఁ నర్సమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని,రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనాలు గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.కనీస వేతనం రూ.26,000లు ఇవ్వాలన్నారు. జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని 60 సంవత్సరాలు పైబడిన,అనారోగ్యం పాలైన, సహజ,ప్రమాదవశాత్తు మరణించిన ఇతర కారణాలవల్ల పనిచేయలేని కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పని కల్పించాలని కోరారు. గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల అందరి పేర్లు ఆన్లైన్లో నమోదు చేయాలని అన్నారు.ప్రమాదం జరిగి మరణించిన సిబ్బందికి 20 లక్షల నష్టపరిహారం కుటుంబ సభ్యులు ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. మరణించిన కార్మికుని దహన సంస్కరణలకు రూ.30,000 ఆర్థిక సహాయం అందించాలని కోరారు. గ్రామాలలో పనిచేస్తున్న ప్రతి గ్రామపంచాయతీ కార్మికునికి ప్రభుత్వమే గుర్తింపు కార్డులు, సబ్బులు నూనెలు శానిటేషన్ ఇతర సామాగ్రిని ఇవ్వాలని, ఈఎస్ఐ,పిఎఫ్,బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కారో బార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కనిపించాలని, ట్రాక్టర్ నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ ప్రభుత్వం ఇప్పించాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలో పనులు కొనసాగించాలని కోరారు . లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మె కూడా వెనకాడబోమని ఆయన తెలిపారు. ఈ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి, కడారి నాగరాజ్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆసిఫ్, మనోరబాద్ మండల అధ్యక్షులు శ్రీకాంత్, తూప్రాన్ మండల అధ్యక్షులు మహేష్, ఉపాధ్యక్షులు శేఖర్,యాదగిరి,వెంకటేష్, సురేష్, స్వామి, నర్సింలు, మహేందర్, వివిధ మండలాల గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 4 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక లబ్ధిదారులకు సూచించారు. దశలవారీగా ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేస్తే బిల్లులు కూడా త్వరగామంజూరవుతాయని ఆమె తెలిపారు. మంగళ వారం మద్దూరు మండలం, మున్సిపాలిటీ పరిధిలోని భీంపూర్ గ్రామంలో రూఫ్, స్లాబ్ స్థాయిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లతో పాటు గృహప్రవేశం పూర్త యిన మరో ఇంటిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామానికి మంజూరైన ఇండ్ల వివరాలను హౌసింగ్ పీడీ శంకర్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూఫ్ స్థాయిలో ఉన్న ఇంటి లబ్ధిదారురాలు, స్లాబ్ స్థాయిలో ఉన్న ఇంటి లబ్ధిదారురాలితో మాట్లాడి నిర్మాణ పురోగతిని తెలుసు కున్నారు.ఇప్పటివరకు ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చు అయింది, ఎన్ని లక్షల రూపాయల బిల్లులు అందాయి, మిగిలిన పను లను ఎప్పటిలోగా పూర్తి చేస్తారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెప్టెంబర్ నెలాఖరులోగా ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహించా లని కలెక్టర్ సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశా లను సందర్శించిన కలెక్టర్ మధ్యాహ్న భోజన మెనూ,వంటగదిని పరిశీలించారు.పాఠశాలలో మొత్తం 50 మందివిద్యార్థులు ఉండగా, ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నట్లు తెలుసు కున్నారు.వారిలో ఒకరు భీంపూర్ పాఠశాలకు రాకుండా గతంలో విధులు నిర్వహించిన పాఠశాలకే వెళ్తున్నారని తెలుసుకున్న కలెక్టర్, వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారి గోవిం దరాజుకు ఫోన్ చేసి సంబంధిత ఉపాధ్యాయు డిని తక్షణమే భీంపూర్ పాఠశాలకు పంపించాలని ఆదేశించారు.అదేవిధంగా,పాఠశాలలో అదనపు గది నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో పాటు భవనం ఫ్లోరింగ్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయిం చాలని డీఈఓకు సూచిం చారు.ఈ కార్యక్రమంలో మద్దూరు మున్సిపల్ చైర్ పర్సన్ సరస్వతి, కమిషనర్ శ్రీకాంత్,తహసీల్దార్ మహే ష్, హౌసింగ్ ఏఈ, పంచా యతీ కార్యదర్శి తదిత రులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌కు ఆగస్టు 10 వరకు గడువు పొడిగింపు

- జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 4 (జనం సాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విజయవంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ కోరారు. మంగళవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును ఆగస్టు 10 వరకు పొడిగించిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 5,03,859 ఎన్యూమరేషన్ ఫారాల్లో 4,38,852, (87.10 శాతం) ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు.మరో 63,488 (12.60 శాతం) యూఈఎఫ్‌లు,1,519 (0.30 శాతం) ఎన్యూమరేషన్ ఫారాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.మిగిలిన డిజిటలైజేషన్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. గైర్హాజరు,వలస వెళ్లిన, మృతి చెందిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించాలన్నారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ కూడా చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లాలో ఎస్ఐర్ కార్యక్రమం సజావుగా కొనసాగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.తమ పరిశీలనలో గుర్తించిన పలు అంశాలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి,కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో గద్వాల తహసిల్దార్ హరికృష్ణ,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జూరాల ప్రాజెక్టుతో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు

- వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలి
- జూరాల కుడి కాలువ ద్వారా ఆర్డీఎస్ లింక్ కెనాల్స్ కు నీటిని మళ్ళించాలి
- వేసవిలో తాగునీటి కొరత లేకుండా ప్రణాళిక అవసరం
- కాలువలు, ఇతర మరమ్మత్తుల పనులు వేసవిలోనే పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 4 (జనం సాక్షి) :** జూరాల ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన జిల్లాలోని వివిధ ఎత్తిపోతల పథకాలతో ప్రస్తుతం వస్తున్న వరద నీటితో అన్ని రిజర్వాయర్లను నింపుకోవడంతో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీటిని అందించవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ధరూర్ మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మ్యాపును, వివిధ రిజిస్టర్ లను పరిశీలించారు.కర్ణాటక ప్రాజెక్టుల నుంచి కొద్దిరోజులుగా కృష్ణా నదికి పెద్ద ఎత్తున వరద వస్తుండడంతో జూరాల ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం,గేట్ల ద్వారా దిగువకు వదులుతున్న, ఎత్తిపోతల పథకాలకు, సమాంతర కాలువలకు వినియోగిస్తున్న వరద నీటి, తదితర వివరాలను సంబంధిత ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ గేట్లను పరిశీలించిన కలెక్టర్ అక్కడి యంత్రాల పనితీరు,సిబ్బంది వివరాలను అడిగారు. పవర్ హౌస్ నుంచి ఉత్పత్తి అయ్యే జలవిద్యుత్ గురించి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూరాల కుడి కాలువ లైనింగ్ మరమ్మత్తులు, ఇతర పనులను వేసవిలోనే పూర్తి చేయాలని చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందాలంటే కాలువల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టుల నిర్వహణకు వచ్చే నిధులను ఎప్పటికప్పుడు సద్వినియోగం చేసుకుంటే ఎలాంటి సమస్య ఉండదన్నారు. జూరాల కుడికాలువ ద్వారా ఆర్డీఎస్ పరిధిలోని లింక్ కెనాల్సు కు నీటిని మళ్లించేందుకు ప్రయత్నించాలని, ఫలితంగా అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నప్పటికీ కాలువల పరిధిలోని రైతులు ప్రస్తుతం నీటిని విడుదల చేస్తుండడంతో వరి సాగు చేసే అవకాశం ఉందన్నారు. వరి పండించే రైతుల పంటలు చేతికొచ్చే వరకు కాలువల ద్వారా వరి సాగుకు నీటి లభ్యత గురించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గద్వాల నియోజకవర్గ పరిధిలోని గూడెం దొడ్డి, ర్యాలంపాడు, తదితర రిజర్వాయర్లను ప్రస్తుతం వస్తున్న వరద నీటితో పూర్తి స్థాయిలో నింపుకోవాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జూరాల గేట్లు తెరవడంతో సెలవు రోజుల్లో పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తున్నందున వంతెనపై ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. సందర్శకులు ఘాట్ల వద్ద నీళ్లలోకి దిగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్ రహదారుల అభివృద్ధికి ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేయించేందుకు ఇటీవల జిల్లాలో పర్యటించిన రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించినందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలని, ఆర్ అండ్ ఆర్ కేంద్రాల్లో నివసిస్తున్న ప్రజలకు పూర్తిస్థాయిలో సదుపాయాలను కల్పించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు, డిఈ నాగేశ్వరరావు, తహసిల్దార్ నందిని, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలలు గడిచినా పూర్తికాని విద్యుత్ పనులు

- పంచరాయి తండాలో కనెక్షన్ కోసం ఎదురుచూపులు



**పర్వతగిరి, ఆగస్టు 4 (జనంసాక్షి) :** పర్వతగిరి మండలంలోని మాల్యా తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పంచరాయి తండాలో విద్యుత్ పనులను త్వరగా పూర్తి చేసి, కనెక్షన్ ఇవ్వాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. తండాకు చెందిన భానోత్ వెంకటి, వెంకన్నఏమిట్టు ల ఇంటి వద్ద విద్యుత్ సరఫరా కోసం అధికారులు మూడు నెలల క్రితమే స్తంభాలను ఏర్పాటు చేశారు.అయితే స్తంభాలు నాటి మూడు నెలలు గడుస్తున్నా, వాటికి ఇంకా కరెంట్ వైర్లు వేయలేదు. దీనితో పాటు, మిట్టు ఇంటి పక్కనే ప్రమాదకరంగా ఉన్న మెయిన్ విద్యుత్ తీగలను (సప్లై వైర్లను) సరిచేయడానికి అధికారులు మరో రెండు అదనపు స్తంభాలను కూడా అక్కడే ఉంచారు. కానీ ఆ పనులను కూడా ప్రారంభించకుండా అలాగే వదిలేశారు. మూడు నెలలుగా స్తంభాలు వేసి ఉన్నప్పటికీ, తదుపరి పనులు ముందుకు సాగకపోవడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. పంచరాయి తండాలోని భానోత్ వెంకటి ఇంటి వద్ద నాటిన స్తంభాలకు వెంటనే వైర్లు వేయడంతో పాటు, మెయిన్ తీగలను సరిచేయడానికి తెచ్చిన మిగతా రెండు స్తంభాలను కూడా అమర్చి, త్వరగా విద్యుత్ సరఫరాను ప్రారంభించాలని తండా ప్రజలు కోరుతున్నారు.

## బస్సులో పోయిన మొబైల్ ఫోన్ స్వాధీనం

- బాధితుడికి అందజేత



**చిట్యాల, ఆగస్టు 04( జనం సాక్షి):** మండలం లోని ముచినిపర్తి గ్రామానికి చెందిన పోశాల నరేష్ మూడు నెలల క్రితం బస్సు ప్రయాణంలో తన సాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నిరంతరం పర్యవేక్షించిన చిట్యాల్ పోలీసులు సదరు ఫోన్‌ను చాకచక్యంగా రికవరీ చేసి బాధితుడికి అందించారు. బాధితుడు తన ఫోన్ బస్సులో పోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి పోలీసుల సాంకేతిక పరిశీలన ఫలితంగా, మంగళవారం సదరు మొబైల్ ఫోన్ ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నట్లు సీఈఐఆర్ ద్వారా సంకేతాలు అందాయి. వెంటనే స్పందించిన ఎస్ఐ పోచంపల్లి సతీష్ ఆదేశాల మేరకు, కానిస్టేబుల్ లాల్ సింగ్ ఆదిలాబాద్‌లోని ఫోన్‌ను గుర్తించి, అక్కడి నుండి ఇక్కడికి రప్పించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పోచంపల్లి సతీష్ రికవరీ చేసిన ఫోన్‌ను బాధితుడు నరేష్‌కి తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ మూడు నెలల క్రితం బస్సులో పోగొట్టుకున్న ఫోన్ మళ్లీ తిరిగి దొరుకుతుందని తాను ఊహించలేదని బాధితుడు నరేష్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. సీఈఐఆర్ సాంకేతికతను ఉపయోగించి, ప్రత్యేక చొరవతో ఆదిలాబాద్ నుండి తన ఫోన్‌ను రప్పించి ఇచ్చిన చిట్యాల్ ఎస్ఐ పోచంపల్లి సతీష్‌తో పాటు, కానిస్టేబుల్ లాల్ సింగ్, పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ పోచంపల్లి సతీష్ మాట్లాడుతూ... ఫోన్లు పోగొట్టుకున్న వారు ఆందోళన చెందకుండా వెంటనే సస్థానిక స్టేషన్ ఫిర్యాదు నమోదు చేయాలని, సాంకేతికత సహాయంతో పోయిన ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో చిట్యాల్ పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు.

## గ్రామ పంచాయతీల పెండింగ్ విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలి



**నడికూడ, ఆగస్టు 4 (జనంసాక్షి) :** నడికూడ మండలంలోని అన్ని గ్రామాల గ్రామపంచాయతీ ల విద్యుత్ బిల్లు రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేయాలని మంగళవారం నడికుడ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్ రామకృష్ణకు పలు గ్రామాల సర్పంచులు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం క్లిష్టంగా ఉందని గ్రామాలలో పారిశుద్ధ్యం తాగునీటి సరఫరా వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక వసతులను సమర్ధవంతంగా కొనసాగించాలంటే పెండింగ్ లో ఉన్న గ్రామపంచాయతీ ల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే పూర్తిగా మాఫీ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో నడికుడ బిఆర్ఎస్ సర్పంచుల మండల ఫోరం అధ్యక్షులు దొగ్గల కుమారస్వామి. ఫోరం మండల ప్రధాన కార్యదర్శి మేక మల్ల వెంకటేష్ నర్సక్క పల్లి సర్పంచ్ ముత్యాలు పులిగిల్ల సర్పంచ్ పద్మ చర్లపల్లి సర్పంచ్ బండి రేణుక కౌకొండ సర్పంచ్ ఓదెల శ్రీలత తదితరులు పాల్గొన్నారు

## అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నందుకు బెదిరింపులు

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు



**పర్వతగిరి, ఆగస్టు 4 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దూపతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఆకేరు వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై జిల్లా కలెక్టర్‌కు ఒక బాధితుడు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు.అదే తండాకు చెందిన బానోత్ నవీన్ అనే యువకుడు ఈ మేరకు పర్వతగిరి డిప్యూటీ తహశీల్దార్ హరిత కు, వరంగల్ జిల్లా కలెక్టర్‌ను కలిసి తన గోడును వెళ్లబోసుకున్నాడు.బాధితుడు నవీన్ తెలిపిన వివరాల ప్రకారం...దూపతండా సర్పంచ్ ధరంసోత్ తిరుపతి, మాజీ ఉప సర్పంచ్ భూక్యా రాములు తో కలిసి ఆకేరు వాగులో ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా పగలు రాత్రి తేడా లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారని వందల ట్రాక్టర్ ల ఇసుకను పల్లే పకృతి వనం వద్ద నిల్వ చేశారని ఈ అక్రమ రవాణాను ప్రశ్నించినందుకు, అడ్డుకున్నందుకు అధికారులకు పోలీస్ లకు సమాచారం ఇచ్చారనే నెపంతో సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్ అనుచరులు తనపై కక్ష పెంచుకున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా, పోలీసు యంత్రాంగం మరియు రెవెన్యూ అధికారులకు కూడా పెద్ద ఎత్తున లంచాలు ఇస్తూ ఈ అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.తాను ఇసుక రవాణాను అడ్డుకుంటే దారి పొడవునా గొడవలు చేస్తున్నారని,తన ప్రాణాలకు ముప్పు తలపెట్టేలా ప్రవర్తిస్తున్నారని నవీన్ తెలిపాడు. అన్నారం గ్రామ సర్పంచ్ ఇంటి వద్దకు పంచాయతీకి పిలిపించి దాడి చేసి మొబైల్ ఫోన్ పగులగొట్టి తనను తీవ్రంగా బెదిరించినట్లు ఈ విషయం ఎక్కడ చెప్పోద్దు అని గుడిలోకి తీసుకువెళ్లి దేవునిపై ప్రమాణం చేయించారని బాధితుడు ఆరోపించాడు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను వెంటనే సీజ్ చేయాలని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు ప్రాణ రక్షణ కల్పించాలని బాధితుడు కలెక్టర్‌ను వేడుకున్నాడు.ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి, విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# మాతృత్వం వరం.. తల్లిపాలు ప్రతీ బిడ్డకు అమృతం

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



**ఏటూరునాగారం, ఆగస్టు 04(జనంసాక్షి) :** మాతృత్వం వరం, తల్లిపాలు ప్రతీ బిడ్డకు అమృతమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐటిడిఏ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ అధికారిణి ఈపి ప్రేమలత అధ్యక్షతన అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మనకి మాతృత్వం గొప్ప వరం అని, అట్టి మాతృమూర్తి కి వచ్చే తల్లిపాలు ప్రతీ బిడ్డకు అమృతం అని అన్నారు. అంత గొప్ప ప్రాశస్త్యం ఉన్న తల్లిపాల గొప్పదనాన్ని అందరికీ తెలియజేయాలన్న ముఖ్య ఉద్దేశ్యంతో ఈ తల్లిపాల వారోత్సవాలను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. బిడ్డ పుట్టగానే వెంటనే ముర్రుపాలు త్రాగించాలని, బిడ్డకు ప్రతీ రెండు గంటలకు ఒకసారి తప్పకుండ తల్లిపాలు 6 నెలల నిండే వరకు త్రాగించాలని, ఆ తరువాత 7వ నెల నుండి 2 సంవత్సరాలు నిండే వరకు తల్లి పాలతో పాటుగా అంగన్వాడీ కేంద్రాల నుండి అనుబంధ ఆహారాన్ని కొనసాగించాలని, అప్పుడే బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది కావున, ప్రతీ మహిళ ఇలా చేయడం అనేది తల్లిగా తన బిడ్డకు ఇచ్చే గొప్ప వరం అని పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్లకు మాత్రమే ప్రతీ బిడ్డకు తల్లి తరువాత తల్లి హోదా ఉంటుందని, కాబట్టి, ప్రతీ టీచర్ మాతృ హృదయంతో పనిచేసి పిల్లల ఎదుగుదల, అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ములుగు జిల్లాలో బాలలకు సంబంధించి బాల్య వివాహాలు, బాల కార్మికులు ముఖ్యంగా బాలలపై వివిధ రకాల వేధింపులు వంటి బాలల హక్కుల ఉల్లంఘనలు జరుగకుండా సంబంధిత అధికార యంత్రాంగం, ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో అంగన్వాడీ టీచర్లు జాగ్రత్త వహించాలని తెలిపారు. ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లా గా తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం ధృఢ సంకల్పంతో ఉన్నందున ఈ కార్యక్రమ విజయవంతానికి ప్రతీ అంగన్వాడీ టీచర్ కృషి చేసి అందరం కలిసి మన ములుగు జిల్లాను బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ములుగు ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముందుగా సభాధ్యక్షత వహించినటువంటి జిల్లా సంక్షేమాధికారిణి ఈపి ప్రేమలత స్వాగతోపన్యాసం చేస్తూ తల్లిపాల ప్రాముఖ్యతను గూర్చి సమాజంలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం కోసం అంతర్జాతీయ స్థాయిలో ఈ వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగానే మన ములుగు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. అనంతరం ములుగు జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఇప్పటివరకు నిర్వహించిన వివిధ కార్యక్రమాలను గూర్చి మంత్రి కి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, ములుగు జిల్లా ఆత్మ కమిటీ అధ్యక్షులు చిటమట రఘు, స్థానిక ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, శంకర్రాజుపల్లి గ్రామ సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్, రాష్ట్ర ఆర్టీఏ మెంబర్ వసంత శ్రీనివాస్ యాదవ్, ఏటూరునాగారం ఆత్మ చైర్పర్సన్, వివిధ రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, జిల్లా స్థాయి అధికారులు, సీడీపీఓ లు, సూపర్వైజర్లు, వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీలతో ట్రాఫిక్ అంతరాయం

- భారీ ట్రాఫిక్ తో స్థంభించిన జనజీవనం



**మంగపేట, ఆగస్టు 04(జనంసాక్షి) :** మండలంలోని రాజుపేట నుండి చుంచుపల్లి వరకు గల ప్రధాన రహదారి ఇసుక లారీలపై వందలాది లారీలు ఒక్కసారిగా రోడ్డుపై నిలవడంతో భారీ ట్రాఫిక్ ఏర్పడి వాహనదారులకు అంతరాయం కలిగింది. ఇసుక లారీలు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపైనే బారులు తీరి నిలుపుతున్న కారణంగా ఈ ప్రాంతంలో నిత్యం నరకయాతన కనిపిస్తోంది. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వందలాది లారీలు రోడ్డుకు ఇరువైపులా అడ్డదిడ్డంగా ఆపడంతో సాధారణ రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ ట్రాఫిక్ అంతరాయం వల్ల సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే రాత్రి వేళల్లో ఎలాంటి సూచిక బోర్డులు లేకుండా నిలిపిన లారీలు ఘోర రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి అంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు తీవ్రతరం అవుతున్నాయి. ఇప్పటికైనా రవాణా, పోలీసు అధికారులు స్పందించి రోడ్లపై ఇసుక లారీల నిలిపివేతను వెంటనే అరికట్టాలని, లేనియెడల ప్రజాక్షేమం కోసం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## వ్యసన రహిత సమాజంతోనే తెలంగాణ రైజింగ్ సాధ్యం

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**మావల ఆగస్ట్05 ( జనం సాక్షి):** ఆరోగ్యకరమైన యువతే తెలంగాణ రైజింగ్, వికసిత్ భారత్‌కు అసలైన బలమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని బ్రహ్మకుమారీస్ నిలయంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'నశా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారీస్ చేపట్టిన 10 కోట్ల మంది వ్యసనముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలంటే కేవలం గంజాయి, కొకైన్ మాత్రమే కాదని, మద్యం, పొగాకు, జర్దా వంటి చిన్న అలవాట్లు కూడా తీవ్ర వ్యసనాలుగా మారి జీవితాన్ని నాశనం చేస్తాయని హెచ్చరించారు. ప్రస్తుత కాలంలో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, మొబైల్ ఫోన్ల అతిగా వాడకం వంటి డిజిటల్ వ్యసనాలు కూడా యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ పేర్కొన్న సామాజిక పాపాలను గుర్తు చేస్తూ.. విద్యతో పాటు విలువలు, వ్యక్తిత్వ వికాసం ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. విద్యార్థులు ఉదయాన్నే లేవడం, యోగా, ధ్యానం వంటి మంచి దినచర్యలను అలవర్చుకోవాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యసన విముక్తిపై అవగాహన కల్పించేందుకు ప్రతి గురువారం 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఈ ప్రతిజ్ఞా కార్యక్రమం రానున్న 15 రోజుల పాటు విస్తృతంగా కొనసాగుతుందని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, వ్యసనాలకు దూరంగా ఉండటమే ఆరోగ్యవంతమైన జీవితానికి పునాది అని అన్నారు. చెడు అలవాట్లు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థైర్యాన్ని, ఆలోచనా విధానాన్ని దెబ్బతీస్తాయని చెప్పారు. ప్రస్తుత యువత వ్యసనాల బారిన పడి ఆవేశానికి, కోపానికి లోనవుతున్నారని, ఇది కుటుంబ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, పెద్దలను గౌరవిస్తూ, సంయమనంతో ప్రవర్తించాలని కోరారు. అనంతరం నశా ముక్త్ భరాత్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, డీఈవో మాధవి, డిఐఈఓ గణేష్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ రామాయ్య, బ్రహ్మకుమారి నిర్వాహకులు రేవతి, దిల్ రెడ్డి, లెక్రాజ్, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర నుంచి సిద్ధిపేటకు అక్రమ రవాణా

- బాసర చెక్‌పోస్ట్‌లో పట్టుబడ్డ "పంది మాఫియా"



బాసర, ఆగస్టు 04( జనం సాక్షి) : 'బొలెరో లోపల ఏముందో చూపండి" అంటూ అటవీశాఖ అధికారులు తనిఖీ చేయగా అందరూ షాక్ అయ్యారు. లోపల ఉన్నది సరుకు కాదు.. 23 అడవి పందులు! మంగళవారం బాసర గోదావరీ వద్ద ఉన్న అటవీశాఖ చెక్‌పోస్ట్‌లో అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి సిద్ధిపేటకు అక్రమంగా అడవి పందులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని డిప్యూటీ రేంజ్ అధికారి ఎం.శంకర్ నేతృత్వంలోని బృందం పట్టుకుంది. వాహనంతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని బైంసా అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. అక్రమ రవాణాకు గురైన అడవి పందులకు ముందుగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం వాటిని సురక్షితంగా సమీప అటవీ ప్రాంతంలోకి విడిచిపెడతామని అధికారులు తెలిపారు. ఇంకా ఏమైనా చనిపోయిన వాటిని పంచనామ నిర్వహించి ఖననం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ దాడిలో ఫారెస్ట్ బీట్ అధికారులు శివ, సంజయ్, చెక్‌పోస్ట్ వాచర్లు సద్దాం, నరేంద్ర, అనిమల్ ట్రాకర్ శ్రీనివాస్ కీలకంగా వ్యవహరించారు.అడవి జంతువుల అక్రమ రవాణాపై ఇలాంటి తనిఖీలు మరింత కఠినంగా ఉంటాయని డీఆర్ఓ శంకర్ హెచ్చరించారు.

## అంగన్వాడీ కేంద్రం తనిఖీకి వచ్చిన సిడిపివో ముందే విలేకరులపై దుర్భాష

- చోద్యం చూసిన సిడిపివో
- అంగన్వాడి టీచర్ అంభిక, ఆయా కవితకు మెమోలు జారీ చేసిన సిడిపివో
- జిల్లా కలెక్టర్ కు నివేధిక అందిస్తామని చెప్పిన సిడిపివో

**పెద్దవంగర,ఆగస్టు04 (జనం సాక్షి) :** మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన రెండో అంగన్వాడి కేంద్రానికి తాళం వేసి ఉండి సమయపాలన పాటించడం లేదంటూ మంగళవారం పలు దినపత్రికలలో వచ్చిన వార్తలకు స్పందించిన సిడిపివో రేష్మ సంబంధిత అధికారులతో అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సమయ పాలన పాటించని అంగన్వాడి కేంద్రంపై సిడిపివో రేష్మ అధికారులతో కలిసి తనిఖీకి వెళ్లడంతో విషయం తెలుసుకున్న పత్రిక విలేకరులు అంగన్వాడి కేంద్రానికి వెళ్లారు. అంగన్వాడి కేంద్రానికి ఎందుకు వచ్చారు అంటూ అంగన్వాడీ కేంద్రం టీచర్ రంగు అంభిక విలేకరులపై దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడింది. ఎందుకు వచ్చారంటూ నేను కూడా అంగన్వాడి టీచర్ జాబుకు రిజైన్ చేసి మీ అంతు చూస్తా.. అంటూ తనిఖీకి వచ్చిన సిడిపివో ఎదుటే బెదిరింపులకు పాల్పడింది. దీంతో పత్రికా విలేకరులు సమస్యలపై వార్తలు రాయొద్దా అంటూ అంగన్వాడీ టీచర్ అంభికను అడగడంతో, ఆమె విలేకరులను ఇష్టాను సారంగా దూషించింది. అంగన్వాడి కేంద్రానికి తనిఖీకి వచ్చిన సిడిపివో నీకేం అవసరం అంటూ అంగన్వాడి టీచర్ పై ఆగ్రహించింది. అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి నిజా నిజాలను తెలుసుకొని అంగన్వాడీ టీచర్ రంగు అంభిక, ఆయా కవితకు మెమోలను జారీ చేసింది. జరిగిన ఘటనపై జిల్లా కలెక్టర్ కు నివేదిస్తామని తెలిపారు.

## హైకోర్టు ఆదేశాలతో గుట్కా తిరిగి ఇచ్చాం

- భూపాలపల్లి సిఐ నరేశ్ కుమార్..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** "హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను గౌరవిస్తూ స్వాధీనం చేసుకున్న రూ.2.90 లక్షల గుట్కాను వ్యాపారులకు తిరిగి ఇచ్చాం" అని భూపాలపల్లి పట్టణ సిఐ నరేశ్ కుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాలతో గత నెల 24న టౌన్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా పట్టణంలోని 3 కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేశారు. చాత్రం సతీష్, పడమర నర్సింగ్, దేవ్ సింగ్ దుకాణాల్లో నంబర్-1, అనార్, విమల్ తదితర గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. ఆహార భద్రతా శాఖ నోటిఫికేషన్ ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారికి నివేదించారు. అయితే హైకోర్టులో కేసు నడుస్తుండటంతో ఆదేశాల మేరకు సరుకును తిరిగి ఇచ్చామన్నారు. తుది తీర్పు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని సిఐ చెప్పారు.

## పెద్ది సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలి



**నల్లబెల్లి, ఆగస్టు 04(జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలని కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ సాధు రాజేష్ ప్రభుత్వాన్ని కోరారు. గుండెపోటుతో మృతి చెందిన పెద్ది సుదర్శన్‌రెడ్డి ఐదో రోజు సంతాప కార్యక్రమం మంగళవారం నల్లబెల్లి మండల కేంద్రంలోని ఆయన నివాసంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేయూ జేఏసీ నాయకులు పాల్గొని పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సాధు రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు ప్రజాజీవితంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. నర్సంపేటలో ఏర్పడ్డ నూతన వైద్య కళాశాలకు పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలకు శాశ్వత గుర్తింపుగా పాకాల చెరువు కట్టపై కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, కేయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు, జేఏసీ నేత జోరిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుబడిన వాహనాలకు వేలం పాట

**చెన్నూర్ ఆగస్టు 4 (జనం సాక్షి) :** చెన్నూరు పట్టణంలో ఎక్సైజ్ స్టేషన్‌లో పట్టుబడిన 9 వాహనాలకు ఈ నెల 6న ఉదయం 9 గంటలకు పబ్లిక్ ఆక్షన్ నిర్వహించనున్నట్లు చెన్నూర్ ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. నడిచే సామర్థ్యం ఉన్న వాహనాలను ఆక్షన్ వేస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని కోరారు. వాహనాల ప్రాథమిక ధర వివరాలను స్టేషన్ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు సీఐ వెల్లడించారు.

# యువత, మహిళల ఐడియాలకు వుయ్ హబ్

- గ్రామీణ విద్యార్థులే లక్ష్యంగా కొత్త ప్రోగ్రామ్స్
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 4 (జనంసాక్షి) :** జిల్లాలోని యువత, మహిళల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారి వ్యాపార ఆలోచనలకు గ్లోబల్ వేదికను కల్పించేందుకు వుయ్ హబ్ నడుం బిగించిందని, ముఖ్యంగా గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని విద్యార్థులు, టైర్-2, టైర్-3 నగరాల్లోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సరికొత్త జాతీయ స్థాయి ప్రోగ్రామ్స్‌ను ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.గ్రాస్‌రూట్స్ యూత్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్, సోషల్ ఇంపాక్ట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ పేర్లతో ఈ శిక్షణ కార్యక్రమాలను అందించనున్నట్లు వెల్లడించారు.మంగళవారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో శిక్షణపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతను కేవలం ఉద్యోగార్థులుగానే కాకుండా, ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా మార్చడమే ఈ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశమన్నారు. 17 నుంచి 23 ఏళ్ల వయస్సు ఉన్న అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో హ్యాకథాన్లు, ఐడియాషన్ సెషన్స్ నిర్వహిస్తారని , 12 వారాల పాటు ఇంటర్న్‌షిప్, పేటెంటింగ్ సపోర్ట్, సాఫ్ట్ స్కిల్స్‌పై ట్రైనింగ్ ఇస్తారని తెలిపారు.ఆలోచన దశ నుంచి ప్రోటోటైప్ తయారీ వరకు మార్గదర్శకత్వం చేస్తారని అన్నారు.మహిళలకు అండగా నిలిచేందుకు ఎస్ఐఈ శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారని తెలిపారు. టైర్-2, టైర్-3 ప్రాంతాల్లోని మహిళలు, వెనుకబడిన వర్గాలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల కోసం సోషల్ ఇంపాక్ట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు.ఎఫ్ఎంసీజీ, ఫుడ్ ప్రాసెసింగ్, చేనేత వంటి రంగాల్లో బిజినెస్ చేసే వారికి ఇందులో ప్రాధాన్యత ఉంటుందని, 3 నెలల పాటు డిజిటల్ నెట్‌వర్కింగ్, బిజినెస్ బేసిక్స్‌పై శిక్షణ అందిస్తారని తెలిపారు.6 నెలల పాటు ఫండింగ్, లీగల్ సపోర్ట్, డిజిటల్ మార్కెటింగ్‌లో సహాయం అందించనున్నట్లు తెలిపారు.మహిళా ప్రామాణికతా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.స్థానిక మహిళా వ్యాపారులు ఈ కేంద్రాల ద్వారా సేవలు పొందవచ్చని, ఆసక్తి గల వారు పూర్తి వివరాల కోసం వుయ్ హబ్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.వుయ్ హబ్ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఈఓ అశోక్, మెప్మా పీడీ శ్రీనివాస్, డిడబ్ల్యుఓ నరసింహారావు, వుయ్ హబ్ సిఈఓ సీతా పళ్ళచుని, అసోసియేట్ డైరెక్టర్ జహీర్ అక్తర్ షేక్, ఊహ సజ్జ, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**అల్వాల్, ఆగస్టు 4 (జనంసాక్షి) :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ అల్వాల్ పట్టణ సమితి పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం అల్వాల్ పార్టీ కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆగస్టు 6 నుంచి 14 వరకు చేపట్టనున్న పాదయాత్రలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నిరుపేదలకు ఇంటి పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం, నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తేవడం, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం, మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం, రైతులకు కనీస మద్దతు ధర కల్పించడం, కార్మికుల హక్కులను పరిరక్షించడం, దళితులు, ఆదివాసులపై దాడులను అరికట్టడం వంటి ప్రజా సమస్యల పరిష్కారానికే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ అల్వాల్ పట్టణ కార్యదర్శి అమరావతి బాబు, ఏఐటీయూసీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు కే. రవిచంద్రన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్ భాయ్, బి. నరేందర్, జంగయ్య, తులసి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 6న సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ

- మెదక్‌లో పోస్టర్ ఆవిష్కరణ
- మహాసభను విజయవంతం చేయాలని బట్టి అజయ్ పిలుపు



**మెదక్ బ్యూరో , ఆగస్టు 4 (జనం సాక్షి) :** మెదక్ నియోజకవర్గ తెలంగాణ రక్షణసేన (టీఆర్ఎస్) పార్టీ కార్యాలయం, ఇంద్రపురి కాలనీలో బుధవారం నిర్వహించనున్న 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బట్టి అజయ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంతో సాధించుకున్న రాష్ట్రం ఇప్పుడు సామాజిక న్యాయంతో మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళ, యువతకు సమాన అవకాశాలు, సముచిత ప్రాధాన్యం కల్పించే తెలంగాణ నిర్మాణమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అందుకే 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' నిర్వహిస్తున్నామని, ఈ సభ ప్రజల ఆకాంక్షలకు కొత్త దిశను చూపించే చారిత్రాత్మక వేదికగా నిలుస్తుందని అన్నారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఆగస్టు 6, 2026న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలో ప్రముఖ నాయకులు పాల్గొని సామాజిక న్యాయ తెలంగాణ సాధనకు అవసరమైన కార్యాచరణను ప్రజలకు వివరించనున్నారని చెప్పారు. మెదక్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. "రండి... సామాజిక న్యాయ తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు అవుదాం" అంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఇప్పా రమేష్, కసాపురం అశోక్, టౌన్ ఇన్‌చార్జ్ కేవల్ నందకుమార్, టీఆర్ఎస్ స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షుడు జునైద్, చినశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వీరస్వామి (టీఆర్ఎస్ పార్టీలో చేరిన అనంతరం), దగడ్ శ్రీకాంత్, ఎల్లం, రాజ్‌పేట గ్రామానికి చెందిన నవీన్, భాను, ప్రేమ్, సయ్యద్ ఇమ్రోజ్, సోహైల్, రేహాన్, అర్సలాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం

- నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**మర్రిగూడ, ఆగస్టు 4 (జనం సాక్షి) :** భూ రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మర్రిగూడ మండలంలోని బట్లపల్లి గ్రామంలో జరుగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ శివారు భూములు, గ్రామ కంఠం భూములు, ప్రభుత్వ భూములు, రైతుల పట్టా భూములు, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ భూముల సర్వే పురోగతిని సమీక్షించారు. అత్యాధునిక శాటిలైట్ రోవర్ సాంకేతికతను ఉపయోగించి గ్రామంలోని ప్రతి భూమిని అత్యంత కచ్చితత్వంతో, పారదర్శకంగా రీ-సర్వే చేస్తున్నామని కలెక్టర్ రైతులకు వివరించారు. సర్వే పూర్తయిన అనంతరం ప్రతి భూమికి ప్రత్యేకమైన ల్యాండ్ పార్సెల్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 90 సంవత్సరాల తర్వాత ఇంత భారీ స్థాయిలో భూముల రీ-సర్వే చేపడుతున్నామని పేర్కొన్న కలెక్టర్, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలోని రైతులందరూ ఈ కార్యక్రమాన్ని ఒక పండుగలా భావించి ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులు తమ భూములకు సంబంధించిన సరైన పత్రాలు, ఆధారాలతో సర్వే బృందానికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. ప్రతి రైతు స్వయంగా సర్వే సమయంలో పాల్గొంటే భూ వివాదాలు, సరిహద్దు సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని తెలిపారు. పర్యటన సందర్భంగా 86, 87 సర్వే నంబర్ల పరిధిలోని రైతుల పట్టా భూములకు సంబంధించిన సమస్యలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించి, అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ల్యాండ్ సర్వే ఏడి దేవరాజ్, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మునయ్య, మండల సర్వేయర్ స్వప్న, ఉప సర్పంచ్ వెంకటేష్, సంబంధిత అధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## టేకులపల్లి మండలంలో కుండపోత వర్షం

- 124.6 మి.మీ వర్షపాతం నమోదు
- పొంగిపొర్లుతున్న వాగులు,వంకలు
- మేటలు వేసిన పత్తి పంట చేలు

**టేకులపల్లి, ఆగస్టు 4 (జనంసాక్షి) :** సోమవారం అర్ధరాత్రి నుంచి ఉదయం 8 గంటల వరకు కురిసిన కుండపోత వర్షానికి టేకులపల్లి మండలంలో 124.6 మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు తహసిల్దార్ ఎల్ వీరభద్రం తెలిపారు. ఇది జిల్లాలోనే అత్యధిక వర్షపాతం గా నమోదు అయినట్లు తెలిపారు. అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి మండలంలోని ముర్రేడు వాగు, రాళ్లవాగు, పరికల వాగు ఉధృతంగా ప్రవహించాయి. చెరువులన్ని నిండుకుని అలువులు పోస్తున్నాయి. పత్తి చేను పంట నుండి వరదలు పోతూ మేటలు పెట్టాయి. కోతలకు గుర్రె కాలువలు ఏర్పడ్డాయి. ఈ వర్షాకాలం ప్రారంభం నుంచి ఇంత పెద్ద భారీ వర్షం ఇదే మొదటిసారి కావడంతో అతి తక్కువ వర్షాలతో రైతుల ఆందోళన చెందుతున్న తరుణంలో రాత్రి పడ్డ భారీ వర్షానికి ఆనంద పడుతున్నారు. మండలంలో చెరువులు, బోరు బావులు, వాగుల వెంట ఉన్న పొలాలు వరి నాట్లు పడతాయని రైతులు హర్షం వెల్లబుచ్చుతున్నారు. జూన్,జూలైలో చాలా తక్కువగా పడ్డ వర్షాలకు పంటలు పండుటం కష్టంగా ఉంటాయనుకున్న రైతాంగానికి రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆశలు కల్పించాయి. ఆగస్టు నెల వరకు మంచి వర్షాలు కురవాలని రైతుల ఆశపడుతున్నారు. కురిసిన భారీ వర్షానికి అక్కడక్కడ కొంత నష్టం వాటిల్లిన వాగులు వంకలు పొర్లడంతో రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కృష్ణ, అగస్టు 4 (జనం సాక్షి) :** కృష్ణ నది పరివాహక ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కృష్ణ తాహసిల్దర్ శ్రీనివాస్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు నారాయణపూర్ డ్యాం గేట్లు ఎత్తినందున పై నుండి నీటి ప్రవాహం ఉధృతంగా నారాయణపేట జిల్లా, కృష్ణా మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కృష్ణ తాహసిల్దర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి వరద ఉధృతంగా ప్రవహిస్తున్నందున నది పరివాహక ప్రాంత ప్రజలు కృష్ణ మండలం, గురుజాల్, హిందూపూర్, వాసు నగర్, ముదుమల్ మొదలగు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండి కృష్ణానది లోకి చేపలు పట్టడానికి, ఇతర పొలం పనులకు, పశువులను మేపడానికి వెళ్లరాదని తెలిపారు.

## 80 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు అరెస్టు, రిమాండ్



**శంకర్‌పల్లి, ఆగస్టు 4 (జనం సాక్షి) :** గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను శంకర్పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు.శంకర్పల్లి సీఐ రుద్వీర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పిట్లం కామారెడ్డి జిల్లాకు చెందిన ఎం శ్రీనివాస్,(21) జై కిరణ్(22),ఎం శ్రీనివాసులు(26) ఒడిస్సా రాష్ట్రం చిత్రకొండ ప్రాంతం నుంచి కిలో 6వేల చొప్పున కొనుగోలు చేసి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ లో కిలో రూ.20 వేల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.ఆగస్టు మూడో తేదీన శంకర్ పల్లి లోని మంజీరా పైప్ లైన్ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు మాటువేసి తనిఖీలు నిర్వహించగా ముగ్గురు వ్యక్తుల వద్ద 80 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.గంజాయి విక్రయిస్తున్న ముగ్గురుని అరెస్ట్ చేసి చేవెళ్ల కోర్టులో రిమాండ్ చేసినట్టు తెలిపారు.

# ముక్కోటి నాటికి ఉత్తరద్వారం పూర్తి చేయాలి

- కలెక్టర్ అంకిత్



**భద్రాచలం, ఆగస్టు 4 (జనంసాక్షి) :** వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలిసి ఆలయ పరిసరాల్లో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ముందుగా ఉత్తరద్వార దర్శనం నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ముక్కోటి ఏకాదశి నాటికి ఉత్తరద్వారం నిర్మాణాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్రాలను వినియోగించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఆలయం చుట్టూ కొనసాగుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను పరిశీలిస్తూ నిర్మాణాల డ్రాయింగ్స్‌ను పరిశీలించారు. ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా పనులు చేపట్టాలని, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఇంజినీర్లకు సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి అన్ని పనులను పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆలయం నుంచి గోదావరి ఘాట్ వరకు కాలినడకన పరిశీలించిన కలెక్టర్, పుష్కరాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రహదారి, పాదచారుల మార్గాలు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వెలుగులు, పారిశుద్ధ్యం, భద్రత, ట్రాఫిక్ నిర్వహణ వంటి మౌలిక వసతులను మెరుగుపర్చాలని సంబంధిత శాఖలకు సూచించారు. చిత్రకూట మండపంలో జరుగుతున్న తొలగింపు పనులను కూడా పరిశీలించిన కలెక్టర్, పురాతన రాతి స్తంభాలు, శిల్ప సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా శాస్త్రీయ పద్ధతిలో పనులు చేపట్టాలని ఆదేశించారు. రాతి స్తంభాలను గుర్తింపు సంఖ్యలతో భద్రపరుస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రభుత్వం గోదావరి పుష్కరాల నాటికి ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేసే లక్ష్యంతో సమన్వయంతో చర్యలు చేపడుతోందని కలెక్టర్ అంకిత్ తెలిపారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ పర్యటనలో భద్రాచలం తహసీల్దార్ రవికుమార్, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ అధికారులు, రోడ్లు--భవనాల శాఖ ఇంజినీర్లు, పంచాయతీ శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మునుగోడు ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి మంత్రి హామీ

- వారం రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- మంత్రి దామోదర రాజనర్సింహతో సమావేశమైన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 4 (జనం సాక్షి) :** మునుగోడు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల సమగ్ర అభివృద్ధిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంగళవారం సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు , ఏరియా ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది, వైద్య పరికరాలు, నిధులపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో మునుగోడు, నాంపల్లి పీహెచ్‌సీలను ఆధునీకరించి 30 పడకల ఆసుపత్రులుగా అభివృద్ధి చేయడం, మర్రిగూడ సీహెచ్‌సీని ప్రస్తుతం ఉన్న 30 పడకల నుంచి 50 పడకలకు విస్తరించడం, అవసరమైన వైద్య సిబ్బంది నియామకం, ఆధునిక సాంకేతిక పరికరాల ఏర్పాటు, పోస్టుమార్టం పరీక్ష గది నిర్మాణం వంటి అంశాలను ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే చండూరు రెవెన్యూ కేంద్రంలో 100 పడకల ఏరియా ఆసుపత్రి మంజూరు చేసి నిర్మించాలని, గట్టుప్పల్ పీహెచ్‌సీకి సిబ్బంది, వైద్య పరికరాలు అందించాలని కోరారు. జాతీయ రహదారి-65పై జరిగే ప్రమాదాల్లో గోల్డెన్ అవర్‌లో చికిత్స అందక ప్రాణనష్టం జరుగుతోందని పేర్కొంటూ, చౌటుప్పల్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు 100 పడకల ఏరియా ఆసుపత్రిని ఆధునీకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో నిర్మిస్తున్న సబ్ సెంటర్ల నిర్మాణ వ్యయం ప్రస్తుత పరిస్థితులకు సరిపోవడం లేదని, పెరుగుతున్న ధరలు, ఆధునిక వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల నిర్మాణ బడ్జెట్‌ను పెంచాలని కూడా సమావేశంలో ప్రతిపాదించారు. ఎమ్మెల్యే వినతులపై సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహ, మునుగోడు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి సంబంధించిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. చౌటుప్పల్ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, సెప్టెంబర్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే చౌటుప్పల్‌లో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్, ట్రామా కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని, మునుగోడు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను దశలవారీగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, నల్గొండ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ రాహుల్, డీసీహెచ్ మాతృ నాయక్, యాదాద్రి భువనగిరి జిల్లా డీఎంహెచ్‌వో మనోహర్, డీసీహెచ్ సూర్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 4 (జనం సాక్షి) :** దేశంలోని దివ్యాంగులకు మెరుగైన వసతులు, అభ్యసన అవకాశాలు కల్పించడంలో భాగంగా 'సుగమ్య భారత్ అభియాన్' అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మంగళవారం అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బీఎల్(బన్వారీలాల్) వర్మ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

### తెలంగాణకు అందిన నిధులు

సుగమ్య భారత్ అభియాన్ కింద 2015-16 నుంచి 2024-25 వరకు తెలంగాణ రాష్ట్రానికి వివిధ ఏళ్లలో కలిపి మొత్తం రూ. 9.19 కోట్లు (రూ. 919.24 లక్షలు) విడుదల కాగా.. ఇందులో రాష్ట్రం ఇప్పటివరకు మొత్తం రూ. 4.56 కోట్లు (రూ. 455.63 లక్షలు) నిధులను వినియోగించినట్లు మంత్రి వెల్లడించారు.

### యూడీఐడీ పోర్టల్ వివరాలు

దివ్యాంగులకు డిజిటల్ పద్ధతిలో సేవలు అందించేందుకు నిర్వహిస్తున్న యూడీఐడీ పోర్టల్ ద్వారా దేశవ్యాప్తంగా 1,40,68,994 మంది అనుసంధానం కాగా... తెలంగాణ రాష్ట్రంలో 9,07,019 మంది అనుసంధానమైనట్లు తెలిపారు.

### బడి మానేసే విద్యార్థుల కోసం ప్రత్యేక చర్యలు

దివ్యాంగ విద్యార్థులు చదువు మధ్యలో మానేయకుండా నిరోధించేందుకు 'సమగ్ర శిక్షా అభియాన్' ద్వారా పలు చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఏటా రూ. 3,500 చొప్పున ఆర్థిక సహాయంతో పాటు బాలికల విద్యను ప్రోత్సహించేందుకు డీబీటీ ద్వారా ఏటా రూ. 2,000 చొప్పున స్టైపెండ్ అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.

# యూపీఐపై ఎలాంటి ఛార్జీలు లేవు: కేంద్రం

- రూ.3 వేలపైబడిన చెల్లింపులకు ఎండీఆర్ అంటూ ప్రచారం అసత్యం
- యూపీఐ లావాదేవీలు పూర్తిగా ఉచితమేనని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (జనంసాక్షి):** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే డిజిటల్ చెల్లింపులపై ఎలాంటి రుసుములు విధించే ఆలోచన లేదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. రూ.3,000కు పైబడిన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) అమలు చేయనున్నారనే ప్రచారాన్ని ఖండించింది. యూపీఐ ద్వారా జరిగే డిజిటల్ చెల్లింపులు గతంలాగే పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని వెల్లడించింది. పేమెంట్స్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ చట్టం-2007లోని సెక్షన్ 10ఏ ప్రకారం యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు ఎలాంటి రుసుములు వసూలు చేయరాదని పేర్కొంది. అలాగే సీబీడీటీ నోటిఫికేషన్ ప్రకారం భీమ్-యూపీఐ, యూపీఐ క్యూఆర్, రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై ఎండీఆర్‌ను సున్నా శాతంగా నిర్ణయించినట్లు గుర్తుచేసింది. అయితే కొన్ని ప్రత్యేక లావాదేవీలకు వేర్వేరు నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. పీపీఐ (వాలెట్)ల ద్వారా యూపీఐ ఉపయోగించి రూ.2,000కు పైబడిన వ్యాపార లావాదేవీలపై గరిష్ఠంగా 1.1 శాతం ఇంటర్‌ఛేంజ్ రుసుము వర్తిస్తుంది. అలాగే యూపీఐతో అనుసంధానించిన రూపే క్రెడిట్ కార్డు చెల్లింపులకు సాధారణ క్రెడిట్ కార్డుల ఎండీఆర్ నిబంధనలు అమల్లో ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది.

# వాషింగ్టన్‌లో కార్చిచ్చు బీభత్సం

- వేల ఎకరాల్లో విస్తరించిన అగ్నికీలలు
- 60 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితి ప్రకటించిన గవర్నర్
- సహాయక చర్యలకు ఆటంకం కలిగించొద్దని డ్రోన్లపై నిషేధం





**వాషింగ్టన్, ఆగస్టు 4 (జనంసాక్షి):** అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో కార్చిచ్చు తీవ్ర విధ్వంసం సృష్టిస్తోంది. అటవీ ప్రాంతాల్లో చెలరేగిన మంటలు వేగంగా విస్తరిస్తుండటంతో వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే భారీ ఎత్తున ప్రజలను తరలించిన అధికారులు, తాజాగా మరో 60 వేల మందిని తాత్కాలిక శిబిరాలకు పంపించారు. మంటలకు కారణమని అనుమానిస్తున్న స్పోకేన్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 16 ప్రాంతాల్లో కార్చిచ్చు కొనసాగుతోంది. వందలాది భవనాలు మంటల్లో దగ్ధమయ్యాయి. బలమైన గాలులు, పొడి వాతావరణం కారణంగా మంటలను అదుపు చేయడం అగ్నిమాపక సిబ్బందికి పెద్ద సవాలుగా మారింది. నష్టం తీవ్రతను అంచనా వేస్తున్నట్లు స్పోకేన్ మేయర్ లీసా బ్రౌన్ తెలిపారు. పరిస్థితిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమీక్ష నిర్వహించిన అనంతరం వాషింగ్టన్ గవర్నర్ బాబ్ ఫెర్గూసన్ రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ప్రమాద ప్రాంతాల్లోని ప్రజలు వెంటనే ఇళ్లను ఖాళీ చేసి అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వారం ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోవైపు అగ్నిప్రమాద ప్రాంతాల్లో డ్రోన్ల వినియోగంపై అధికారులు నిషేధం విధించారు. డ్రోన్ల కారణంగా అగ్నిమాపక విమానాలు, హెలికాప్టర్ల కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందని, ఆదివారం ఒక్కరోజే 26 సార్లు సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడిందని వెల్లడించారు.




# ఇ 20 పెట్రోల్ వినియోగంపై ముందుకే

### రాజ్యసభలో కేంద్రమంత్రి స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** దేశంలో పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని ఉపయోగించే ఇ20 పెట్రోల్ పాలసీ అమలుపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా కీలక స్పష్టత ఇచ్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ అడిగిన ప్రశ్నకు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇ20 ఇంధన వినియోగం, పాత వాహనాల భద్రత, దీని వల్ల చేకూరే ప్రయోజనాలను కేంద్రం సమగ్రంగా వివరించింది. దేశవ్యాప్తంగా ఇ20 పెట్రోల్ వినియోగాన్ని దశలవారీగా వేగవంతం చేస్తున్నామని, ఈ పాలసీ ద్వారా ప్రధానంగా మూడు ప్రయోజనాలు ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ముడి చమురు దిగుమతులపై భారత్ ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు, పెద్ద ఎత్తున విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం దీని ప్రధాన లక్ష్యమని చెప్పింది. చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన మద్దతు ధర, అదనపు ఆదాయం అందుతుందని వెల్లడించింది. ఇంధనంలో ఇథనాల్ కలపడం వల్ల కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గి, పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొంది.

# తెలుగుభాషకు మండలి కృషి ప్రశంసనీయం

### మమ్మీ, డాడీ భాషలను వదిలేస్తేనే మంచిది : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**విజయవాడ,ఆగస్టు 4 (జనంసాక్షి):** దేశానికి, తెలుగు భాషకు మండలి వెంకటకృష్ణారావు చేసిన సేవలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసించారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు కాంస్య విగ్రహాన్ని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మండలి వెంకట కృష్ణారావు స్మృతికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. ఏది ప్రారంభించాలన్నా రిబ్బన్ కత్తిరించడం సరికాదన్నారు. అది బ్రిటీష్ వారు నేర్పిన విధానమని చెప్పారు. మన దేశాన్ని, మనల్ని వారు విభజించి వెళ్లారని అన్నారు. ఏదైనా ముడి వేస్తే దానిని విప్పి ప్రారంభోత్సవ సూచికగా చూడాలన్నారు. మండలి వెంకట కృష్ణారావు వంటి మహనీయుల సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని అమలు చేయాలన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన చేసిన సేవలు అద్భుతమని కొనియాడారు. గాంధేయవాదిగా ఆయన పనితీరును చూసే అదృష్టం తనకు దక్కిందన్నారు. ఏ శాఖ మంత్రిగా ఉన్నా ప్రతి పనిలో తనదైన ముద్ర వేశారని చెప్పారు. తెలుగు భాష పరిరక్షణకు మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తూ తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్నారని అన్నారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వెంకట కృష్ణారావు జీవిత విశేషాలతో మల్లిఖార్జునరావు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించామని వెంకయ్య నాయుడు చెప్పారు. మహనీయుల జీవితాల్లో జరిగిన ముఖ్య ఘట్టాలను ఇటువంటి పుస్తకాల ద్వారానే నేటి తరం తెలుసుకోవాలని అన్నారు. వెంకట కృష్ణారావు నిగర్వి, నిరాడంబరుడిగా ఉంటూనే సేవలందించారని కొనియాడారు. తెలుగు భాష పరిరక్షణ కోసం ఆయన ఎంతో పరితపిస్తూ కృషి చేసేవారని తెలిపారు. వెంకట కృష్ణారావు స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొని గురువులను గౌరవించేవారని గుర్తు చేశారు. ఆ రోజుల్లో ఆచార్య రంగాని అవనిగడ్డకు ఆహ్వానించి కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. ఈ రాష్ట్రంలో రాజకీయ కార్యకర్తలకు పాఠశాలలు ఏర్పాటు చేసి ఆచార్య రంగా శిక్షణ ఇచ్చేవారని తెలిపారు. పాత రోజుల్లో కమ్యూనిస్టులు, జనసంఘ్ కూడా ఇలాగే శిక్షణ ఇచ్చేవారని అన్నారు. నేటి రోజుల్లో రాజకీయ నేతలకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మమ్మీ, డాడీ' సంస్కృతి వదిలేసి 'అమ్మ, నాన్న' అని పిలిపించుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి సూచించారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 530 | ₹ 63.60 |
| వరంగల్ | ₹ 532 | ₹63.84 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹1,44,000 | ₹1,32,000 |
| చెన్నై | ₹1,44,000 | ₹1,32,000 |

**వెండి ధరలు (కేజీ)** హైదరాబాద్ ₹ 2,17,200

# దక్షిణ కొరియా మార్కెట్‌లో భారీ ర్యాలీ

### కొస్పి సూచీ 1%కుపైగా లాభం

**సియోల్:** దక్షిణ కొరియా స్టాక్ మార్కెట్ మంగళవారం ఉత్సాహంగా ట్రేడైంది. ప్రధాన సూచీ కొస్పి 1 శాతానికి పైగా లాభపడగా, టెక్నాలజీ, సెమీకండక్టర్ కంపెనీల షేర్లలో బలమైన కొనుగోళ్లు నమోదయ్యాయి. కృత్రిమ మేధ, చిప్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్, అమెరికా టెక్ దిగ్గజాల త్రైమాసిక ఫలితాలపై సానుకూల అంచనాలు మార్కెట్‌కు మద్దతునిచ్చాయి. ప్రత్యేకించి సెమీకండక్టర్ రంగానికి చెందిన ప్రముఖ కంపెనీల షేర్లు లాభపడటంతో కొస్పి సూచీ మరింత బలపడింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు కూడా మార్కెట్‌కు అదనపు ఊతమిచ్చాయి. ప్రపంచ టెక్నాలజీ రంగంలో పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో దక్షిణ కొరియా మార్కెట్‌కు అనుకూల వాతావరణం కొనసాగుతుందని, రానున్న రోజుల్లో కంపెనీల ఆర్థిక ఫలితాలు, గ్లోబల్ ఆర్థిక పరిణామాలు మార్కెట్ దిశను నిర్దేశించే అవకాశముందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# ఆర్‌బీఐ ద్రవ్య విధాన నిర్ణయంపై ఫోకస్

- క్యూ1 ఫలితాలు మార్కెట్‌కు దిశానిర్దేశం
- ప్రభుత్వ వాటా విక్రయాలపై మదుపర్ల దృష్టి

**ముంబై:** ఈ వారం భారత స్టాక్ మార్కెట్‌పై పలు దేశీయ, అంతర్జాతీయ పరిణామాలు ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా ఆర్‌బీఐ ద్రవ్య విధాన సమీక్ష, కంపెనీల తొలి త్రైమాసిక (క్యూ1) ఫలితాలు, ప్రభుత్వ వాటా విక్రయాలు, అంతర్జాతీయ ముడి చమురు ధరలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల పెట్టుబడుల ప్రవాహం మార్కెట్ దిశను నిర్ణయించే ప్రధాన అంశాలుగా నిలవనున్నాయి. ఆర్‌బీఐ వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయంతో పాటు ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై వెల్లడించే అంచనాలపై మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు పలు ప్రముఖ కంపెనీలు ప్రకటించనున్న క్యూ1 ఫలితాలు ఆయా షేర్లతో పాటు మొత్తం మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో కేంద్రం చేపడుతున్న వాటా విక్రయాలు కూడా పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అలాగే అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు లేదా అమ్మకాలు ఈ వారం మార్కెట్ కదలికలను ప్రభావితం చేసే కీలక అంశాలుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# భారతి ఎయిర్‌టెల్‌కు భారీ లాభాలు

- తొలి త్రైమాసికంలో నికర లాభం 37.3% వృద్ధి
- 4జీ, 5జీ వినియోగదారుల పెరుగుదలతో జోష్

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (జనంసాక్షి):** దేశీయ టెలికాం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్ 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ నికర లాభం 37.3 శాతం పెరిగింది. 4జీ, 5జీ సేవలను వినియోగించే కస్టమర్ల సంఖ్య పెరగడం, అధిక విలువ కలిగిన రీచార్జ్ ప్లాన్లను వినియోగదారులు ఎంచుకోవడం ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. మొబైల్ సేవలతో పాటు డేటా వినియోగం గణనీయంగా పెరగడం, ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం మెరుగుపడటం కంపెనీ ఆదాయాలను బలోపేతం చేశాయి. 5జీ సేవల విస్తరణ, డిజిటల్ సేవల విభాగం కూడా కంపెనీ వృద్ధికి తోడ్పడ్డాయి. భవిష్యత్తులో నెట్‌వర్క్ విస్తరణ, నాణ్యమైన సేవల అందింపు, 5జీ సేవలను మరింత విస్తరించడంపై దృష్టి సారిస్తామని కంపెనీ తెలిపింది. దేశీయ టెలికాం రంగంలో డేటా వినియోగం పెరుగుతుండటంతో రానున్న త్రైమాసికాల్లో కూడా వృద్ధి కొనసాగుతుందనే ఆశాభావాన్ని సంస్థ వ్యక్తం చేసింది.

# టెక్ దిగ్గజాల ఫలితాలపై మార్కెట్ల దృష్టి

- ఏఎండీ, స్పేస్‌ఎక్స్‌తో పాటు ప్రముఖ టెక్ కంపెనీల క్యూ1 ఫలితాల కోసం ఎదురుచూపు
- కృత్రిమ మేధ, చిప్ రంగంపై ప్రత్యేక దృష్టి

ప్రపంచ ఆర్థిక మార్కెట్ల దృష్టి ప్రస్తుతం అమెరికా టెక్ దిగ్గజాల త్రైమాసిక ఆర్థిక ఫలితాలపై నిలిచింది. ఏఎండీ, స్పేస్‌ఎక్స్‌తో పాటు ఇతర ప్రముఖ టెక్నాలజీ కంపెనీలు ప్రకటించనున్న ఫలితాల కోసం పెట్టుబడిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధ, సెమీకండక్టర్, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో కంపెనీల పనితీరుపై మార్కెట్ దృష్టి కేంద్రీకృతమైంది. ఫలితాలు అంచనాలకు మించి నమోదైతే టెక్నాలజీ షేర్లలో కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో కంపెనీల భవిష్యత్ ఆదాయ అంచనాలు, పెట్టుబడి ప్రణాళికలు, ఏఐ రంగంలో విస్తరణపై వెల్లడించే వ్యాఖ్యలు ప్రపంచ మార్కెట్ల దిశను ప్రభావితం చేయనున్నాయి. టెక్ దిగ్గజాల ఫలితాలు అమెరికా స్టాక్ మార్కెట్లతో పాటు ఆసియా, యూరప్ మార్కెట్లపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా సెమీకండక్టర్, ఏఐ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడిదారుల సెంటిమెంట్‌కు ఈ ఫలితాలు కీలకంగా మారనున్నాయి.

# ప్రపంచ సవాళ్ల మధ్య నిలకడగా భారత కార్పొరేట్ రంగం

- చమురు ఎగుమతులపై పెరిగిన విండ్‌ఫాల్ పన్ను
- ఆయిల్ కంపెనీల లాభదాయకతపై ప్రభావం చూపే అవకాశం
- మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల మధ్య నిలకడగా భారత కంపెనీలు
- బలమైన దేశీయ డిమాండ్‌తో కార్పొరేట్ రంగానికి ఊతం




**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (జనంసాక్షి):** పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్) ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం పెంచిన విండ్‌ఫాల్ పన్ను దేశీయ చమురు కంపెనీల లాభదాయకతపై ప్రభావం చూపే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలో ఎగుమతుల ద్వారా వచ్చే మార్జిన్లపై ఒత్తిడి పెరగవచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ విధానాలు, గ్లోబల్ చమురు ధరలు, ఎగుమతి డిమాండ్‌లో మార్పులను బట్టి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ఆర్థిక ఫలితాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని, పరిస్థితులకు అనుగుణంగా సంస్థలు తమ వ్యాపార వ్యూహాలను మార్చుకోవాల్సి రావచ్చని అభిప్రాయపడుతున్నారు.

ఇదిలా ఉండగా, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి వంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ భారత కార్పొరేట్ రంగం ఆశాజనక పనితీరును కొనసాగించిందని అంతర్జాతీయ విశ్లేషణలు వెల్లడించాయి. బలమైన దేశీయ వినియోగం, సేవల రంగం వృద్ధి, ప్రభుత్వ మౌలిక సదుపాయాల వ్యయం కంపెనీలకు బలాన్నిచ్చినట్లు పేర్కొన్నాయి. అంతర్జాతీయ సవాళ్ల మధ్య కూడా భారత కంపెనీలు లాభదాయకతను నిలబెట్టుకోవడంతో పాటు పెట్టుబడులను కొనసాగిస్తున్నాయని విశ్లేషకులు తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, కార్పొరేట్ రంగం పనితీరు పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని అభిప్రాయపడ్డారు.

# యూరప్ మార్కెట్లలో జోరు

- జర్మనీ డీఏఎక్స్, ఫ్రాన్స్ సీఏసీ-40, బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ-100 లాభాల్లో
- గ్లోబల్ మార్కెట్లలో మెరుగైన రిస్క్ సెంటిమెంట్
- పెట్టుబడిదారుల్లో పెరిగిన ఆశావాదం

**ఫ్రాన్స్ :** యూరప్ ప్రధాన స్టాక్ మార్కెట్లు లాభాలతో ట్రేడవుతున్నాయి. జర్మనీ డీఏఎక్స్ , ఫ్రాన్స్ సీఏసీ-40, బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ-100 సూచీలు గ్రీన్‌లో కొనసాగుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పెట్టుబడిదారుల్లో ఆశావాదం పెరగడంతో పాటు రిస్క్ సెంటిమెంట్ మెరుగుపడిన సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కొంత తగ్గడం, కార్పొరేట్ ఫలితాలపై సానుకూల అంచనాలు, ప్రధాన కేంద్ర బ్యాంకుల విధానాలపై స్పష్టత కోసం ఎదురుచూపులు యూరప్ మార్కెట్లకు మద్దతు ఇస్తున్నాయి. టెక్నాలజీ, పారిశ్రామిక, బ్యాంకింగ్ రంగాల షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో ప్రధాన సూచీలు లాభాల బాట పట్టాయి. అమెరికా ఆర్థిక గణాంకాలు, కంపెనీల త్రైమాసిక ఫలితాలు, అంతర్జాతీయ భౌగోళిక-రాజకీయ పరిణామాలు రానున్న రోజుల్లో ప్రపంచ మార్కెట్ల దిశను నిర్దేశించే కీలక అంశాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

# ట్రంప్ టారిఫ్‌లపై కోర్టులో సవాల్

### భారత్ సహా 60 దేశాలపై సుంకాల నిర్ణయానికి వ్యతిరేకంగా పిటిషన్

- 25 అమెరికా రాష్ట్రాల సంయుక్త దావా
- అధికార పరిధి దాటారని ట్రంప్ ప్రభుత్వంపై ఆరోపణ
- కొత్త టారిఫ్‌లపై న్యాయపోరుకు తెర



**వాషింగ్టన్, ఆగస్టు 4 (జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన కొత్త దిగుమతి సుంకాల నిర్ణయం న్యాయపరమైన చిక్కుల్లో పడింది. భారత్‌తో పాటు దాదాపు 60 వాణిజ్య భాగస్వామ్య దేశాలపై విధించిన టారిఫ్‌లను సవాల్ చేస్తూ డెమొక్రటిక్ పార్టీ పాలిత 25 రాష్ట్రాలు అమెరికా కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ ప్రభుత్వం చట్టబద్ధమైన అధికార పరిమితులను దాటి వ్యవహరించిందని ఆరోపిస్తూ పిటిషన్ దాఖలు చేశాయి. న్యూయార్క్‌లోని యూఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్లో ఈ పిటిషన్ దాఖలైంది. వెట్టి చాకిరీ ద్వారా తయారైన వస్తువుల దిగుమతులపై తగిన నియంత్రణ అమలు చేయడం లేదనే కారణంతో ట్రంప్ ప్రభుత్వం గత నెలలో కొత్త సుంకాలను ప్రకటించింది. భారత్ సహా పలు దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు టారిఫ్‌లు విధించింది. ఈ సుంకాల వల్ల వినియోగదారులు, వ్యాపారాలపై అదనపు భారం పడుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ట్రంప్ ప్రభుత్వం గతంలో తీసుకున్న పలు టారిఫ్ నిర్ణయాలు కూడా అమెరికా కోర్టుల్లో సవాళ్లను ఎదుర్కొన్నాయని గుర్తుచేశారు. తాజా కేసు కూడా ట్రంప్ వాణిజ్య విధానాలకు కీలక పరీక్షగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రారంభంలో భారత్‌పై 12.5 శాతం టారిఫ్ విధించాలని ప్రతిపాదించినప్పటికీ, వెట్టి చాకిరీ నిరోధక చట్టాల అమలును భారత్ వేగవంతం చేసిన నేపథ్యంలో దానిని 10 శాతానికి తగ్గించారు. చమురు, సహజ వాయువు, ఎరువుల దిగుమతులతో పాటు అమెరికా-మెక్సికో-కెనడా వాణిజ్య ఒప్పందం పరిధిలోకి వచ్చే వస్తువులకు ఈ సుంకాల నుంచి మినహాయింపు ఇచ్చారు.

**న్యూయార్క్:** అమెరికా స్టాక్ మార్కెట్‌లో ప్రధాన సూచీ డౌ జోన్స్ మరోసారి రికార్డు గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. భారీ టెక్నాలజీ కంపెనీల షేర్లలో బలమైన కొనుగోళ్లు, అంచనాలను మించిన త్రైమాసిక కార్పొరేట్ ఫలితాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయి.

# నాౌకా నిర్మాణంలో చైనా జోరు

- ప్రపంచ నౌకా నిర్మాణ రంగంలో ఆధిపత్యం మరింత బలోపేతం
- 2026 తొలి అర్ధభాగంలో కొత్త ఆర్డర్లలో భారీ వాటా
- గ్లోబల్ షిప్‌బిల్డింగ్ మార్కెట్‌లో చైనా కంపెనీల దూకుడు
- దక్షిణ కొరియా, జపాన్‌కు గట్టి పోటీ

**బీజింగ్:** ప్రపంచ నౌకా నిర్మాణ రంగంలో చైనా తన ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకుంది. 2026 తొలి అర్ధభాగంలో కొత్త నౌకల నిర్మాణ ఆర్డర్లలో చైనా షిప్‌బిల్డింగ్ కంపెనీలు అత్యధిక వాటాను దక్కించుకున్నట్లు పరిశ్రమ వర్గాల గణాంకాలు వెల్లడించాయి. భారీ కంటెయినర్ నౌకలు, చమురు ట్యాంకర్లు, ఎల్‌ఎన్‌జీ క్యారియర్లు వంటి విభాగాల్లో చైనా సంస్థలకు పెద్దఎత్తున ఆర్డర్లు లభించాయి. అత్యాధునిక సాంకేతికత, భారీ ఉత్పత్తి సామర్థ్యం, తక్కువ వ్యయంతో నౌకల నిర్మాణం చేపట్టగలగడం చైనా కంపెనీలకు ప్రధాన బలంగా మారింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, బలమైన సరఫరా వ్యవస్థ కూడా ఈ రంగంలో చైనా ఆధిపత్యాన్ని మరింత పెంచుతున్నాయి. కొత్త ఆర్డర్లలో చైనా వాటా పెరగడంతో దక్షిణ కొరియా, జపాన్ వంటి సంప్రదాయ షిప్‌బిల్డింగ్ దేశాలకు గట్టి పోటీ ఎదురవుతోంది. ప్రపంచ వాణిజ్యం క్రమంగా పుంజుకుంటుండటంతో రానున్న నెలల్లో కూడా నౌకా నిర్మాణ రంగంలో చైనా ఆధిపత్యం కొనసాగుతుందని పరిశ్రమ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# నా భర్త బతికే ఉన్నారు..

### సుప్రీంకోర్టును ఆశ్రయించిన మర్చంట్ నేవీ కెప్టెన్ భార్య

- హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు
- ఒమన్ తీరంలో డ్రోన్ దాడి తర్వాత గల్లంతైన కెప్టెన్
- డీఎన్ఏ పరీక్షలు సరిపోలలేదని కుటుంబం వాదన
- బందీగా ఉన్నారని భార్య ఆరోపణ




**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (జనంసాక్షి):** ఒమన్ తీరంలో చమురు ట్యాంకర్‌పై జరిగిన డ్రోన్ దాడి తర్వాత గల్లంతైన మర్చంట్ నేవీ కెప్టెన్ ఆశిష్ కుమార్ తన భర్త బతికే ఉన్నారని ఆయన భార్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. భర్తను కోర్టు ముందు హాజరుపరిచేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఆమె హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. బిహార్‌లోని బెట్టియాకు చెందిన ఆశిష్ కుమార్ ఒమన్ తీరంలో స్కైలైట్ చమురు ట్యాంకర్‌పై మార్చిలో జరిగిన డ్రోన్ దాడి అనంతరం గల్లంతయ్యారు. నౌకలో ఉన్న 10 మంది భారతీయ నావికుల్లో ఎనిమిది మందిని రక్షించినట్లు భారత రాయబార కార్యాలయం తెలిపింది. అయితే కెప్టెన్ ఆశిష్ కుమార్, మరో సిబ్బంది దలిప్ ఆచూకీ లభించలేదని వెల్లడించింది. అనంతరం కెప్టెన్ గదిలో లభించిన కాలిన అవశేషాలు ఆశిష్‌వేనని భావించినప్పటికీ, వాటిని నిర్ధారించే ఆధారాలు లభించలేదని పేర్కొంది.

అయితే ఆ వాదనను ఆశిష్ కుటుంబ సభ్యులు ఖండిస్తున్నారు. డీఎన్ఏ పరీక్షల కోసం నమూనాలు ఇచ్చినా అవి సరిపోలలేదని ఆయన సోదరుడు తెలిపారు. అంతేకాకుండా ఆశిష్‌ను విడుదల చేయాలంటే రూ.20 లక్షలు చెల్లించాలని అంతర్జాతీయ నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తన భర్త ప్రాణాలతోనే ఉన్నారని, విదేశీయుల చెరలో బందీగా ఉన్నారని ఆశిష్ భార్య పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన ఆచూకీ గుర్తించి కోర్టు ముందు హాజరుపరిచేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆమె సుప్రీంకోర్టును కోరారు. కెప్టెన్ గదిలో లభించిన అవశేషాలు ఆశిష్‌వి కావని ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా తరువాత సమాచారం ఇచ్చిందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# ఎఫ్ఎంసీజీ రంగం కీలక డిమాండ్లు

- జీఎస్‌టీ ఇన్వర్షన్ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి
- నాణ్యత నియంత్రణ నిబంధనల సరళీకరణకు సూచన
- ప్లాస్టిక్ వ్యర్థాల నిబంధనల్లో సడలింపులు కోరిన కంపెనీలు
- తయారీ వ్యయాలు తగ్గించి వినియోగానికి ఊతమివ్వాలని అభిప్రాయం



**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (జనంసాక్షి):** దేశీయ వినియోగ వస్తు కంపెనీలు కేంద్ర ప్రభుత్వానికి పలు కీలక విధానపరమైన మార్పులను ప్రతిపాదించాయి. జీఎస్‌టీలోని ఇన్వర్టెడ్ డ్యూటీ (ఇన్వర్షన్) సమస్యను పరిష్కరించడంతో పాటు నాణ్యత నియంత్రణ ఉత్తర్వులు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను సరళీకరించాలని కోరాయి. ఈ మార్పులు అమలైతే తయారీ వ్యయాలు తగ్గడమే కాకుండా వినియోగ వస్తు పరిశ్రమ పోటీతత్వం మరింత పెరుగుతుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం కొన్ని ఉత్పత్తుల్లో ముడి పదార్థాలపై విధించే జీఎస్‌టీకంటే తుది ఉత్పత్తులపై పన్ను తక్కువగా ఉండటంతో కంపెనీలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ నిలిచిపోతోంది. దీనివల్ల నిధులు ఎక్కువకాలం బ్లాక్ అవుతూ నిర్వహణ వ్యయాలు పెరుగుతున్నాయని పరిశ్రమ ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపితే నగదు ప్రవాహం మెరుగుపడి ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని వారు సూచిస్తున్నారు.

అలాగే నాణ్యత నియంత్రణ ఉత్తర్వులు అమలులో స్పష్టత, ఏకరీతి విధానాలు తీసుకురావాలని కోరుతున్నారు. ప్రస్తుతం వేర్వేరు ఉత్పత్తులపై అమల్లో ఉన్న నిబంధనలు చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై అదనపు భారం మోపుతున్నాయని, అనుమతుల ప్రక్రియను సరళీకరించి పరిశ్రమలకు తగిన గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలులో కూడా ఆచరణ సాధ్యమైన విధానాలు తీసుకురావాలని ఎఫ్ఎంసీజీ సంస్థలు కోరుతున్నాయి. విస్తృత ఉత్పత్తిదారుల బాధ్యత నిబంధనలను సులభతరం చేయడంతో పాటు రీసైక్లింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించాయి. దీంతో పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశ్రమలపై పడుతున్న వ్యయభారం కూడా తగ్గుతుందని తెలిపాయి. ఈ డిమాండ్లు అమలైతే తయారీ వ్యయాలు తగ్గి ఉత్పత్తుల ధరలు స్థిరంగా ఉండే అవకాశం ఉందని, వినియోగదారులకు కూడా ప్రయోజనం కలుగుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. అంతేకాకుండా దేశీయ తయారీ, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఎఫ్ఎంసీజీ రంగం వృద్ధికి మరింత ఊతం లభిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# భార్యను దారుణంగా హతమార్చిన భర్త

### హత్య అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయిన నిందితుడు



**నారాయణఖేడ్ (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గం నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున దారుణ హత్య చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ముల్తాన్ తన భార్య ఇర్ఫాన (32)ను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని మౌలాలి దర్గా ప్రాంతంలో వదిలి వెళ్లినట్లు పేర్కొన్నారు. హత్య అనంతరం ఉదయం సుమారు 5 గంటలకు నిందితుడు నాగల్‌గిద్ద పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తానే భార్యను హత్య చేసినట్లు పోలీసులకు తెలిపి లొంగిపోయాడు. సమాచారం అందుకున్న నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, నాగల్‌గిద్ద ఏఎస్ఐ రవీందర్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి హత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# బాల్కొండ ఆరోగ్య సేవలకు నిధులివ్వండి

### రాష్ట్ర ఆరోగ్య శాఖ సమీక్షలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి వినతి

### ఏరియా ఆసుపత్రి పూర్తి నుంచి ఎంఆర్‌ఐ యంత్రం వరకు పలు ప్రతిపాదనలు



**భీంగల్ టౌన్, ఆగస్టు 4 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన జరిగిన నిజామాబాద్ జిల్లా ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో ప్రభుత్వ వైద్య సంస్థల పనితీరు, మౌలిక వసతులు, మందుల లభ్యత, వైద్యులు, సిబ్బంది కొరత, ప్రజారోగ్య సేవల మెరుగుదలపై చర్చించారు. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గ ఆరోగ్య రంగ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలను మంత్రికి సమర్పించి, అవసరమైన నిధులు, పరిపాలనా అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. భీంగల్‌లో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఏరియా ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడంతో పాటు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీని రహత్‌నగర్‌కు తరలించి అక్కడ కొత్త భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని, భీంగల్‌లో కొత్త అర్బన్ పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మోర్తాడ్ మండలంలోని పాలెం లేదా తిమ్మాపూర్‌లో కొత్త పీహెచ్‌సీ, బాల్కొండ సీహెచ్‌సీకి కొత్త భవనం, బాల్కొండ, మోర్తాడ్‌లలో పోస్టుమార్టం భవనాలు నిర్మించాలని కోరారు. 24×7 పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో అవసరమైన సిబ్బంది మంజూరు చేసి ఖాళీలను భర్తీ చేయాలని, తొమ్మిది ఉపకేంద్ర భవనాలకు పెండింగ్ ఎన్‌హెచ్‌ఎం నిధులు విడుదల చేయాలని, 18 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఎంఆర్‌ఐ యంత్రం మంజూరు చేయడంతో పాటు ఖాళీ పోస్టుల భర్తీ, అత్యవసర అవసరాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు.

## కేటీఆర్, కవిత ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు..

# పేదోడు విదేశీ భాష నేర్చుకుంటే తప్పా?

### ఆది శ్రీనివాస్ మంత్రి కావాలని నేను కూడా కోరుతున్నా : రుద్రంగిలో ఏటిసి సెంటర్ పనులు ప్రారంభించిన మంత్రి వివేక్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రుద్రంగి ఆగస్టు 4 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏ టి సి) ను రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు...ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ కు ముఖ్య నాయకుడు ఎప్పుడు కలిసినా చేతిలో పది దరఖాస్తులు పట్టుకొని వస్తాడు.ప్రజల సమస్యలపైనే ఆయన దృష్టి ఉంటుంది.అందుకే కాంగ్రెస్ పార్టీలో ఆయన ముఖ్యమైన వ్యక్తి. సీఎం రేవంత్ రెడ్డి అందుకే మొదటే ఆయనకు ప్రభుత్వ విప్ పదవి ఇచ్చారు. నాలుగు సార్లు ఓడిపోయినా ప్రజల్లోనే ఉంటూ ప్రజలపై మంచి నాలెడ్జ్ సంపాదించాడు. ఆది శ్రీనివాస్ మంత్రి కావాలని నేను కూడా మనస్ఫూర్తిగా కోరుతున్నాను అని అన్నారు.లక్ష ఉద్యోగాలు ఇచ్చాం పదేళ్ల క్రితం అధికారంలోకి రావడానికి మోదీ ఎన్నో ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు,కానీ ఏం చేయలేదు. ప్రజా పాలన ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనులు చేస్తుంది. రెండున్నర ఏళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష ఉద్యోగాలు కల్పించింది.ఆగస్టు 15 నాడు పెన్షన్లపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేయబోతున్నారు. పేదల కోసం, విద్య, వైద్యంపై మా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది.సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం.పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఐఐటి,ఏ టి సి సెంటర్లను పట్టించుకోలేదు.విద్యార్థులు ఐఐటి లకు వెళ్లలేదు,ఆధునీకరణ చేయలేదు,పైసా ఖర్చు చేయలేదు.కమిషన్లు వచ్చే పెద్ద ప్రాజెక్టుల వద్దనే అప్పుడు డబ్బులు ఖర్చు చేశారు. మేము ఏ టి సి సెంటర్లలో చదివే ప్రతి విద్యార్థికి నెలకు 2000 రూపాయల స్టైఫండ్ ఇస్తున్నాం.జర్మనీలో 5 లక్షల ఉద్యోగాలు -టాంకాం ద్వారా విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేందుకు కార్యాచరణ చేశాం. నేను జర్మనీ వెళ్లినప్పుడు స్వయంగా చూశాను,అక్కడ 5 లక్షల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.జపాన్ లో కూడా భారీగా ఉన్నాయి.జర్మనీ, జపాన్ లాంగ్వేజ్ నేర్చుకుంటే నెలకు 2 లక్షల 50 వేల వరకు జీతం వస్తుంది. మందమర్రిలో ఇప్పటికే జర్మన్ లాంగ్వేజ్ నేర్పిస్తున్నాం, రెండు నెలల్లో కోర్సు పూర్తవుతుంది. అదే తరహాలో రుద్రంగికి కూడా లాంగ్వేజ్ ట్రైనర్ ను పంపిస్తాను.విప్ ఆది శ్రీనివాస్ చొరవ తీసుకొని 100 మందికి ఉద్యోగ అవకాశాలు ఇప్పించాలి.కేటీఆర్ జర్మన్ లాంగ్వేజ్ పై నవ్వుతున్నాడు.కేటీఆర్, కవితలు ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు,కానీ మా పేద పిల్లలు విదేశీ భాషలు నేర్చుకుంటే తప్పా? కేటీఆర్ కు ముఖ్యమంత్రి కావాలని ఆశ ఉంది, కానీ ఆయనకు, ఆయన బావకు మధ్యనే కొట్లాట ఉంది, అది వాళ్లు చూసుకోవాలి. కాళేశ్వరం దోపిడీకే కట్టారు.కేసీఆర్ దోచుకోవడానికి మాత్రమే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు.కాళేశ్వరం బ్యారేజీలు సరిగ్గా లేవు, ఇప్పుడు పంపులు చేయమని అంటున్నారు. పంపు చేస్తే వచ్చే కరెంటు బిల్లును ఎవరు భరిస్తారు? కల్వకుంట్ల కుటుంబం భరించాలి. తుగ్లక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ వ్యవహరించారు. ఎవరైనా ప్రాజెక్టును కింద నుండి పైకి కడతారా? ఇప్పుడు రైతులకు, ప్రజలకు బీఆర్ఎస్ అంటే ఏమిటో అర్థమైందని విమర్శించారు.విద్యార్థులు మంచిగా చదువుకొని కలెక్టర్లు, ఎస్పీలు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రాంతి వెస్లీ, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గితే, శిక్షణ శాఖ అధికారులు,సర్పంచ్ గండి నారాయణ,ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి, రాజు,ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఆలయ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గట్ల మీనయ్య,వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,విద్యార్థులు రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# బస్టాండ్‌ను ఆధునికీకరించండి


### రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 04 (జనంసాక్షి) :** నిజామాబాద్ బస్ స్టాండ్ ఆధునికీకరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కోరారు. హైదరాబాదులోని సెక్రటేరియట్ లో మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నూతన బస్ స్టాండ్ కు స్థలం కేటాయించాలని అనేక సార్లు మంత్రులను కలిసినట్లు గుర్తుచేశారు. అప్పటి వరకు ప్రస్తుత బస్ స్టాండ్ లో సౌకర్యాలను మెరుగుపర్చాలన్నారు. ప్రయాణికుల కోసం విశాలమైన వేచియుండే హాలు ఏర్పాటు చేయాలని, బస్సుల రాకపోకల సమాచారాన్ని అందించే డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సీసీ కెమెరాలను, తగిన సిబ్బందిని నియమించాలన్నారు. ప్రైవేటు వాహనాలు, ఆటో రిక్షాల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు.

# ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగు పరచాలి

### టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి



**ఆర్మూర్,ఆగస్టు4 (జనంసాక్షి) :** ఆర్మూర్ నియోజకవర్గ ప్రజల రవాణా సౌకర్యాల మెరుగుదలకు సంబంధించి టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డిని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు.ఆర్మూర్ పట్టణంలో నూతన ఇంటిగ్రేటెడ్ బస్ డిపో,అత్యాధునిక బస్టాండ్ నిర్మాణానికి అన్ని అనుమతులు మంజూరు చేయాలని కోరారు.ఆర్మూర్ బస్టాండ్‌ను ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని చెప్పారు.నందిపేట్ మండల ప్రజల చిరకాల కోరిక నందిపేట్ బస్ డిపోను మంజూరు చేసి,అక్కడి ప్రజలకు మెరుగైన ఆర్టీసీ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజవర్గానికి నూతన ఎలక్ట్రిక్ బస్సులు, నియోజకవర్గంలో అన్ని రూట్ లో సరిపడా బస్సు లని నడపాలని తెలిపారు.ఈ అంశాలపై టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.



# నిజాంసాగర్‌కు పెరుగుతున్న వరద ప్రవాహం

### 9.188 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

**నిజాంసాగర్, ఆగస్టు 4 (జనం సాక్షి):** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 1397.85 అడుగులకు చేరగా, నీటి నిల్వ 9.188 టీఎంసీలుగా నమోదైంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 7,789 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అవుట్‌ఫ్లో పూర్తిగా నిలిపివేశారు. స్పిల్‌వే గేట్లు, జెన్‌కో, ప్రధాన కాలువ, ఎస్కేప్ రెగ్యులేటర్ ద్వారా ఎలాంటి నీటి విడుదల లేదు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1405 అడుగులు, మొత్తం నిల్వ సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో రానున్న రోజుల్లో నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది ఇదే తేదీ నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 1,391.34 అడుగులు, నీటి నిల్వ 4.642 టీఎంసీలుగా ఉన్నవి.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి అర్హులను పారదర్శకంగా గుర్తించాలి

### వార్డుల వారీగా జాబితా సిద్ధం చేయాలి

### క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 4 (జనంసాక్షి) :** డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కోసం లబ్ధిదారుల ఎంపికను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్లతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, అర్హులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో దరఖాస్తును కనీసం రెండుసార్లు పరిశీలించి, అర్హత ప్రమాణాల ప్రకారమే నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. సరైన కారణం లేకుండా ఏ ఒక్క దరఖాస్తును తిరస్కరించవద్దని సూచించారు. ప్రతి వార్డులో క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించి, పారదర్శకంగా అర్హుల జాబితాను సిద్ధం చేయాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియను నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి మాట్లాడుతూ, తమ మున్సిపాలిటీ పరిధిలో అర్హుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ కిషన్ మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, మిగిలిన ఇళ్లకు సంబంధించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సేవా స్ఫూర్తిని చాటిన పారమిత విద్యార్థులు

### అధినేత డా. ప్రసాదరావు జన్మదినం సందర్భంగా అనాథ, వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 4 (జనంసాక్షి) :** పారమిత విద్యాసంస్థల అధినేత డా.ఇ. ప్రసాదరావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు సేవా స్ఫూర్తిని చాటారు. జన్మదిన వేడుకల్లో భాగంగా పారమిత ఫిలాంత్రఫీ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ, వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు, నగదు సహాయాన్ని అందజేశారు. రామడుగు మండలం వెలిచాల గ్రామంలో మంచికంట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పందన అనాథ వృద్ధుల ఆశ్రమానికి, జమ్మికుంటలో గోపరాజు వీరస్వామి ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్పందన ఆర్గనైజేషన్ వాలంటీర్ సంస్థకు పారమిత విద్యార్థులు నిత్యావసర సరుకులను అందించారు. ఇందులో 8 క్వింటాళ్ల బియ్యం, 17 కిలోల చింతపండు, 60 కిలోల పప్పు ధాన్యాలు, 35 లీటర్ల వంట నూనె ఉన్నాయి. పాఠశాల యాజమాన్యం తరఫున రూ.50 వేల నగదు సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా డా. ఇ. ప్రసాదరావు మాట్లాడుతూ... విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దానగుణం, ఔదార్యం, సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించాలనే ఉద్దేశంతో ఫిలాంత్రఫీ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, దానధర్మాల ప్రాధాన్యతను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులోనూ పారమిత విద్యాసంస్థల నుంచి మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, రాకేశ్, ప్రాచీ, అనుకర్‌రావు, వినోదరావు, వి.యు.ఎం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు, ప్రశాంత్, బాలాజీ, గోపీకృష్ణ, శ్రీకర్, శర్మిష్ఠ, కవిత ప్రసాద్, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయపురి ఎస్టీ బాలుర హాస్టల్‌లో లోపాలపై చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ గిరిజన సంఘం



**కరీంనగర్ టౌన్, ఆగస్టు 4 (జనంసాక్షి) :** విజయపురి ఎస్టీ బాలుర హాస్టల్‌లో గడువు ముగిసిన నాసిరకం సరుకులను వినియోగిస్తూ విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్న వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోడా మోహన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భీమా సాహెబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా ఉన్న హాస్టల్‌ను సందర్శించిన సంఘం ప్రతినిధులు విద్యార్థులతో కలిసి భోజనం చేసి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా గడువు ముగిసిన జీలకర్ర వంటి సరుకులు వంటలో ఉపయోగిస్తున్నట్లు, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. 120 మంది విద్యార్థులకు కేవలం నాలుగు లీటర్ల పాలు మాత్రమే అందిస్తున్నారని, నీళ్లు ఎక్కువగా కలిపిన మజ్జిగ, ఒకే రకం కూరతో భోజనం పెడుతున్నారని ఆరోపించారు. అలాగే యూనిఫార్ములు ఇప్పటికీ అందలేదని, పీఈటీ, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని, లేకపోతే గిరిజన విద్యార్థుల్లో డ్రాప్‌అవుట్లు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకులు కోరారు.

# ఆగస్టు 7 నుంచి ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలు

### ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ రాజు

**కల్వకుర్తి (జనంసాక్షి) :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఓపెన్ యూనివర్సిటీ) 2026-27 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలను ఆగస్టు 7 నుంచి ప్రారంభిస్తున్నట్లు కల్వకుర్తి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి, అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ బారోతు రాజు సంయుక్తంగా తెలిపారు. బీఏ,బీకాం,బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్,డిప్లొమా (10+2),ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు కూడా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. చదువును మధ్యలో నిలిపివేసిన వారు,ఉన్నత విద్యను కొనసాగించాలని భావిస్తున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీపాద శర్వాణి సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు కల్వకుర్తి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 7382929720, 9866058900 నంబర్లను సంప్రదించాలని అధ్యయనకేంద్రశీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజు కోరారు.



# ఎగువ మానేరు జలకళ

### రెండు రోజుల వర్షాలతో రైతుల్లో కొత్త ఆశలు..

### ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు

**గంభీరావుపేట, ఆగస్టు 4 జనంసాక్షి :** గత రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న విస్తారమైన వర్షాల ప్రభావంతో పాల్వంచ వాగు పరవళ్లు తొక్కుతోంది. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లోని నర్మాల ఎగువ మానేరు జలాశయానికి వరదనీరు చేరుతుండటంతో జలాశయం జలకళను సంతరించుకుంటోంది. ఇటీవల వర్షాభావంతో ఆందోళన చెందిన రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఊరట చెందుతున్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు పెరగడంతో పాటు భూగర్భ జలమట్టాలు మెరుగుపడతాయని, వరి సహా ఇతర పంటలకు ఈ వర్షాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇదే విధంగా కొనసాగితే సాగునీటి సమస్య కొంతవరకు తీరే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తాసిల్దార్ మారుతి రెడ్డి**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల ప్రజలకు తాసిల్దార్ మారుతి రెడ్డి కొన్ని సూచనలు చేశారు ఎగువ మానేరు పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎగువ మానేరు ప్రాజెక్ట్ మత్తడి పైనుంచి వరద నీరు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వాగు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ వాగు వైపు వెళ్లరాదు. అలాగే వాగు దాటేందుకు ప్రయత్నించకూడదు. వాగు పరిసర ప్రాంతాల్లో పశువులను మేత కోసం అవతలి గట్టుకు తీసుకువెళ్లడం, వాగు ఒడ్డున కట్టివేయడం వంటి చర్యలు కూడా చేయరాదు. తల్లిదండ్రులు చిన్నారులను వాగుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు పాటిస్తూ తమ ప్రాణాలు, ఆస్తులను కాపాడుకోవాలని తాసిల్దార్ మారుతి రెడ్డి తెలిపారు

# తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిపై లైంగిక వేధింపుల ఆరోపణ!?

### మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో కేసు నమోదు

### పరారీలో జనరల్ సెక్రెటరీ పృథీశ్వర్ రెడ్డి.. త్వరలోనే పట్టుకొని నిజాలు తేలుస్తామంటున్న పోలీసులు

**శేరిలింగంపల్లి, ఆగస్టు 04 (జనంసాక్షి) :** తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ పరిధిలో ఓ లైంగిక వేధింపుల ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృదీశ్వర్ రెడ్డి గత కొంతకాలంగా ఓ మైనర్ బాలికను మానసికంగా వేధించడంతోపాటు లైంగిక వేధింపులకు సైతం యత్నించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బాలిక తరపు వారి ఫిర్యాదు మేరకు ఆర్సి పురం పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ ను నమోదుచేసి తదుపరి దానిని మాదాపూర్ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేసినట్లు విశ్వాసనీయ సమాచారం. అయితే సమాచారం ముందస్తుగా తెలుసుకున్న బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పృదీశ్వర్ రెడ్డి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో పోలీసులు సైతం అంతే పట్టుదలతో అతని కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారని, అతడు పోలీసుల అదుపులోకి వస్తే తప్ప నిజానిజాలు వెలుగులోకి వచ్చే పరిస్థితి లేదని, బాస్కెట్ బాల్ అసోసియేషన్ పరిధిలో అసలు ఏం జరుగుతోంది...? ఎంతకాలంగా ఇలాంటి వేధింపులు కొనసాగుతున్నాయి...!? మైనర్ యువతిని లైంగికంగా వేధించిన వార్తలో ఎంతవరకు నిజం ఉంది అనేది సమాజానికి పోలీసులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

# రైతులు ఎరువుల కొనుగోలు ఇక యాప్ ద్వారానే..

### ఎరువుల విక్రయాల కోసం ఎఫ్.ఎఫ్.ఎస్ యాప్




**జడ్చర్ల, ఆగస్టు 4 (జనంసాక్షి) :** తెలంగాణలో అన్నదాతలకు ఎరువుల కొనుగోలు ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ నడుం బిగించాయి. ఇందులో భాగంగా ఎరువుల విక్రయాల కోసం ప్రభుత్వం ఎఫ్.ఎఫ్.ఎస్ (ఎరువుల విక్రయ ఫ్రేమ్‌వర్క్) పేరుతో సరికొత్త మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇక నుంచి రైతులు యూరియా, డీఏపీ, పొటాష్‌తో పాటు అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులను ఈ యాప్ ద్వారానే ముందస్తుగా బుక్ చేసుకొని కొనుగోలు చేయాల్సి ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ సరికొత్త విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. మహబూబ్ నగర్ జిల్లాలో ఆగస్టు 13 వ తేదీ నుంచి ఈ యాప్ రైతన్నలకు అందుబాటులోకి రానుంది.

**యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకునే విధానం:**

రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎఫ్.ఎఫ్.ఎస్ యాప్‌ను తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని యాప్ ఓపెన్ చేసుకొని ప్రక్రియ పూర్తి చేసే విధానం: ప్రారంభం: మొదటగా 'గెట్ స్టార్టెడ్ పై క్లిక్ చేసి, రాష్ట్రం పేరును ఎంచుకోవాలి. ధ్రువీకరణ: రైతు ఐడీ లేదా ఆధార్ నెంబర్‌ను నమోదు చేసి, ఫోన్‌కు వచ్చే సంక్షిప్త సందేశం (ఓటీపీ) ద్వారా ధ్రువీకరించాలి. ఇది పూర్తయితే రైతుకు సంబంధించిన భూమి వివరాలు స్వయంచాలకంగా తెరపైకి వస్తాయి. ఈ-కేవైసీ నమోదు: ఒకవేళ రైతు ఐడీ అందుబాటులో లేకపోతే, ఆధార్ నెంబర్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసి మొబైల్ నెంబర్‌తో అనుసంధానించవచ్చు. భూమి వివరాలు సరిగ్గా చూపించని పక్షంలో యాడ్ ల్యాండ్ ఆప్షన్ ద్వారా వాటిని నమోదు చేసుకోవాలి.

# శిథిల భవనాల కింద చిన్నారుల ప్రాణాలు

### పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ఉన్న తరగతి గదులు
### శిథిల గదిలో నాలుగు తరగతులు..
### ఆఫీస్ గదే తరగతిగది
### ఇప్పటికీ విద్యుత్ సౌకర్యానికి నోచుకోని పాఠశాల
### నిరుపయోగంగా కంప్యూటర్లు
### అయ్య వార్ల కోసం డిప్యూటేషన్‌పై వెళ్లిన టీచర్





**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 4 (జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను పేద విద్యార్థులకు అందించాలని ప్రభుత్వం సంకల్పించిన.. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అందుకు భిన్నంగా దారుణ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. విద్యార్థికి ఆంగ్లమధ్యం పునాది వేసే చోటే అందుకు అనువైన పరిస్థితి లేదు. ఇక కార్పొరేట్ స్థాయి విద్య పేద విద్యార్థికి ఎలా అందుతుంది అన్నది ప్రశ్న.. వివరాల్లోకి వెళ్తే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తాండూర్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాథమిక పాఠశాలలో దారుణ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. బొమ్రాస్పేట్ మండలం లింగన్ పల్లి మండల ప్రాథమిక పాఠశాలలో రెండు తరగతి గదులు పెచ్చులూడి విద్యార్థులపై పడుతున్నాయి. ఈ రెండు గదులు శిథిలవస్థకు చేరి ఎప్పుడైనా కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వర్షాకాలంలో చినుకు పడితే చాలు తరగతి గదుల్లోకి నీళ్లు వచ్చేస్తాయి. ఈ పాఠశాలలో 41 మంది బాల బాలికలు చదువుకుంటున్నారు. ఒక గదిలో పెచ్చులూడి విద్యార్థులపై పడడంతో ఆ గదిని ఖాళీ చేయించి శిథిలవస్థలో ఉన్న మరో తరగతి గదిలో నాలుగు తరగతుల విద్యార్థులను ఒకే చోట కూర్చోబెట్టి ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాడు. ఆ తరగతి గదిలో కూడా పెచ్చులూడి పడుతున్నాయి. ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు సరైన తరగతి గదులు లేకపోవడంతో శిథిలవస్తుల ఉన్న తరగతి గదిలోనే విద్యార్థులను కూర్చోబెట్టి విద్యాబోధన చేస్తున్నారు. ఆ చిన్న గది విద్యార్థులకు సరిపోకపోవడంతో ప్రధానోపాధ్యాయుడి గదిలో మరో తరగతి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. అదే గదిలో స్టోర్ రూమ్ అల్మారాలు ఉన్నాయి. ప్రధానోపాధ్యాయుడి గది విద్యార్థులకు సౌకర్యంగా లేదు. దీంతో పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో పేరెంట్స్ కమిటీ మీటింగ్ జరిగినప్పుడు విద్యార్థులకు సెలవిచ్చినట్లే. ప్రధానోపాధ్యాయుడి గదిలో సమావేశం ఉంటున్న కారణంగా ఆరోజు విద్యార్థులకు సరిగ్గా చదువు చెప్పలేని దుస్థితి నెలకొంది. శిథిలవస్థకు చేరిన ఈ రెండు గదులను కూల్చివేయడానికి సిద్ధంగా ఉన్న విద్యార్థులకు సరియైన గదులు లేని కారణంగా అందులోనే చాలీచాలని వసతులతో ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటివరకు పాఠశాలకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. పాఠశాలకు మంజూరైన రెండు కంప్యూటర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీంతో కంప్యూటర్ బోధన మూల పడింది.

**అయ్యవార్ల కోసం డిప్యూటేషన్‌పై వెళ్లిన టీచర్**

అసలే ఉపాధ్యాయుల కొరత ఆపై అక్కడ పనిచేసే ఒక ఉపాధ్యాయుడిని మండల విద్యాధికారి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేయడానికి డిప్యూటేషన్ పై బదిలీ చేశారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉండవలసిన పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు మాత్రమే విద్యా బోధన చేస్తున్నాడు. ఏదైనా మండల సమావేశం ఉంటే ఆ ఉపాధ్యాయుడు కూడా విద్యార్థులకు విద్య బోధన చేసే అవకాశం ఉండదు.

**పందికొక్కుల స్వైర విహారం**

ఇది ఇలా ఉండగా శిథిలవస్థకు చేరిన పాఠశాల భవనాన్ని వదిలివేస్తే అందులో అంగన్ వాడి కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. జీరో నుంచి నాలుగు సంవత్సరాల లోపు పిల్లలంతా అంగన్వాడి కేంద్రంలో పౌష్టిక ఆహారం తీసుకుంటారు. వీరితోపాటు బాలింతలు గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం అందుతుంది. అయితే భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పందికొక్కులు ఎలుకలు అంగన్వాడీ కేంద్రంలో గదిలో స్వైర విహారం చేస్తున్నాయి. పిల్లలకు తల్లులకు ఇవ్వవలసిన పౌష్టిక ఆహారంతో



పాటు వారి భోజనానికి ఉపయోగించే బియ్యాన్ని నాశనం చేస్తున్నాయి. జీరో నుంచి నాలుగు సంవత్సరాలలోపు పిల్లలు అదే గదిలో విశ్రాంతి తీసుకోవలసి ఉంటుంది. పందికొక్కులు ఎలుకలు చేసిన రంధ్రాల కారణంగా ఎటువైపు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని అంగన్వాడి టీచర్ ఆందోళన చెందుతుంది. అంగన్వాడీ టీచర్ ఆయా ఆ గదిలో విశ్రాంతి తీసుకుంటున్న చిన్నారులను ఎలుకలు పందికొక్కుల నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. తమకు తక్షణమే కొత్త అంగన్వాడీ భవనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఇదిలా ఉంటే దయనీయ స్థితిలో విద్యాబోధన చేస్తున్న విద్యార్థులకు అనుగుణంగా తరగతి గదులను నిర్మించి ఇవ్వాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో మొబైల్ సేవలు అందుబాటులో లేవని నెట్వర్క్ అందుబాటులోకి వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి చేశారు.



# స్థిరమైన సమాజ నిర్మాణంలో తల్లి పాలు చాలా అవసరం

### డాక్టర్ రమేష్ బాబు దంపూరి

**శామీర్ పేట్, ఆగస్టు 4(జనంసాక్షి) :** ప్రపంచ తల్లిపాల వారోత్సవం--2026 సందర్భంగా ఐఏపీ తెలంగాణ స్టేట్ బ్రాంచ్, ట్విన్ సిటీస్ బ్రాంచ్ ఆఫ్ ఐఏపీ , నేషనల్ నియోనాటాలజీ ఫోరం--తెలంగాణ స్టేట్ చాప్టర్‌లి సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల శామీర్‌పేట్‌లో జీవితానికి స్థిరమైన ప్రారంభం కోసం తల్లిపాలు - ఇప్పటికే ఉన్న మంచి విధానాలను మరింత బలోపేతం చేద్దాం అనే అంశంపై వక్తృత్వ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్విన్ సిటీస్ బ్రాంచ్ ఆఫ్ ఐఏపీ అధ్యక్షులు డాక్టర్ రమేష్ బాబు దంపూరి ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాల ప్రాముఖ్యత, తల్లి--శిశు ఆరోగ్య పరిరక్షణలో వాటి పాత్ర, ఆరోగ్యవంతమైన స్థిరమైన సమాజ నిర్మాణంలో తల్లిపాల అవసరాన్ని విద్యార్థినులకు వివరించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాగ్యలక్ష్మి విద్యార్థినులకు విలువైన సూచనలు అందించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి డాక్టర్ కె. అనిత కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ, తల్లి, శిశు ఆరోగ్యంపై యువతలో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ వక్తృత్వ పోటీలో మొత్తం 20 మంది విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రసంగాలతో ఆకట్టుకున్నారు.

# తాండ చిన్నది... ప్రభుత్వ కొలువులే పెద్దవి!

### నేరాల్ తాండా యువతకు ఆదర్శం



**గాంధారి, ఆగస్టు 4 (జనంసాక్షి):** చిన్న తాండా... కానీ ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో పెద్ద గుర్తింపు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని నేరాల్ తాండా ప్రభుత్వ ఉద్యోగాల కేరాఫ్‌గా నిలుస్తోంది. సుమారు 3 వేలలోపు జనాభా, 530 కుటుంబాలు ఉన్న ఈ తాండాలో ఇప్పటికే 32 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం విశేషం. వారిలో 21 మంది ఆర్మీ జవాన్లు, 8 మంది పోలీసు శాఖలో, ముగ్గురు ఉపాధ్యాయులు, లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం తాండాలో 30-40 శాతం కుటుంబాల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా, 2027 నాటికి ఈ సంఖ్యను 70 శాతానికి చేర్చాలనే లక్ష్యంతో యువత కృషి చేస్తోంది. పదో తరగతి, ఇంటర్ నుంచే విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఉద్యోగం సాధించిన వారిని గ్రామ పెద్దలు సన్మానిస్తూ, వారి అనుభవాలను చిన్నారులతో పంచుకునే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో చిన్న వయసులోనే ప్రభుత్వ ఉద్యోగాలపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. లబాణా లంబాడీలు ప్రస్తుతం బీసీ-డీ వర్గంలో ఉన్నందున తగిన రిజర్వేషన్ ప్రయోజనాలు అందడం లేదని, ఎస్టీ హోదా లభిస్తే మరింత మంది యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే అవకాశాలు పెరుగుతాయని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రిని కూడా కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఆర్మీ జవాన్ బస్సి రమేష్ మాట్లాడుతూ, చిన్న తాండా నుంచి ఇంతమంది ప్రభుత్వ ఉద్యోగులు రావడం గర్వకారణమని, మరింత మంది యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగి మేగరాజ్ మాట్లాడుతూ, కష్టాలను అధిగమించి పట్టుదలతో ప్రయత్నిస్తే లక్ష్యాన్ని తప్పకుండా సాధించవచ్చని, తాము ఎదుర్కొన్న ఇబ్బందులు నేటి యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.




### సిఎంసి పరిధిలో సెహత్ సురక్షా పాలసీకింద

# దేశంలోనే తొలి బీమా క్లెయిం

**శేరిలింగంపల్లి, ఆగస్టు 4 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి), ఇండియన్ బ్యాంక్, నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ సంయుక్త సహకారంతో అమలుపరుస్తున్న సెహత్ సురక్షా పాలసీ కింద దేశంలోనే తొట్టతొలి 20 లక్షల రూపాయల బీమా క్లెయిం విజయవంతంగా పరిష్కరించబడింది. రోడ్డుప్రమాదంలో మృతి చెందిన వీధి వ్యాపారి మరియు స్వయం సహాయక సంఘం (ఎస్.హెచ్.జి) సభ్యుడు బబ్బూరి రాజు భార్య బబ్బూరి మాధవికి ఈ బీమా క్లెయిం మంజూరు చేయబడింది. గతంలో హైదరాబాద్‌లోని ఇండియన్ బ్యాంక్ మైక్రోస్టేట్ బ్రాంచ్ ద్వారా స్వయం సహాయక సంఘ రుణం పొందిన సందర్భంగా రాజు సెహత్ సురక్షా పాలసీ పరిధిలో బీమా రక్షణ పొందారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ వి.వి.ఎల్. సుభద్రాదేవి సమక్షంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఇండియన్ బ్యాంక్, నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు మరియు స్వయం సహాయక సంఘ సభ్యుల సమక్షంలో క్లెయిం చెక్కును శ్రీమతి బబ్బూరి మాధవి గారికి అందజేశారు. ఈ చారిత్రాత్మక క్లెయిం పరిష్కారం స్వయం సహాయక సంఘ సభ్యులకు బీమా రక్షణ ఎంత ముఖ్యమో తెలియజేస్తూ, ఆర్థిక సమగ్రత, సామాజిక భద్రత మరియు బలహీన వర్గాల కుటుంబాల సంక్షేమం పట్ల సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మరియు భాగస్వామ్య సంస్థల నిబద్ధతను ప్రతిబింబిస్తోంది.

# హైదరాబాద్ విమానాశ్రయం నుంచి బోయింగ్ 777 ఫ్రైటర్ సేవలు

**శంషాబాద్, ఆగస్టు4 (జనంసాక్షి)** తైపే-హైదరాబాద్-దుబాయ్ మార్గంలో ఎమిరేట్స్ స్కైకార్గో ప్రత్యేక బోయింగ్ 777 ఫ్రైటర్ సేవలు ప్రారంభమయ్యాయి. 100 టన్నులకు పైగా కార్గో రవాణా సామర్థ్యం కలిగిన ఈ సేవతో ఔషధాలు, లైఫ్ సైన్సెస్ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, త్వరగా పాడయ్యే వస్తువుల రవాణా మరింత సులభతరం కానుంది. ఈ కొత్త కారిడార్‌తో తైపే, హైదరాబాద్, దుబాయ్‌ల మధ్య వాణిజ్య అనుసంధానం బలోపేతం కావడంతో హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రముఖ కార్గో హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుంది.

# 7, 8న ఐఐటీ హైదరాబాద్‌లో 'యోలో సమ్మిట్-26'



**ఖైరతాబాద్, ఆగస్టు 04 (జనం సాక్షి):** ది ప్రీమియా అకాడమీ ఆధ్వర్యంలో 8-12 తరగతుల విద్యార్థు ల కోసం యోలో సమ్మిట్-2026ను ఆగస్టు 7, 8 రెండు రోజులపాటు ఐఐటీ హైదరాబాద్‌లో నిర్వ హించనున్నట్లు ది ప్రీమియా అకాడమీ ప్రిన్సిపాల్ తృప్తి రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో భవిష్యత్ కెరీర్ సంసిద్ధత, నాయకత్వం, వ్యవస్థాపకత, ఆర్థిక అక్షరాస్యత, కృత్రిమ మేధ(ఏఐ), కమ్యూనికేషన్, పర్సనల్ బ్రాండింగ్ వంటి అంశాలపై నిపుణులతో వర్క్‌షాప్‌లు, ప్యానెల్ చర్చలు, మాస్టర్‌క్లాస్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఉత్సు కత, ఆత్మవిశ్వాసం, విమర్శనాత్మక ఆలోచన, భవి ష్యత్‌కు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించ డమే సమ్మిట్ లక్ష్యమని తెలిపారు. అకాడమీ వ్యవస్థాపకురాలు, యజమాని సింధూరి రెడ్డి మాట్లాడుతూ వ్యవస్థాపక ఆలోచనా విధానం, ఆవిష్కరణ, నాయకత్వ లక్షణాలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఈ సమ్మిట్ దోహదపడుతుం దని పేర్కొన్నారు. సమ్మిట్‌కు రిజిస్ట్రేషన్లు ప్రారం భమైనట్లు తెలిపారు.

# వరంగల్, హనుమకొండ బస్టాండ్లలో ఎండీ నాగిరెడ్డి ఆకస్మిక తనిఖీలు




**ముషీరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి వరంగల్, హనుమకొండ ప్రధాన బస్టాండ్లు, హనుమకొండ డిపోలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులకు అందుతున్న సేవలు, డిపో నిర్వహణ, మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వరంగల్ నగర ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ ూవీ వదీబం ావఝు' పథకం కింద మరో 100 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం వరంగల్ రీజియన్‌లో 112 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని తెలిపారు. బస్టాండ్లలో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మహిళా ప్రయాణికుల భద్రత, వెయిటింగ్ హాళ్ల నిర్వహణ, బస్సుల సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రీజినల్ మేనేజర్, డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశమైన నాగిరెడ్డి బస్సు రూట్లు, ఆక్యుపెన్సీ నిష్పత్తి, ఉద్యోగుల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సురక్షితమైన, నాణ్యమైన ప్రయాణాన్ని అందించడమే సంస్థ ప్రధాన ధ్యేయమని ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. ప్రయాణికులకు సేవలందించడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించబోమని, ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 9 వేలకుపైగా బస్సుల ద్వారా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులకు ఆర్టీసీ సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాలో ప్రజా రవాణా సేవలను మరింత ఆధునీకరించి, ప్రయాణికులకు సురక్షితమైన, వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రాజశేఖర్, చీఫ్ సివిల్ ఇంజినీర్ కవిత, వరంగల్ రీజినల్ మేనేజర్ భవానీ ప్రసాద్‌తో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### బోనగిరి ఎల్లమ్మ ఆలయంలో

# భక్తుల నుంచి నిలువు దోపిడీ..?

### డబ్బులు ఇస్తేనే బోనం..డబ్బులు ఇస్తేనే బియ్యం
### ఎల్లమ్మ సన్నిధిలో భక్తులకు ఇబ్బందులు



**భువనగిరి (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలోని శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయంలో భక్తుల నుంచి బలవంతపు వసూళ్లు జరుగుతున్నాయంటూ పలువురు భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్మవారిపై అపారమైన భక్తితో మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులను ఆలయ నిర్వాహకులు ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, కనీస మర్యాద కూడా పాటించడం లేదని ఆరోపిస్తున్నారు.

"ఎల్లమ్మ తల్లి మా కష్టాలు తొలగిస్తుందని, మొక్కులు తీర్చుకుంటే మనశ్శాంతి లభిస్తుందని" నమ్మి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భువనగిరి ఎల్లమ్మ ఆలయానికి వస్తుంటారు. అయితే ఆలయంలో పరిస్థితి మాత్రం భక్తుల ఆశలకు పూర్తి విరుద్ధంగా ఉందని వారు వాపోతున్నారు. భక్తుల ఆరోపణల ప్రకారం, బోనం సమర్పించాలంటే రూ.500, బియ్యం పోయాలన్నా రూ.500, అమ్మవారికి బియ్యం సమర్పించాలంటే మరో రూ.300 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని చెబుతున్నారు. "డబ్బులు ఇస్తేనే బోనం... డబ్బులు ఇస్తేనే బియ్యం... లేదంటే వెళ్లిపోండి" అనే విధంగా సిబ్బంది వ్యవహరిస్తున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీరు, విశ్రాంతి, క్యూలైన్ వంటి కనీస సౌకర్యాలు కూడా సరిగా లేవని వారు చెబుతున్నారు. అంతేకాకుండా భక్తులతో ఆలయ సిబ్బంది మాట్లాడే తీరు కూడా అభ్యంతరకరంగా ఉందని, గౌరవప్రదంగా వ్యవహరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దైవదర్శనం కోసం వచ్చే భక్తులకు ప్రశాంత వాతావరణం కల్పించాల్సిన ఆలయంలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడం బాధాకరమని భక్తులు అంటున్నారు. భక్తుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని ఆలయంలో వసూళ్ల వ్యవస్థ నడుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆలయంలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న బలవంతపు వసూళ్లపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టాలని, ఆలయ నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలని, భక్తులకు గౌరవప్రదమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# ప్రభుత్వ భూమిని రక్షించండి

### ఎంఆర్‌ఓకు ఫిర్యాదు



**నిజాంపేట్ ఆగస్టు 4 (జనంసాక్షి) :** దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ సర్వే నంబర్ 472లో హౌసింగ్ బోర్డు కోసం కేటాయించిన సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసి వెంచర్‌గా అభివృద్ధి చేసి అమాయక ప్రజలకు ప్లాట్లుగా విక్రయిస్తున్నారని, దీనివల్ల కొనుగోలుదారులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆకుల సతీష్ తెలిపారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని రక్షించాలని ఈ మేరకు మంగళవారం ఆకుల సతీష్ నేతృత్వంలో దుండిగల్ ఎంఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. ఇదే భూమిపై 2024లో కూడా అక్రమ కబ్జాల ప్రయత్నాలు జరగగా అధికారులు వాటిని కూల్చివేశారని ఆయన గుర్తు చేశారు. అయితే ఇటీవల హౌసింగ్ బోర్డుకు కేటాయించిన ఈ ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ వేయకపోవడంతో కబ్జాదారులు మళ్లీ రెచ్చిపోయి వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో అక్రమ కబ్జాదారులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు ప్రభుత్వ భూమికి శాశ్వత ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని ఎంఆర్‌ఓను కోరినట్లు తెలిపారు. ఈ అక్రమ కబ్జాలపై వెంటనే స్పందించిన దుండిగల్ ఎంఆర్‌ఓ రాజేశ్వర్ రెడ్డి ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన మూడు బేస్‌మెంట్‌లను తొలగించే చర్యలు చేపట్టారు. అలాగే త్వరలో హౌసింగ్ బోర్డు అధికారులతో కలిసి జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని పూర్తిస్థాయిలో రక్షిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించిన దుండిగల్ ఎంఆర్‌ఓ రాజేశ్వర్ రెడ్డికి ఆకుల సతీష్ ధన్యవాదాలు తెలిపారు.

# మై భారత్, రెడ్‌క్రాస్ నమోదును వేగవంతం చేయాలి

- నషా ముక్త్ భారత్ లో విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషించాలి
- రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా



**హైదరాబాద్, ఆగస్టు 4 (జనంసాక్షి) :** మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు, "నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్" కార్యక్రమాలను మిషన్ మోడ్‌లో చేపట్టి రాష్ట్రానికి నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులకు పిలుపునిచ్చారు. ప్రతి విశ్వవిద్యాలయం రోజువారీ పురోగతిని సమీక్షించడంతో పాటు ప్రతి కళాశాలలో నోడల్ అధికారి, స్టూడెంట్ అంబాసిడర్ లను నియమించి విద్యార్థుల నమోదును వేగవంతం చేయాలని సూచించారు. మంగళవారం లోక్ భవన్ లో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో రాష్ట్ర గవర్నర్ సమావేశం నిర్వహించి నషా ముక్త్ భారత్ కింద విశ్వవిద్యాలయాల పరిధిలో చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు , మై భారత్, రెడ్‌క్రాస్ నమోదు పురోగతి పై సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్–2047' లక్ష్య సాధనలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' కీలకమైన ప్రజా ఉద్యమమని గవర్నర్ పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్ తోనే వికసిత్ భారత్ కు బలమైన పునాది అని పేర్కొన్నారు. దేశ బలం యువతేనని, ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణ కలిగిన, చైతన్యవంతమైన యువతతోనే ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. నషా ముక్త్ భారత్ లో విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషించాలన్నారు. మై భారత్ పోర్టల్‌లో తెలంగాణకు 14.90 లక్షల నమోదుల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు 4.04 లక్షల నమోదులు పూర్తయ్యాయని గవర్నర్ పేర్కొన్నారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు తదితర యువతతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించడంతో పాటు 100 వారాల అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములను చేయాలని సూచించారు.

గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్ మాట్లాడుతూ మూడు నెలల్లో 60 వేలకుపైగా కొత్త సభ్యులు చేరడంతో మొత్తం సభ్యత్వం 1.17 లక్షలకు చేరిందని తెలిపారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదానం, విపత్తు సహాయక చర్యలు, థలసేమియా రోగులకు సేవలు, ప్రథమ చికిత్స శిక్షణ, యువ రెడ్‌క్రాస్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయాల్లో యూత్ రెడ్‌క్రాస్ యూనిట్ల ద్వారా రక్తదాన శిబిరాలు, విపత్తు నిర్వహణ, నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి కె శశికిరణా చారి, ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ కుమార్ షండిల్య, మై భారత్ డైరెక్టర్ అన్వేష్, విశ్వవిద్యాలయాల ఉపకుల పతులు, రిజిస్ట్రార్ లు తదితరులు పాల్గొన్నారు

# వీరమాత వేదమ్మ కన్నుమూత



## కుటుంబాన్నే ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన త్యాగమూర్తి

## భౌతికకాయాన్ని గద్వాల వైద్య కళాశాలకు దానం

**గద్వాల (జనంసాక్షి) : ప్రజా ఉద్యమాలకు, సామాజిక చైతన్యానికి తన కుటుంబాన్నే అంకితం చేసిన వీరమాత వేదమ్మ (86) మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని బాగ్ అంబర్‌పేట్‌లో తన కుమార్తె జ్యోతి నివాసంలో నిద్రలోనే తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల ప్రజా సంఘాల నాయకులు, ఉద్యమకారులు, బంధుమిత్రులు, గద్వాల ప్రజలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వేదమ్మ భర్త దివంగత బన్నూరు రామిరెడ్డి (ఎల్ఐసీ రామిరెడ్డి) ఎమర్జెన్సీ కాలం నుంచే అభ్యుదయ భావాలతో ప్రజల్లో చైతన్యం నింపిన ప్రముఖ ఉద్యమకారుడు. విద్యార్థులు, యువతలో సామాజిక స్పృహ పెంపొందించేందుకు విశేషంగా కృషి చేసి తెలంగాణలో తొలి తరం విప్లవ భావజాలాన్ని విస్తరించడంలో కీలక పాత్ర పోషించారు.**




ఆ దంపతులు తమ కుటుంబ సభ్యులను కూడా ప్రజా సేవ, ఉద్యమాల బాటలో నడిపించారు. పెద్ద కుమార్తె సుగుణ (హరిత) విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పనిచేసి అనంతరం పూర్తికాల ఉద్యమ కార్యకర్తగా నల్లమల్ల, మెదక్ ప్రాంతాల్లో సేవలందించారు. మెదక్ జిల్లా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన ఆమె పల్నాడు ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారు. రెండో కుమార్తె జ్యోతి చైతన్య మహిళా సంఘం నాయకురాలిగా పని చేస్తున్నారు. ఆమె భర్త, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పురుషోత్తంను 2001లో నయీమ్ ముఠా దారుణంగా హత్య చేసింది. కుమారుడు కొండారెడ్డి ప్రజా న్యాయ వాదిగా ప్రజలకు న్యాయసేవలు అందిస్తుండగా, మరో కుమార్తె విజయ మహంతి సామాజిక చైతన్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటు న్నారు.ఆమె చిన్నల్లుడు మహంతి వెంకట్ రావు సామాజిక స్పృహ కలిగిన పాత్రికేయుడు.

మరణానంతరం కూడా సమాజానికి ఉపయోగపడాలనే సంకల్పంతో వేదమ్మ భౌతిక కాయాన్ని గద్వాల ప్రభుత్వ వైద్య కళాశాలకు వైద్య విద్యార్థుల అధ్యయనం, పరిశోధనల కోసం దానం చేయడం ఆమె కుటుంబం సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచింది. ప్రజా ఉద్యమాలకు ప్రేరణగా నిలిచిన వేదమ్మ మరణం గద్వాల ప్రాంతానికే కాక తెలంగాణ ప్రజా ఉద్యమ వర్గాలకు తీరని లోటని పలువురు ప్రముఖులు, ప్రజాసంఘాల నాయకులు నివాళు లర్పిస్తూ పేర్కొన్నారు.



# జూరాలకు ఉధృతంగా కృష్ణమ్మ



- 33 గేట్లు ఎత్తివేత
- దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

**దరూరు, ఆగస్టు 4 (జనంసాక్షి) :** మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద ఉధృతంగా రావడంతో జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కళకళలాడుతోంది.సోమవారం సాయంత్రం 6:30 గంటలకు ప్రాజెక్టులోకి 2 లక్షల 41 వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా నీటిపారుదల శాఖ అధికారులు 33 గేట్లను ఎత్తి 2 లక్షల 21 వేల క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే ద్వారా కృష్ణా నదిలోకి దిగువకు విడుదల చేస్తున్నారు.పవర్ హౌస్ ద్వారా కూడా 32 వేల క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్నారు. దీంతో ప్రాజెక్టు నుంచి మొత్తం 2 లక్షల 53 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది.

ప్రాజెక్టు నీటిమట్టం 317.53 మీటర్లు కాగా ప్రస్తుత నిల్వ 7.701 టీఎంసీలు, పూర్తి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు,ఎగువ నుంచి ఇంకా వరద కొనసాగే అవకాశం ఉన్నందున అధికారులు ప్రాజెక్టును 24 గంటల పాటు పర్యవేక్షిస్తున్నారు. అవసరమైతే మరిన్ని గేట్లను ఎత్తేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు.

### దిగువకు హెచ్చరిక

కృష్ణా నది దిగువన ఉన్న గద్వాల, అలంపూర్, వడ్డేమాన్ తదితర మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది పరివాహక ప్రాంతాల్లోకి, దిగువ వంతెనలపైకి ఎవరూ వెళ్లవద్దని నీటిపారుదల శాఖ అధికారులు సూచించారు. రైతులు తమ పశువులను, వస్తువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు.ప్రాజెక్టు వద్ద భారీగా నీరు గర్జిస్తూ ప్రవహిస్తుండటంతో పర్యాటకులు, స్థానికులు చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

# సీఎం ప్రజావాణిలో కొత్తగా మీ-సేవా కేంద్రం ఏర్పాటు

- ప్రారంభించిన చిన్నారెడ్డి.. పాల్గొన్న విద్యాసాగర్, రవి కిరణ్
- సీఎం ప్రజావాణిలో 321 దరఖాస్తులు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** సీఎం ప్రజావాణిలో కొత్తగా ఏర్పాటు చేసిన మీ–సేవా కేంద్రాన్ని సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ ఆఫీసర్ కే. విద్యాసాగర్, మీ - సేవా డైరెక్టర్ రవికిరణ్ లతో కలిసి మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. సీఎం ప్రజావాణికి రాష్ట్రవ్యాప్తంగా వచ్చే దరఖాస్తుదారులకు వివిధ అంశాలపై సేవలు అందించేందుకు ఉద్దేశించి మీ - సేవా కేంద్రాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ కోసం కానీ, వివిధ శాఖల నుంచి పలు అంశాలపై ధృవ పత్రాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ మీ–సేవా కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని దాదాపు అన్ని శాఖల డెస్క్ లకు అదనంగా మీ - సేవా కేంద్రం సేవలు సీఎం ప్రజావాణిలో అందుబాటులోకి వచ్చాయి. కాగా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణిలో 321 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్ జి చిన్నారెడ్డి స్టేట్ నోడల్ అధికారి కే విద్యాసాగర్ దరఖాస్తులు స్వీకరించి వాటిపై ఎండార్స్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ శాఖకు 144, రెవెన్యూ శాఖకు 51, హోంశాఖకు 25, ప్రవాసి ప్రజావాణికి 2, ఇతర శాఖలకు 99 దరఖాస్తులు అందాయి. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్ లలో విధులు నిర్వహిస్తున్న కంటిన్జెన్సీ ఉద్యోగులు తమకు 18 నెలల వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని దరఖాస్తులు అందజేశారు. వెంటనే స్పందించిన చిన్నారెడ్డి డిజిపి సీవీ ఆనంద్ కు ఫోన్ చేసి సమస్యను వివరించి వేతనాలు వెంటనే అందించే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్నారై సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డి, సమన్వయకర్త బొజ్జ అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 6న ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సభ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సభను ఈ నెల 6వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్, బషీర్‌బాగ్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ వికాస సమితి అధ్యక్షులు వనపట్ల సుబ్బయ్య అధ్యక్షత వహించనున్నారు. ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్ విశిష్ట అతిథిగా పాల్గొంటారు. ఈ సందర్భంగా 'జెన్–జీ ఉద్యమం – ప్రభావాలు, పరిణామాలు" అంశంపై ప్రముఖ సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ ఆచార్య జయశంకర్ స్మారకోపన్యాసం చేయనున్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత దేశ్‌పతి శ్రీనివాస్, ఉద్యోగ సంఘం నాయకుడు దేవి ప్రసాద్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ అధ్యక్షుడు అయాచితం శ్రీధర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ తదితరులు పాల్గొని ప్రసంగించనున్నారు. తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లో మరింత విస్తరించేందుకు నిర్వహిస్తున్న ఈ జయంతి సభకు మేధావులు, విద్యార్థులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, తెలంగాణవాదులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ వికాస సమితి నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# సంప్రదాయాలకు సరికొత్త వేడుకగా ఐవీఎఫ్ ఆషాఢం గోరింటాకు సంబరాలు

## మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన కార్యక్రమం

- మహిళల అభ్యున్నతికి ఐవీఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త



**హైదరాబాద్ (జనంసాక్షి) :** చైతన్యపురిలోని వాసవి భవన్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢం గోరింటాకు సంబరాలు, ఫ్రెండ్షిప్ డే వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. తెలంగాణ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో మహిళలు హాజరై సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఐవీఎఫ్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఆషాఢ మాసం తెలుగు సంస్కృతిలో ఎంతో విశిష్టమైనదని, గోరింటాకు మహిళల ఆనందం, ఆప్యాయత, కుటుంబ బంధాలకు ప్రతీక అని అన్నారు. ఇలాంటి సంప్రదాయ వేడుకలు మన సంస్కృతిని భావితరాలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తున్న ఈ తరుణంలో వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తోందని ఉప్పల శ్రీనివాస్ గుప్తా తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, మహిళలు ఆర్థికంగా, సామాజి కంగా, సాంస్కృతికంగా మరింత బలోపేతం కావడానికి ఐవీఎఫ్ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఐవీఎఫ్ సౌత్ ఇండియా ఇన్‌చార్జ్ ఉప్పల స్వప్న మాట్లాడుతూ మహిళలు పరస్పరం స్నేహభావంతో, ఐక్యతతో ముందుకు సాగాలని, సంప్రదాయాలను కాపాడుకుంటూనే సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన గోరింటాకు వేడుకలు, కిట్టీ పార్టీ, ఫ్రెండ్షిప్ డే సెలబ్రేషన్స్, వన్ మినిట్ గేమ్స్, పాటలు, వినోద కార్యక్రమాలు మహిళలను విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం అందరూ కలిసి భోజన కార్యక్రమంలో పాల్గొని ఆత్మీయ వాతావరణంలో వేడుకలను విజయవంతం చేశారు. అనంతరం ఐవీఎఫ్ గ్రేటర్ హైద్రాబాద్ మహిళ విభాగం సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీమతి లెంకలపల్లి మంజుల రాజు, ఐవీఎఫ్ యువ జన సంఘం అధ్యక్షులు కట్ట రవి కుమార్ గుప్త, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నవీన్ కుమార్, భువనగిరి ఐవీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ శ్రీధర్, ఐవీఎఫ్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కరుణ ,మేడ్చల్ జిల్లా మహిళ ఐవీఎఫ్ అధ్యక్షురాలు సుజాత, హైదరాబాద్ జిల్లా ఐవీఎఫ్ అధ్యక్షురాలు అన్నపూర్ణ రాష్ట్ర మహిళా కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ జిల్లాలు, నియోజకవర్గాలు, డివిజన్లకు చెందిన ఐవీఎఫ్ మహిళా కమిటీ సభ్యులు, మహిళామణులు పాల్గొన్నారు.











Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370